అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 14-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 44 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు | వెల : 6.50

త్రిపురలో గూండాగిరి..

ప్రతిపక్షాల మద్దతుదారులే లక్ష్యంగా బెదిరింపులు

- కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుసుకున్న సీపీఐ(ఎం) నాయకులు
- స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి లేదు : సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : త్రిపురలో ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా జరిగే పరిస్థితులు లేవని సీపీఐ(ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతిపక్షాల మద్దతుదారులే లక్ష్యంగా అధికార బీజేపీ హింస, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించింది. ఈమేరకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యుడు నీలోత్పల్ బసు, సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యుడు మురళీధరన్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం సోమవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ...8లో

దిగొచ్చిన కేంద్రం



పేరుకే పెద్దాస్పత్రులు

క్యాన్సర్ రోగులకు రెఫరల్ ఆస్పత్రులే దిక్కు

- కేంద్రం పరిధిలోని దవాఖానాల్లో విచిత్ర పరిస్థితి
- నిధులు, స్థలం ఉన్నా...క్యాన్సర్ విభాగానికి దిక్కు లేదు
- రైల్వే సొమ్మూ....కార్పొరేట్‌లకే...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేరుకు అవి పెద్దాస్పత్రులు. ముఖ్యమైన విభాగాలు మాత్రం ఉండవు. గతంలో అంటు రోగాలతో మరణించే వారి సంఖ్య ఎక్కువగా ఉండేది. పారిశుధ్య నిర్వహణ, ఇతరత్రా తీసుకున్న జాగ్రత్తలతో దాని స్థానంలో అసాంక్రమిత వ్యాధులు (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ -ఎన్‌సీడీ) ఆక్రమించాయి. ఆయా రోగాలతో మరణిస్తున్న వారిలో కార్డియో వ్యాస్కులర్ డిసీజెస్‌తో మరణిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దాని తర్వాత అత్యధిక అకాల మరణాలకు క్యాన్సర్ కారణమవుతున్నది. గత పదేండ్లలో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య 25 శాతం పెరిగిందంటే రోగులకు పెంచాల్సిన సౌకర్యాల అవసరమెంత ఉందో అర్థమవుతుంది. కేంద్ర కార్మికశాఖ అధీనంలో ఉండే సనత్‌నగర్ ఈఎస్‌ఐ మెడికల్ కాలేజీతో పాటు అక్కడి ఆస్పత్రిలో, రైల్వేశాఖ పరిధిలోని లాలాగూడ రైల్వే సెంట్రల్ ఆస్పత్రి, కేంద్ర ఆరోగ్యశాఖ పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో గానీ క్యాన్సర్‌కు సంబంధించి ప్రత్యేక విభాగాలు లేకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా ఈఎస్‌ఐ లబ్దిదారులున్నారు. వీరే కాకుండా రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఇతర రాష్ట్రాల రోగులను కూడా సనత్‌నగర్ ఈఎస్‌ఐకే రెఫర్ చేస్తుంటారు. అయితే క్యాన్సర్ బారిన పడి వచ్చే రోగులకు ఆధునాతన చికిత్సల కోసం నిమ్స్‌కు రెఫర్ చేస్తుంటారు. అయితే ఇప్పటికే చేసిన చికిత్సలకు ఈఎస్‌ఐ సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో నగదు రహిత చికిత్స చేసేందుకు నిమ్స్ నిరాకరిస్తున్నది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు క్యాన్సర్ విభాగం ఏర్పాటు చేసుకునే స్థలం, కోట్లాది రూపాయల నిధులు, దీనికి తోడు క్యాన్సర్ విభాగం ఏర్పాటు ...5లో

అదానీ వ్యవహారంపై నిపుణుల కమిటీకి ఓకే

- సుప్రీం సూచనకు ఒప్పుకున్న సర్కార్
- సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించిన సొలిసిటర్ జనరల్



అమెరికా సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక అదానీ గ్రూపుతో పాటు భారత స్టాక్ మార్కెట్‌ను ఒక కుదుపు కుదిపింది. ఇది రాజకీయంగానూ తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రతిపక్షాలు లేవనెత్తాయి. దీనిపై విచారణ జరిపించడానికి జేపీసీ వేయాలని డిమాండ్ చేశాయి. మొత్తానికి అదానీ వ్యవహారం మోడీ సర్కారుకు మాయని మచ్చ తెచ్చిపెట్టిందని విశ్లేషకులు తెలిపారు.

న్యూఢిల్లీ : అదానీ గ్రూపు వ్యవహారంపై ఎట్టకేలకు కేంద్రం దిగొచ్చింది. సుప్రీంకోర్టు సూచన మేరకు మదుపరుల రక్షణ విషయంలో సెబీ యంత్రాంగాన్ని పటిష్టపరిచేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఈ మేరకు నిపుణుల కమిటీ ఏర్పాటుకు అంగీకరించింది. ఈ విషయాన్ని కేంద్రం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించింది. అదానీ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కేంద్రం, సెబీ తరపున భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహత వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటుపై కేంద్రం సమ్మతిని సుప్రీంకోర్టుకు తుషార్ మెహతా తెలిపారు. భవిష్యత్తులో పెట్టుబడిదారులకు రక్షణ ఎలా ఉంటుందో సూచించడానికి ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదని చెప్పారు. పరిస్థితిని ఎదుర్కోవడానికి సెబీ సమర్థవంతంగా ఉన్నదని తెలిపారు.

కమిటీ నిర్వహణ గురించి చెప్పాలని సుప్రీంకోర్టు తుషార్ మెహతను కోరింది. ప్రతిపాదిత విధి విధానాలపై బుధవారం లోగా నోట్ సమర్పించాలని కేంద్రాన్ని న్యాయస్థానం ఆదేశించింది. అలాగే పిటిషన్ విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. కమిటీపై వివరణనిస్తూ.. కమిటీకి సంబంధించిన పేర్లను త్వరలోనే అందజేస్తామనీ, విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ఆ పేర్లను సీల్డు కవర్‌లో అందించనున్నట్టు తుషార్ మెహత చెప్పారు. కమిటీ ఏర్పాటు విషయంలో ఏదైనా ...5లో



అగస్టా వెస్ట్‌ల్యాండ్ స్కామ్‌తో

అదానీకి లింక్..!

సింగపూర్ కంపెనీకి సంబంధాలు : హిండెన్‌బర్గ్

న్యూఢిల్లీ : అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ మరో బాంబు పేల్చింది. దేశంలో సంచలనం సృష్టించిన రూ.3,600 కోట్ల అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణం కేసుతో అదానీ గ్రూపునకు సంబంధాలున్నాయని పేర్కొంది. ఈ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మొదటి ఛార్జిషీట్, రెండవ అనుబంధ ఛార్జిషీట్‌లోనూ చేర్చిన సింగపూర్‌కు చెందిన కంపెనీ అదానీ గ్రూప్ సంబంధిత సంస్థ అని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలో పేర్కొంది. కాగా.. 2018లో ఈడీ దాఖలు చేసిన మూడో చార్జిషీట్‌లో అనూహ్యంగా ఆ పేరును తొలగించారని వెల్లడించింది. సింగపూర్‌లోని అధికారులు పంపిన లేఖ ఆధారంగా ఆ స్కామ్ నుంచి పేరును తొలగించారని సమాచారం. సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న గుడామి ఇంటర్నేషనల్ పీటీఈ సంస్థ అదానీ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ సంబంధిత ...5లో

సచార్ కమిటీ కీలక సిఫారసులు తొలగింపు!



ఈవోసీ కమిషన్ అవసరం లేదని మోడీ సర్కార్ నిర్ణయం

- ద టెలిగ్రాఫ్ ఆన్‌లైన్..వార్తా కథనం

న్యూఢిల్లీ : ముస్లిం మైనార్టీల విషయంలో మోడీ సర్కార్ మరో వివాదాస్పద నిర్ణయానికి తెరలేపింది. దేశంలోని ముస్లింల సమగ్ర అభివృద్ధికి ఏర్పాటుచేసిన సచార్ కమిటీ ప్రతిపాదించిన కీలక సిఫారసులను తొలగించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. సచార్ నివేదికలో అత్యంత కీలకమైన ఈవోసీ (ఈక్వల్ ఆపార్చునిటీస్ కమిషన్) సిఫార్సును తొలగించాలని మోడీ సర్కార్ భావిస్తోంది. రాజకీయంగా సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నట్టు రాజకీయ వర్గాలు అంచనావేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ముస్లిం మైనార్టీలకు సమాన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సచార్ కమిటీ 'ఈవోసీ' అనే సూచన చేసింది. మైనార్టీల కోసం జాతీయ మైనార్టీ కమిషన్ ఉండగా, ప్రత్యేకించి సచార్ కమిటీ ప్రతిపాదించిన 'ఈవోసీ' అవసరం లేదని, దీనిని తొలగించాలని కేంద్ర మంత్రివర్గం ...5లో

రేపు సీఎం కొండగట్టు పర్యటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం కొండగట్టులో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ఆయన బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కొండగట్టుకు చేరుకుంటారు. ఉదయం 9:40 గంటలకు అక్కడి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారు. కోనేరు పుష్కరిణి, కొండలరాయుని గుట్ట, సీతమ్మ వారి కన్నీటిధార, భేతాళ స్వామి ఆలయంతో తదితర ప్రాంతాలను సీఎం పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అధికారులతో ...8లో



చర్చికి నిప్పు...


లోపలి గోడలపై మతపరమైన రాతలు

- మధ్యప్రదేశ్‌లో ఘటన

భోపాల్: కొందరు దుండగులు చర్చిలోకి ప్రవేశించి దాడి చేయటమేకాక.. దానికి నిప్పుపెట్టారు. ఈ ఘటనలో చర్చిలోని ఫర్నిచర్, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. అక్కడితో ఆగని అగంతకులు లోపలి గోడలపై మతపరమైన రాతలు రాశారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన ...5లో

తెలంగాణలో భారీగా పెరిగిన అప్పులు

- రూ.75,577 కోట్ల నుంచి రూ.2,83,452 కోట్లకు చేరిన వైనం: లోక్‌సభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి



న్యూఢిల్లీ : తెలంగాణ అప్పులు పెరిగిపోతున్నాయని కేంద్రం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులు ఏ ఏటికాఏడు పెరుగుతూనే ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ వివరించింది. నిజానికి తెలంగాణ ఏర్పడే నాటికి రూ.75,577 కోట్ల అప్పులు ...5లో

గుడిసె పోరాటాలు..

పాతికేండ్లు కావస్తున్నా.. పట్టాలకు నోచుకోని వైనం

- పట్టాలు ఇవ్వాలని ఐదు నెలలుగా బాధితుల ఆందోళనలు



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఒక ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పేదల ఇంటి జాగాలు, భూములను మరో ప్రభుత్వం లాగేసుకోవడం పరిపాటిగా మారింది.. టీడీపీ ప్రభుత్వ హయాంలో 1996 -97లో ఇండ్ల స్థలాల కోసం ఇస్తే.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గుంజుకుంటోంది.. దీన్ని నిరసిస్తూ తమ స్థలాలను తమకే ఇవ్వాలంటూ బాధితులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఐదు నెలలుగా పోరాడుతున్నారు.. అక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వాటికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ...5లో

నవతెలంగాణ

మాకు చెప్పకుండా నిర్ణయం వద్దు

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై హైకోర్టు

నవతెలంగాణ - హైదరాబాద్

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను రైతులు వ్యతిరేకిస్తున్నట్టు అభిప్రాయాలు వెల్లడయ్యాక కూడా దాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందనీ తాత్కాలికంగా అమలు చేయడం లేదని ప్రభుత్వం చెప్పడంతో హైకోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది. మాస్టర్ ప్లాన్ అమలు విషయంలో కోర్టుకు సమాచారం ఇవ్వకుండా ముందుకు వెళ్లరాదని ఆదేశించింది. ఒకవేళ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని భావిస్తే తమ అనుమతి తీసుకోవాలని షరతు విధించింది. దీనిపై తదుపరి విచారణ ఏప్రిల్ 17వ తేదీలోగా పూర్తి వివరాలు అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులను సంప్రదించకుండా కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ రూపొందించడం చట్టవిరుద్ధమని వెల్లడించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇదే సమయంలో ఆయన సచివాలయ అంశాన్ని ప్రస్తావన చేయబోగా హైకోర్టు నిరాకరించింది.



అసెంబ్లీ నియోజకవర్గాలకు

నిధుల కేటాయింపులో అన్యాయం

- హైకోర్టులో రఘునందన్‌రావు పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ నియోకవర్గాలకు ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్), అసెంబ్లీ అభివృద్ధి నిధి (ఏడీఎఫ్) మంజూరు వ్యవహారంలో ప్రతిపక్షాల ఎమ్మెల్యేలున్న చోట ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఆ నిధుల విడుదల, కేటాయింపు వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనిపై దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు దాఖలు చేసిన రిట్‌ను సోమవారం జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగానే నియోజకవర్గానికి నిధులివ్వలేదని సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యేలున్న చోట్ల నిధుల కేటాయింపులు భారీగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. నిధులు కేటాయించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఏఏజీ రామచంద్రరావు వాదిస్తూ, ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపు అంశం శాసనసభ పరిధిలోనిదనీ, సీఎం, శాసనసభ నిర్ణయాలకు అనుగుణంగా కేటాయింపులుంటాయి కాబట్టి ఈ వ్యవహారంపై హైకోర్టు విచారణ చేయరాదన్నారు. వాదనల తర్వాత ప్రతివాదులైన ప్రధాన కార్యదర్శి, జీఏడీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లతోపాటు ఇతరులకు హైకోర్టు నోటీసులిచ్చింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎఫ్‌టీఎల్‌లో రోడ్ నిర్మాణంపై పిల్ దాఖలు

నాయబ్ ట్యాంక్ ఎఫ్‌టీఎల్ పరిధిలో భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని పేర్కొంటూ నిర్మల్‌కు చెందిన కె అనుజుకుమార్ పిల్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ బెంచ్ సోమవారం ప్రకటించింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా చర్యలున్నాయని పిల్‌లో పేర్కొన్నారు.

నోటా, వ్యయ పరిమితి లేదు

- ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఈవో వికాస్ రాజ్

నవతెలంగాణ - హైదరాబాద్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్‌లో ఓటర్ల నమోదు పూర్తయినట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 31 నాటికి ఈ మూడు జిల్లాల్లో ఓటర్ల సంఖ్య 29,501గా నమోదైందని తెలిపారు. కొత్తగా 1,331 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వాటిని పరిశీలించి ఈనెల 23న జాబితా ప్రకటించి పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) పంపిస్తామని వెల్లడించారు. గతంలో తిరస్కరించిన 1,440 దరఖాస్తుల్లో 788 సరైనవేనని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌తో తొమ్మిది జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటా, వ్యయ పరిమితి నిబంధన లేదని వివరించారు. ఏపీ, తెలంగాణలోని ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల్లో ఖాళీ అవుతున్న స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయ, ఎనిమిది స్థానిక సంస్థల స్థానాలు కలిపి మొత్తం 13, తెలంగాణలో ఒక్కో ఉపాధ్యాయ, స్థానిక సంస్థల స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణలోని హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ స్థానంతో పాటు హైదరాబాద్ స్థానిక సంస్థల స్థానంలో ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది.

ఈ విద్యాసంవత్సరమే 12 నెలల జీతమివ్వాలి

- సీఎం ప్రకటనకు గెస్ట్ లెక్చరర్ల సంఘం హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు 12 నెలల వేతనం వర్తింపుపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన చేయడం పట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీ జేఎల్ నోటిఫికేషన్‌లో గెస్ట్ లెక్చరర్లకు అనుభవం ప్రకారం వెయిటేజీ కల్పించాలని కోరారు. ఈ విద్యాసంవత్సరం నుంచే 12 నెలల వేతనం అమలయ్యేలా చూడాలని తెలిపారు. జేఎల్ రిక్రూట్‌మెంట్ పూర్తయ్యే వరకు గెస్ట్ లెక్చరర్లకు కన్సాలిడేట్‌గా 12 నెలల జీతమివ్వాలని పేర్కొన్నారు. ఈ మేర కు విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నో అవకాశాలకు రన్‌వే : ప్రధాని మోడీ



బెంగళూరు : ఏరో ఇండియా-2023 ప్రదర్శన ప్రదర్శన ఎన్నో అవకాశాలకు రన్‌వేగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. కర్ణాటకలోని బెంగళూరు వేదికగా ఏరో ఇండియా-2023 ప్రదర్శనను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నవ భారత సామర్థ్యాలను చాటిచెప్పేందుకు బెంగళూరు గగనతలం వేదికైంది. ఏరో ఇండియా మన బలాన్ని, సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదు.. మన ఆత్మవిశ్వాసానికి ప్రతీక. ఈ రోజు దాదాపు 100 దేశాలు మన ప్రదర్శనలో పాల్గొంటున్నాయంటే.. భారత్‌పై ఈ ప్రపంచం ఎంత విశ్వాసంగా ఉందో స్పష్టమవుతోంది. ఇప్పుడు విదేశీ రక్షణ రంగ ఉత్పత్తులకు మన దేశం కేవలం మార్కెట్ మాత్రమే కాదు.. ఎన్నో దేశాలకు బలమైన రక్షణ భాగస్వామిగా మారింది. ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ రంగ ఎగుమతిదారుగా ఎదిగే దిశగా భారత్ ముందడుగు వేస్తోంది' అని అన్నారు. ఈ ఎయిర్‌షోలో భాగం ఓగా భారత్, విదేశీ రక్షణ కంపెనీల మధ్య రూ.75 వేలకోట్ల విలువైన 251 ఒప్పందాలు జరగనున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ షోలో చివరి రెండు రోజులైన 16,17 తేదీల్లో సామాన్యులు తిలకించేందుకు కర్నాటక ప్రభుత్వం అవకాశం కల్పించ నుంది. నిర్వాహకులు ఎంట్రీ టికెట్‌ను రూ.1000గా నిర్ణయించారు. భారతీయ, విదేశీ రక్షణ రంగ సంస్థలు ఈ ప్రదర్శనలో.. భారీ ప్రదర్శనకారుల విభాగంలో తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. వీటిల్లో ఎయిర్ బస్, బోయింగ్, లాక్హీడ్ మార్టిన్, ఇజ్రాయిల్ ఏరోస్పేస్, బ్రహ్మోస్ ఏరోస్పేస్, ఆర్మీ ఏవియేషన్, హెచ్‌సి రోబోటిక్స్, సాబ్, సఫ్రాన్, రోల్స్ రాయిస్, ఎల్అండ్‌టి, భారత్ ఫోర్జ్ లిమిటెడ్, హెచ్ఎఎల్, బిఇఎల్, బిడిఎల్, బిఇఎంఎల్ వంటి సంస్థలున్నాయి.

ఆన్‌లైన్‌లో నెహ్రూ జూలాజికల్ పార్కు సేవలు

- వెబ్‌సైట్, మొబైల్‌యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని నెహ్రూ జూలా జికల్ పార్కులో మెరుగైన సేవ లు అందించేందుకు గానూ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను రూపొందిం చామని అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన నెహ్రూ జూ పార్క్ కొత్త వెబ్ సైట్, మొబైల్ యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెబ్‌సైట్‌లో సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు సందర్శకులు సులువుగా జూ ఎంట్రీ టికెట్ బుకింగ్, బ్యాటరీ వెహికల్స్ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం https://nzptsfd.telangana.gov.in ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం. డోబ్రియాల్, అటవీ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రశాంతి, పీసీసీఎఫ్ (ఎఫ్ఏసీ) ఎంసీ. పర్గయిన్, జూ పార్క్ డైరెక్టర్ వినయ్ కుమార్, క్యురేటర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో అగ్ని ప్రమాదం

- మూడు ప్రయివేటు బస్సులు దగ్ధం



నవతెలంగాణ - కూకట్‌పల్లి

హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పార్కింగ్ చేసిన మూడు ప్రయివేట్ బస్సుల్లో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయాయి. కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భారతి ట్రావెల్స్‌కు చెందిన ఏడు బస్సులు కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని షెడ్‌లో పార్కింగ్ చేసి ఉన్నాయి. అర్ధరాత్రి మూడు బస్సులో మంటలు చెలరేగాయి. దాంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంట లను ఆర్పారు. మిగతా నాలుగు బస్సులను మరో ప్రాంతానికి తరలించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే దాని మీద విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

చట్టసభల్లో 27 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీల నేతలనూ కలిశాం : దాసు సురేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చట్టసభల్లో 27 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరుతూ అన్ని పార్టీల నేతలనూ ఢిల్లీలో కలిసినట్టు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము కలిసిన వారిలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఆప్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ సంజయ్‌సింగ్, బీజేపీ బీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్, ఎస్పీ సీనియర్ నేత రామ్‌గోపాల్ యాదవ్, బీఎస్పీ, జేడీయూ నేతలను కలిసినట్టు పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం కావాల్సిన చట్టసవరణ కోసం కేంద్ర ప్రభుత్వం సంకల్పిస్తే తాము మద్దతిస్తామని సీతారాం ఏచూరి హామీనిచ్చారని తెలిపారు. చట్టసవరణకు అవసరమైన కార్యాచరణకు చేపట్టాలని లక్ష్మణ్‌ను కోరగా పార్లమెంటరీ కమిటీలో చర్చిస్తామని హామీనిచ్చారని పేర్కొన్నారు. తెలంగాణలో త్వరలోనే బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ పెడతామని తెలిపారు. అన్ని పార్టీలను ఆ సభకు ఆహ్వానించనున్నట్టు పేర్కొన్నారు.

'సుకన్య' ఖాతాల ఓపెన్‌లో పోస్టల్‌శాఖ రికార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సుకన్య సమృద్ధి యోజన ఖాతాల ఓపెనింగ్‌లో తెలంగాణ సర్కిల్ పోస్టల్‌శాఖ రికార్డు సాధించింది. ఈనెల 9 నుంచి 11 వరకు రాష్ట్రంలోని 6,208 పోస్టాఫీసుల్లో నిర్వహించిన సుకన్య మహామేళా కార్యక్రమంలో 34,384 ఖాతాలు ఓపెన్ చేసినట్టు హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్ సంతోష్‌కుమార్ నరహరి తెలిపారు. ఈ మేళాలో 28,970 సుకన్య ఖాతాలు ఓపెన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, కానీ అంతకంటే ఎక్కువగా 118.69 శాతం ఖాతాలను ప్రారంభించగలిగామన్నారు. 2015 జనవరి నుంచి 2023 జనవరి వరకు రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లో మొత్తంగా 8,62,776 సుకన్య ఖాతాలు ఓపెన్ చేశామన్నారు. ప్రజల నుంచి ఈ స్కీంకు విశేష ఆదరణ లభిస్తున్నదని తెలిపారు. 2015లో ఈ ఖాతాలు ఓపెన్ చేసిన అనేకమంది ఇప్పుడు పాక్షిక విత్‌డ్రాయల్స్ ద్వారా లబ్దిపొందుతున్నారని వివరించారు. అత్యధికంగా ఖమ్మం డివిజన్‌లో 4,266 ఖాతాలు, సికింద్రాబాద్ డివిజన్‌లో 3,858, కరీంనగర్ డివిజన్‌లో 3,503, హైదరాబాద్ సౌత్ డివిజన్‌లో 2,629, నల్గొండ డివిజన్‌లో 2,239 ఖాతాలు ఓపెన్ చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ స్కీంలో 11 లక్షల ఖాతాలు ఉన్నాయని చెప్పారు. 0-10 సంవత్సరాలలోపు ఆడపిల్లల పేరుపై రూ.250తో ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. గరిష్టంగా ఏడాదికి రూ.1.50 లక్షలు డిపాజిట్ చేయవచ్చు. పాక్షిక విత్‌డ్రాయల్ అవకాశం ఉంది. బాలికలకు 18 ఏండ్లు వచ్చే వరకు వారి ఉన్నత విద్యకు ఈ సొమ్ము ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్గానిక్ వివాహం చేసిన రైతుకు అభినందనలు

- చెరుకూరి రామారావుకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్గానిక్ వివాహం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన రైతు చెరుకూరి రామారావుకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు రామారావుకు మంత్రి బహిరంగ లేఖ రాశారు. "మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన మీ కుమారుడు కిరణ్ స్వయంగా ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించడం అభినందనీయం. పెళ్లంటే అంగరంగ వైభవంగా ఉండాలనే ఆలోచనలోఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మీ ఆలోచనను గౌరవిస్తూ నూతన దంపతులు ఈ తరహా వివాహానికి ఒప్పుకోవడం యువతలో సమాజంలో ఉన్న సమస్యలపై ఉన్న అవగాహన, బాధ్యతకు నిదర్శనం. మీ కుమారుడు, కోడలి వివాహం వార్త మీడియా ద్వారా తెలుసుకున్నాను. నూతన దంపతులు కిరణ్, ఉదయశ్రీలకు నా తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు..... "అని తెలిపారు. దశాబ్దాల వాడకం తర్వాత గానీ పురుగు మందులు, ఎరువులతో వ్యవసాయోత్పత్తులు, ప్రజలపై చూపిస్తున్న ప్రభావం ప్రపంచానికి తెలిసి రాలేదని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రసాయనాల ప్రభావంతో ప్రజలకు విపరీతమైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రజలు ఆరోగ్యం విషయంలో ఏం కోల్పోయారనే విషయాన్ని కరోనా గుర్తు చేయడంతో ఇటీవల సహజ, సాంప్రదాయ సాగు ద్వారా పండిస్తున్న ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ప్రజల్లో చైతన్యం చేస్తున్నదని తెలిపారు.

శివరాత్రికి 2427 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని వివిధ శైవ క్షేత్రాలకు యాత్రీకుల సౌకర్యార్థం 2,427 ప్రత్యేక బస్సుల్ని నడుపుతున్నట్టు టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 40 శైవక్షేత్రాలకు ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులను నడుపనున్నట్టు తెలిపారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి 578, వేములవాడకు 481, కీసరగుట్టకు 239, ఏడుపాయలకు 497, వేలాలకు 108, కాళేశ్వరానికి 51, కొమురవెల్లికి 52, కొండగట్టుకు 37, ఆలంపూర్‌కు 16, రామప్పకు 15, ఉమా మహేశ్వరానికి 14 ప్రత్యేక బస్సులను నడుతున్నా మన్నారు. శ్రీశైలం యాత్రా స్థలానికి హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయనీ, వీటిలో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. అలాగే గ్రూపులుగా శైవక్షేత్రాలకు వెళ్లేవారి కోసం అద్దె బస్సులపై 10 శాతం రాయితీని టీఎస్ఆర్టీసీ కల్పిస్తున్నదనీ, ఈ సౌకర్యం వినియోగించుకోవాలని కోరారు.

సంపాదకీయం

ఈ బాటకు బ్రేక్ కొట్టలేమా?

ఈ దశాబ్దకాలంలో తమ పౌరసత్వాన్ని వదులుకుంటున్న భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గడిచిన ఒక్క ఏడాదిలోనే దాదాపు 2.25లక్షల మంది భారతీయ పౌరసత్వాన్ని వదులుకున్నారంటూ స్వయంగా విదేశాంగ మంత్రి జైశంకరే రాజ్యసభలో తెలియజేశారు. ఎందుకీ పరిస్థితి ఇంత ఘోరంగా తయారైంది. ఈ

> దేశ ప్రగతికి చోదక శక్తులుగా భావితరాల్ని తీర్చిదిద్దలేని ఏలికల మందభాగ్యంతో 'ఆశలు ఆకాశంలో- అవకాశాలు పాతాళంలో' అన్న చందంగా నిట్టూర్పు సెగలే ఇప్పటికీ యువతను చుట్టుముడుతున్నాయి. జాతి నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించగలిగేలా యువతరాన్ని నైపుణ్య శక్తులుగా ఇప్పటికీ తీర్చిదిద్దుకోలేకపోవడం దిగులు పుట్టిస్తోంది. ప్రపంచమంతా సైన్సు అండ్ టెక్నాలజీతో ముడిపడి అభివృద్ధి చెందుతుంటే, మన విద్యావిధానం అందుకు భిన్నంగా తిరోగమన బాట పట్టింది. ఈ చదవులతో ప్రపంచంతో పోటీ పడటం అసాధ్యం.

దుస్థితికి కారణమెవరు? విదేశాల్లో చదువుకోవాలి, ఉద్యోగాలు చేయాలనుకునే భారతీయ యువత సంఖ్య పెరుగుతోంది. ఎంట్రీ లెవల్ నుంచి ఎక్స్‌పీరియన్స్‌డ్ వరకు... బ్లూ కాలర్ టు వైట్ కాలర్ ప్రొఫెషనల్స్ వరకు... విదేశీ ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న వారి సంఖ్య ఏటికేడు గణనీయంగా పెరుగుతోంది. వర్క్ వీసాలు, వర్క్ పర్మిట్లు... ఇలా ఎన్ని నిబంధనలున్నా... విదేశీ కొలువులు చేజిక్కించుకోవడంలో మనవాళ్లు శరవేగంగా ముందుకు దూసుకుపోతున్నారు. మహిళలు సైతం పెద్ద ఎత్తున విదేశీ ఉద్యోగాల్లో కొలువు దీరుతుండటం విశేషం. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధి కోసం పలు దేశాల్లో స్థిరపడ్డవారు న్నారు.

'అచ్ఛేదిన్' హామీతో 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం మరో ఏడాదిలో మూడో మారు ఎన్నికలకు సిద్ధం కాబోతోంది. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాకాశాలు కల్పించడం తమ ధ్యేయమని మోడీ చెప్పిన మాటలన్ని జుమ్లాలే అని తెలిపోయింది. యువతకోసమే నా తాపత్రయం అంటూ నెలలో 20రోజులు విదేశాల చుట్టూ తిరిగే మోడీ సార్... ఉద్యోగాలు అడిగితే పకోడిలు అమ్ముకోమని ఉచిత సలహా పడేశారు. ఏదేశ నిర్మాణానికైనా యువతరమే కీలకం. కానీ మన దేశంలో యువత పరిస్థితేమిటి? అభివద్ధిలో వారి పాత్ర ఏమిటి..? నిజానికి అపారమైన మానవ వనరుల నెలవు మన దేశం. జనాభాలో 50శాతానికి పైగా యువజనులే..! ప్రపంచంలో మరేదేశానికీ ఇంతటి యువసంపత్తి లేదంటే అతిశయోక్తి కాదు. కానీ, ఇప్పుడీ యువతరం విదేశీ బాట పట్టడమే కాదు. ఈ దేశ పౌరసత్వాన్ని కూడా తృణప్రాయంగా వదులుకోవడం అత్యంత విషాదం. ప్రగతి లక్ష్యాల్ని అలవోకగా వల్లెవేసే ప్రభువులకు యువతరాన్ని భారత భాగ్యవిధాతలుగా రూపొందించే పటుతర కార్యాచరణే లేదన్నది పచ్చి నిజం.



'ఎక్కడ స్వచ్ఛమైన వివేకధార ఇంకిపోకుండా ఉంటుందో, ఎక్కడ నిరంతర ఆలోచన, ఆచరణ వైపు నీవు బుద్ధిని నడిపిస్తావో... ఆ స్వేచ్ఛాస్వర్గానికి నా దేశాన్ని మేల్కొలుపు'- అని గీతాంజలి సమర్పించాడు విశ్వకవి. దోపిడీ పీడనల పరాయి ఏలుబడికి భరతవాక్యం పలికేలా ప్రాణాల్నే పణంగా పెట్టిన కోట్లాది జనావళి అవిరళ త్యాగనిరతే దారిదీపమైతే ఏడున్నర దశాబ్దాల గణతంత్రం ఇప్పటికే స్వేచ్ఛాస్వర్గం అయి ఉండేది. కానీ, దేశ ప్రగతికి చోదక శక్తులుగా భావితరాల్ని తీర్చిదిద్దలేని ఏలికల మందభాగ్యంతో 'ఆశలు ఆకాశంలో- అవకాశాలు పాతాళంలో' అన్న చందంగా నిట్టూర్పు సెగలే ఇప్పటికీ యువతను చుట్టుముడుతున్నాయి. జాతి నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించగలిగేలా యువతరాన్ని నైపుణ్య శక్తులుగా ఇప్పటికీ తీర్చిదిద్దుకోలేకపోవడం దిగులు పుట్టిస్తోంది. ప్రపంచమంతా సైన్సు అండ్ టెక్నాలజీతో ముడిపడి అభివృద్ధి చెందుతుంటే, మన విద్యావిధానం అందుకు భిన్నంగా తిరోగమన బాట పట్టింది. ఈ చదవులతో ప్రపంచంతో పోటీ పడటం అసాధ్యం. పురోగమనాన్ని అందివ్వలేని చదువులు అనవసరమని భావించిన యువత, అవి పుష్కలంగా ఉన్న చోట చదువుకోవడానికైనా, ఉద్యోగంతో పాటు సిర్థపడటానికైనా ఆసక్తి చూపుతుంది. తత్ ఫలితమే ఈ విదేశీ బాట.

ఒకవైపు చదువుకు తగిన ఉపాధిలేక, ఉపాధికి అవసరమైన చదువు అందక నిరుద్యోగం దినదిన ప్రవర్ధమానమవుతుంటే, మరోవైపు దేశంలో ప్రబలుతున్న అసహనం, అరాచకం, మతోన్మాదం, దిగజారుతున్న విలువలు యువతరం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. తమ ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధిని అందిపుచ్చుకొని యువత అభివృద్ధిలోకి రావాలంటున్నారు మోడీ గారు. కానీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో కోటికి పైగా ఖాళీలు ఉన్నట్టు పార్లమెంటులోనే మోడీ సర్కార్ నిసిగ్గుగా ప్రకటించుకుంది. ఈ ఏనిమిదేండ్లల్లో 22కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 7లక్షల మందికే ఉపాధి దక్కింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భ్రమలకు కొనసాగింపుగా మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి నినాదాలతోనే ఇప్పటి వరకూ మోడీ సర్కార్ నిరుద్యోగులను వంచించింది. పాలకులు ఉద్బోధలను పక్కన పెట్టి, జీవన నైపుణ్యాలను పాఠశాల స్థాయి లోనే ప్రవేశపెట్టి పనికొచ్చే చదువులతో భావితరాల్ని తీర్చిదిద్దే మహాక్రతువును ఆరంభించాలి. 'ఎంత చదువుకు అంత నిరుద్యోగిత'గా గుల్లబారిన వ్యవస్థను ప్రక్షాళించి, రేపటి అవసరాలకు ధీటైన జాతి రత్నాలుగా తీర్చిదిద్దగలిగితేనే ఈ దేశానికి భవిష్యత్తు.



ముందడుగు

ప్రియ సఖీ!
నీకై యోచిస్తూ
గడియైనా సడిచేయని ఘడియన
మబ్బులు కమ్మిన ఆకాశంలో
జాబిల్లి జాడలు వెతుకుతున్న నాకు
నిశ్శబ్దం నిజంగా ఒక శాపమయ్యింది.
నిను గూర్చిన ఆశలు ఎదకమలంలో
తుమ్మెదలైపోతోంటే
ఎద భారంకాగా,
చలిగాలి సైతం చమటలు పట్టిస్తోంది
ఈ వెన్నెల రాత్రిలో.
అదేంటో...
నాలోని ఎన్నో ఆలోచనల మధ్య
అకస్మాత్తుగా నువ్వొచ్చేస్తావు,
మనోరంజకమైన
నీ పిలుపు వినిపిస్తుందని
వేచిచూసే మనసుకు... అంతలోనే
అది సాధ్యం కాదని గుర్తొచ్చి
గొంతు తడారిపోతుంటుంది,
ఎగసిన కనురెప్పల తడి
ఉప్పెనల జడి సష్టిస్తుంది.
ఆహ్లాద శుభోదయమే కాదు,
సంధ్య కెంజాయలోనూ
నా అస్తిత్వ చిరునామా నీవేనంటూ
నీ అనురాగం పొదిగిన ముత్తెపునవ్వులు
నాపై కురిపించి,
వలపులు రంగరించిన విరితూపులు
నాపై సంధించి,
శిశిరమెరుగని వసంతగానమై
నా మదినల్లుకుపొమ్మని
నేనెంతగ నిను వేడుకున్నా
సంతసాల సౌరభాలను తొలుస్తూ,
నాలో వేదనల
కుంపటి రగులుస్తూ దూరమయ్యావు.
తెరచాపలాంటి నీవు లేని
నా ఈ జీవన పయనం
ఏ దరికి చేరుతుందో తెలియక
ఏడ్చి ఏడ్చిన నా హదయానికి సేదతీర్చ
నువ్వో ముందడుగు వేసి,
నీకూ నాకూ మధ్య ఉన్న
పరదా తొలగించి
శిశిరమై మోడువారిన నా ఎదలో
అనురాగసుధలూరిస్తూ దరిచేరవా!

- వేమూరి శ్రీనివాస్
9912128967

అశ్రిత పెట్టుబడిదారీ విధానం ఒక ఆర్థిక వ్యూహమైతే?



ప్రభాత్ పట్నాయక్


హిండెన్‌బర్గ్ సంస్థ తనపై చేసిన ఆరోపణలు నిజానికి భారతదేశం మీద ఎక్కుపెట్టిన దాడి అని గౌతమ్ అదానీ అభివర్ణించడం ప్రాధాన్యత గల అంశం. ఈ ఉదంతం జరగడానికి కొద్ది రోజుల ముందే బిబిసి మోడీ మీద ఒక డాక్యుమెంటరీని విడుదల చేసింది. ఆ డాక్యుమెంటరీ బ్రిటిష్ ప్రభుత్వపు వలసవాద దృక్పథానికి అద్దం పడుతోందని, అందుచేత అది వాస్తవానికి భారతదేశం మీద చేసిన దాడి అని దానికి ముద్ర వేశారు. సరిగ్గా మోడీ ప్రకటించిన మాదిరిగానే తనపై దాడిని మొత్తం దేశం మీదే జరిగిన దాడితో సమానంగా ప్రకటించే ధైర్యం అదానీకి వచ్చిందంటే దానికి కారణం అటువంటి ప్రకటనతో మోడీ పూర్తిగా ఏకీభవిస్తాడనే భరోసా అదానీకి ఉండబట్టే. మోడీ, అదానీ ఇద్దరూ తమని దేశానికి ప్రతిరూపంగా పరిగణించుకుంటున్నారు. కార్పొరేట్-హిందూత్వ కూటమికి కేంద్ర బిందువుగా మోడీ-అదానీ కూటమి ఉంది. అందుచేత వారి దృష్టిలో దేశం అంటే వారిద్దరే. ఈ దేశం భవిష్యత్తు బాగుండడం అంటే రాజకీయంగా మోడీ తిరుగులేని స్థానంలో కొనసాగుతూ ఉండడం, ఆర్థిక రంగంలో అదానీ నిరంతరం సంపద పెంచుకుంటూ ఉండడం. వారి దృష్టిలో ఈ రెండూ జరగకపోతే దేశానికి భవిష్యత్తు లేనట్టే.

ఆ సిద్ధాంతాన్ని అంగీకరిస్తే, మోడీని గాని, అదానీని గాని అనైతికంగా వ్యవహరిస్తున్నారనో, నీతివిరుద్ధంగా ప్రవర్తిస్తున్నారనో విమర్శించలేం. ఎందుకంటే వారిద్దరూ ఏం చేసినా అది తప్పకుండా దేశ ప్రయోజనాల కోసమే చేసినట్టు. తక్కిన అన్ని అంశాలకన్నా దేశ ప్రయోజనాలే అత్యంత ప్రధానం. దేశ ప్రయోజనాలను కేవలం దేశద్రోహులో, దేశానికి శత్రువులుగా ఉన్నవారో మాత్రమే వ్యతిరేకిస్తారు. కనుక వారిద్దరినీ ఏ విధంగా విమర్శించినా అది దేశద్రోహమే అవుతుంది.

> అదానీ వ్యవహారాలమీద విచారణ జరపకుండా ఉండటం అసాధ్యం. అలా జరపకపోతే అంతర్జాతీయ మదుపరులలో మనమీద విశ్వాసం పోతుంది. ఒకవేళ ఏదో నామమాత్రపు విచారణ జరిపి అదానీ ఏ తప్పూ చేయలేదని నివేదికను తీసుకువచ్చినా, అటువంటి విచారణ పట్ల అంతర్జాతీయ పెట్టుబడిదారులలో ఎటువంటి నమ్మకమూ ఉండదు. అందుచేత అదానీలకు ఏదో ఒక శిక్ష తప్పదు. అది చిన్న శిక్షే అయినా, ఆ తర్వాత రాజకీయ అధినేతకు, ఈ వ్యాపారదిగ్గజానికి మధ్య పాత స్థాయిలో లంకె కొనసాడం కష్టం అవుతుంది. తన 'ఆశ్రితుడికి'' శిక్ష పడినతర్వాత దేశ ప్రయోజనాలంటే ఆ ఆశ్రితుడి ప్రయోజనాలే అన్న సిద్ధాంతమూ పలచబడుతుంది. ఒక విధంగా కార్పొరేట్-హిందూత్వ కూటమి దూకుడు కొనసాగడం కష్టం అవుతుంది.

తనను విమర్శించడం అంటే అది దేశ వ్యతిరేకమే అని అదానీ చేసిన ప్రకటనను హిండెన్‌బర్గ్ సంస్థ కొట్టిపారేసింది. మోసం చేసినవాడు దేశభక్తి ముసుగు వేసుకున్నంత మాత్రాన చేసిన మోసం చెరిగిపోదని ప్రకటించింది. దేశ ప్రయోజనాలు అంటే ఏమిటో, దేశ భక్తి అంటే ఏమిటో వ్యక్తులతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ముందు నిర్వచించి ఆ తర్వాత ఆ కొలబద్ద ప్రకారం ఏదైనా ఒక ఘటనను పరిశీలించి అది దేశానికి ప్రయోజనకరమో కాదో నిర్ధారించాలి. కాని ఇక్కడ దేశ ప్రయోజనం అంటేనే మోడీ-అదానీ ద్వయం అన్నంతగా మమేకం అయిపోయాక ఇక విమర్శించడం అనేది సాధ్యమే కాదు. తనను తాను సమర్థించుకోడానికి అదానీ వాడుకున్న వాదన ఇదే.

మోడీ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానం ప్రజల ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది .కేవలం తన 'ఆశ్రిత' కార్పొరేట్ల ప్రయోజనాలకోసమే పని చేస్తున్నది. జాతీయ ఆర్థిక సంస్థలైన ఎస్‌బిఐ, ఎల్‌ఐసి వంటి సంస్థలను అడ్డగోలుగా వాడుకుని ప్రయివేటు వ్యక్తుల సామ్రాజ్యాలను నిర్మించుకున్నారు. బడా పెట్టుబడిదారులకు పన్నులలో భారీ రాయితీలను కల్పిస్తున్నారు. దాని వలన ఏర్పడే లోటును పూడ్చుకోడానికి పేద ప్రజల సంక్షేమం కోసం చేయవలసిన ఖర్చులో కోతలు పెడుతున్నారు. మామూలుగా పెట్టుబడిదారుల కోసం పని చేసే ప్రభుత్వాలు కూడా ఆ విధంగా చేయవు. అందుకే ఈ ప్రభుత్వ విధానాలను 'ఆశ్రిత పెట్టుబడిదారీ' విధానం (క్రోనీ కేపిటలిజం) అని విమర్శిస్తాం. ఈ 'ఆశ్రిత పెట్టుబడిదారీ' విధానాన్ని సమర్థించుకోడానికే వాళ్ళు "ఇదంతా దేశ ప్రయోజనాలకోసమే' అన్న సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారు. దేశం అంటే ఏమిటో, ఆ దేశాన్ని ఏ విధంగా నిర్మించాలో హిందూత్వ సిద్ధాంతం చెప్పిదానిని వాడుకుంటున్నారు.



కొద్దిమంది ఎంపిక చేసుకున్న వ్యక్తుల సంపదలను పెంచుకోడానికి అనుసరిస్తున్న వికృతమైన తప్పుడు విధానాలను మామూలుగా ఎవ్వరూ బాహాటంగా చెప్పుకోరు, సమర్థించుకోరు. ఒకవేళ తప్పుడు విధానాలను అనుసరించినా, వాటిని ఏదో ఒక విధంగా కప్పిపుచ్చడానికి, చాటుమాటుగా చేయడానికి పూనుకుంటారు. కాని మోడీ హయాంలో 'ఆశ్రిత పెట్టుబడిదారీ' విధానం ఏకంగా ఒక ఆర్థిక వ్యూహంగా మారిపోయింది. దానిని కప్పిపుచ్చు కోడానికి మోడీ ప్రభుత్వం ఏమాత్రమూ ప్రయత్నించడం లేదు సరికదా 'దేశ ప్రయోజనాల' ముసుగులో సమర్థించుకోజూస్తున్నది.

గతంలో దక్షిణ కొరియాలో కూడా ఇదే విధంగా జరిగిందన్నట్టుగా చరిత్రకారుడు ఆడమ్ టూజె వంటివారు అంటున్నారు. కాని అక్కడికీ , ఇక్కడ ఇప్పుడు జరుగుతున్నదానికీ మౌలికంగానే ఒక తేడా ఉంది. దక్షిణ కొరియాలో గాని, రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం జపాన్‌లో గాని యావత్తు ప్రభుత్వ వ్యవస్థలన్నీ గుత్త పెట్టుబడిదారీ గ్రూపులతో సమన్వయం చేసుకుని వ్యవహరించాయి. ప్రభుత్వం గాని, ప్రభుత్వ వ్యవస్థలు గాని తీసుకునే నిర్ణయాలను గుత్త సంస్థలు నిర్దేశించడం, ఈ వ్యవస్థలన్నీ ఆ గుత్త సంస్థల సంపదలను వృద్ధి చేయడానికి తోడ్పడడం జరిగింది. అయితే అందుకు ఒక వ్యవస్థాపరమైన ఏర్పాటు అమలులో ఉండేది. కాని మన దేశంలో అటువంటి ఏర్పాటు అంటూ ఏదీ లేదు. ఉన్నది కేవలం దేశాధినేతకి, ఆ వ్యాపార దిగ్గజానికి మధ్య ఉన్న సంబంధం మాత్రమే. దాని కారణంగానే ఆ వ్యాపార దిగ్గజానికి సకల వ్యవహారాలూ జరిగిపోతున్నాయి.

ఇక నాజీ జర్మనీలో కూడా పాలక పార్టీకి, వ్యాపార సంస్థలకు మధ్య ఒక సన్నిహిత కూటమి ఉండేది. యుద్ధం ప్రారంభానికి ముందు నాజీ జర్మనీలో ఒక్కో వ్యాపార సంస్థతో ఒక్కో నాజీ నేత సంబంధం పెట్టుకుని వ్యవహరించేవాడు. ఆ వ్యాపార సంస్థలమధ్య పోటీ ఉండేది. ఒకానొక వ్యాపార సంస్థతో సంబంధం కలిగివుండే నాయకుడు గనుక పార్టీలో పట్టు కోల్పోతే ఆ సంస్థ కూడా నష్టపోయేది. లూషినో విస్కాంటీ తీసిన 'ది డామ్డ్' అన్న సినిమాలో దీనిని బాగా చూపించారు. (ఒకసారి యుద్ధం మొదలయ్యాక ఉత్పత్తి యావత్తూ యుద్ధావసరాలకోసం ఒక కేంద్రీకృత ప్లాన్ ప్రకారం జరిగింది.)

అన్ని రకాల ఫాసిస్టు ప్రభుత్వాల పాలనలోనూ గుత్త పెట్టుబడిదారులకు, ప్రభుత్వానికి నడుమ ఒకకూటమి (ఒక లాలూచీ) ఉండడం చూశాం. అందుకే ముస్సోలినీ "రాజ్యం, కార్పొరేట్ శక్తులు కలగలిసిపోవడమే ఫాసిజం" అని నిర్వచించాడు. మనదేశంలో సైతం ఇప్పుడు మనం చూస్తున్నది అదే.

అయితే కొద్దిమంది రాజకీయ నాయకులు, మరికొద్దిమంది బడా వ్యాపారవేత్తలు కూడబలుక్కుని వ్యవహరించడం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను తమ చిత్తం వచ్చినట్టు నడిపించడం, ఆ వ్యవస్థను పూర్తిగా తమ కనుసన్నలలోనే నడిపించడం సాధ్యం కాదు. ఒక దేశంలోని పెట్టుబడిదారీ వ్యవస్థను తక్కిన ప్రపంచంతో సంబంధం లేనివిధంగా దానిచుట్టూ ఒక కోటగోడను కట్టేయగలిగితే, అప్పుడు ఆ దేశంలో రాజకీయ అధినేత, వ్యాపార దిగ్గజం కలిసి తమ పెత్తనాన్ని చెలాయించడం సాధ్యపడవచ్చునేమో. కాని పెట్టుబడి ప్రపంచీకరణ జరిగిన తర్వాత అటువంటిది సాధ్యం కాదు.

దేశంమీద పట్టు సంపాదించిన తర్వాత ఆ వ్యాపార దిగ్గజం కేవలం దేశీయ ఆర్థిక వ్యవస్థ పరిధిలోపలే తన ఆర్థిక కార్యకలాపాలను పరిమితం చేసుకోడు. అలా పరిమితం అయితే, దేశంలోపల ఉన్న పోటీలో అతడు తన పైచేయిని కోల్పోయే ప్రమాదం ఉంది. తక్కిన వ్యాపార దిగ్గజాలు అతడిని స్వాహా చేసే అవకాశం ఉంటుంది. అందుకే రాజకీయ అగ్ర అధినేత ప్రాపకం సంపాదించిన తర్వాత ఆ వ్యాపార దిగ్గజం అంతర్జాతీయ రంగంలోకి అడుగుపెడతాడు. ఒకసారి ఆ విధంగా అడుగుపెట్టగానే ఇక అతగాడి లావాదేవీలన్నీ అంతర్జాతీయంగా వివిధ దిగ్గజాల పరిశీలనకు గురవుతాయి. అంతర్జాతీయ పోటీలోకి అతడు దిగగానే ఆ అంతర్జాతీయ పోటీ నియమాలన్నీ పాటించవలసివుంటుంది. ఒకవేళ ఆ నియమాలను గనుక అతిక్రమిస్తే వెంటనే అందరిచూపూ అతడిపైన పడుతుంది. అతడు శిక్షకు పాత్రుడౌతాడు. తక్కినవారందరికీ ఏవో నీతి

> మోడీ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానం ప్రజల ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది .కేవలం తన 'ఆశ్రిత' కార్పొరేట్ల ప్రయోజనాలకోసమే పని చేస్తున్నది. జాతీయ ఆర్థిక సంస్థలైన ఎస్‌బిఐ, ఎల్‌ఐసి వంటి సంస్థలను అడ్డగోలుగా వాడుకుని ప్రయివేటు వ్యక్తుల సామ్రాజ్యాలను నిర్మించుకున్నారు. బడా పెట్టుబడిదారులకు పన్నులలో భారీ రాయితీలను కల్పిస్తున్నారు. దాని వలన ఏర్పడే లోటును పూడ్చుకోడానికి పేద ప్రజల సంక్షేమం కోసం చేయవలసిన ఖర్చులో కోతలు పెడుతున్నారు. మామూలుగా పెట్టుబడిదారుల కోసం పని చేసే ప్రభుత్వాలు కూడా ఆ విధంగా చేయవు.

నియమాలు ఉండినందువలన కాదుగాని, ఆయా దిగ్గజాల మధ్య ఉండే పోటీ కారణంగా ఈ విధంగా జరుగుతుంది. ఇప్పుడు అదానీ విషయంలో జరిగిందదే.

అతడి సంస్థను కాపాడేందుకు ప్రభుత్వం తన తోడ్పాటును అందించివుండొచ్చు. కాని ఒకసారి అందరి దృష్టిలో పడి, అంతర్జాతీయ "అభిప్రాయం" అతడి సంస్థకు ప్రతికూలంగా మారిన తర్వాత అటువంటి తోడ్పాటును కొనసాగించడం కూడా కష్టం అవుతుంది. ప్రతీ దేశ ఆర్థిక వ్యవస్థకూ విదేశీ నిధుల ప్రవాహం కొనసాగడం చాలా అవసరం. ఒకసారి మన దేశ ప్రభుత్వం తప్పుడు పద్ధతులకు పాల్పడిన వ్యాపార దిగ్గజాన్ని నియంత్రించలేని చేతకానితనాన్ని ప్రదర్శించాక విదేశీ మదుపరుల విశ్వాసం మన దేశం మీద లేకుండా పోతుంది. అప్పుడు విదేశీ నిధుల ప్రవాహం తగ్గిపోతుంది. అందువలన విదేశీ వ్యాపార చెల్లింపులలో లోటు పెరుగుతుంది. దాని పర్యవసానాలను తట్టుకోవడం కష్టసాధ్యం అవుతుంది.

ఒకవేళ ఈ వ్యాపారదిగ్గజం ఏదో ఒక విధంగా ఈ పరిస్థితుల్లో నిలదొక్కుకోగలిగినా, మోడీ ప్రభుత్వం ప్రదర్శించే పొగరుమోతు తనం మాత్రం కొనసాగడం కుదరదు. అదానీ వ్యవహారాలమీద విచారణ జరపకుండా ఉండటం అసాధ్యం. అలా జరపకపోతే అంతర్జాతీయ మదుపరులలో మనమీద విశ్వాసం పోతుంది. ఒకవేళ ఏదో నామమాత్రపు విచారణ జరిపి అదానీ ఏ తప్పూ చేయలేదని నివేదికను తీసుకువచ్చినా, అటువంటి విచారణ పట్ల అంతర్జాతీయ పెట్టుబడిదారులలో ఎటువంటి నమ్మకమూ ఉండదు. అందుచేత అదానీలకు ఏదో ఒక శిక్ష తప్పదు. అది చిన్న శిక్షే అయినా, ఆ తర్వాత రాజకీయ అధినేతకు, ఈ వ్యాపారదిగ్గజానికి మధ్య పాత స్థాయిలో లంకె కొనసాడం కష్టం అవుతుంది. తన 'ఆశ్రితుడికి'' శిక్ష పడినతర్వాత దేశ ప్రయోజనాలంటే ఆ ఆశ్రితుడి ప్రయోజనాలే అన్న సిద్ధాంతమూ పలచబడుతుంది. ఒక విధంగా కార్పొరేట్-హిందూత్వ కూటమి దూకుడు కొనసాగడం కష్టం అవుతుంది.

పెట్టుబడి ప్రపంచీకరణ క్రమానికి, జాతి రాజ్యానికిమధ్య ఉండే వైరుధ్యం ఈ అదానీ ఉదంతం రూపంలో బైటపడింది. అది హిందూ రాజ్యమే కావొచ్చు. కాని, ప్రపంచీకరణ జరిగే క్రమంలో, అంతర్జాతీయంగా నెలకొన్న పోటీ నడుమ ఒక రాజ్యం ఆ అంతర్జాతీయ పోటీ నిబంధనలకు అతీతంగా వ్యవహరించడం సాధ్యం కాదు. (స్వేచ్ఛానుసరణ)

'ఉపాధి'ని తగ్గించి నిరుద్యోగాన్ని పెంచిన మోడీ

ప్రజల జీవితాలు, వారి జీవనోపాధులపై 2023-24 సంవత్సరం కేంద్ర బడ్జెట్ పెద్ద దాడి చేసింది. ప్రజలకు నేరుగా ఆర్థిక ప్రయోజనాలు అందించగల పథకాలు, కార్యక్రమాలపై వ్యయాన్ని దేశవ్యాప్తంగా తగ్గించివేశారు. అయితే, విస్మరించిన అంశాలు పెద్దవి, మరింత ఆందోళనకరమైనవి. ప్రజలు ఎదుర్కొనే కీలక సమస్యలను నిర్లక్ష్యం చేయడమో లేదా పట్టీపట్టనట్టు వ్యవహరించడమో చేశారు. వీటిలో ముఖ్యంగా యువతలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య ఉంది. భారతదేశ జనాభాలో పనిచేయగలిగే యువత ఎక్కువగా ఉందని గొప్పగా చెప్పుకునే అంశాన్ని ఇది నేరపూరితంగా నాశనం చేసింది.

గత 41 మాసాలుగా, నిరుద్యోగిత 7శాతానికి పైగానే నమోదవుతూ వస్తోంది. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే వుంటోందని సిఎంఐఇ సర్వే డేటా తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం నిరంతరంగా అధికంగానే ఉంటోంది. 8-10శాతం మధ్య నమోదవుతోంది. ఇది ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాని అధిక రేటు. ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణితో ఇదిలాగే స్థిరంగా కొనసాగుతూ వస్తోంది. గత మూడేండ్లలో చూసినట్లైతే, మొత్తంగా ఉద్యోగుల సంఖ్య స్తబ్దుగా ఉంది. కరోనా మహమ్మారికి ముందు అంటే 2020 జనవరిలో 41.1కోట్ల ఉద్యోగులు ఉంటే 2023 జనవరి నాటికి కూడా 40.9కోట్ల మంది ఉన్నారు. ఇదిలా ఉండగా, ఇదే కాలంలో, కార్మిక ప్రాతినిధ్యం రేటు (పనిచేయగలిగే వయసులో ఉన్న వారి జనాభా వాటా అంటే పని చేయడమో లేదా ఉద్యోగాలు చూసుకుంటున్న వారి సంఖ్య) 42.9శాతం నుండి 39.8శాతానికి క్షీణించింది. ఈ విభిన్నమైన చర్యలు భయంకరమైన, బాధాకరమైన స్థితి గురించి మాట్లాడుతున్నాయి-జనాభా పెరుగుతున్నా ఉపాధి చేసే వారి సంఖ్య పెరగడం లేదు. పైగా కార్మిక ప్రాతినిధ్య రేటు తగ్గిపోతోందంటే మరింతమంది నిరాశా నిస్పృహలకు గురవుతున్నారని, లేబర్ మార్కెట్ నుండి బయటకు వెళ్ళిపోతున్నారని అర్థమవుతోంది. జీవన ప్రమాణాలు క్షీణిస్తున్నాయని తెలుస్తోంది.

అయితే, ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు సృష్టించబడతాయని లేదా దాదాపు 10లక్షల వరకు కేంద్ర ప్రభుత్వ ఖాళీలు త్వరలో భర్తీ చేయబడతాయని ప్రభుత్వం, ప్రధాని ప్రజలకు హామీ ఇస్తున్నారు. అందువల్ల, రాబోయే సంవత్సరానికి ద్రవ్య విధానాన్ని నిర్దేశించిన కేంద్ర బడ్జెట్‌లో... కనీసం ఈ ఉద్యోగాల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కొన్ని చర్యలనైనా ప్రకటిస్తారని ఆశించడం సహేతుకమే.

దీనికి భిన్నంగా, నిరుద్యోగితను ఎదుర్కొంటున్న వారికి కొంత ఉపశమనాన్ని కలిగించే ప్రస్తుతమున్న పథకాల్లో కొన్నింటికి నిధులను తగ్గించివేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) నిధులను 33శాతం తగ్గించేశారు. 2022-23 (సవరించిన అంచనాల ప్రకారం)లో రూ.89,400 కోట్లు ఖర్చు పెట్టగా, 2023-24 సంవత్సరానికి రూ.60 వేల కోట్లకు కుదించేశారు. అలాగే, జాతీయ ఉపాధుల కార్యక్రమం (నేషనల్ లైవ్‌లీహుడ్స్ మిషన్) నిధులు కూడా గతేడాది బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయాయి. ప్రత్యక్ష ఉపాధి పథకాల్లో ఈ కోతలతో పాటు... ఉద్యోగాలు సృష్టించబడతాయనుకున్న గ్రామీణ గృహ నిర్మాణ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర సంక్షేమ పథకాలకు కూడా కోత పడింది. ఆచరణలో ఐసిడిఎస్ నిధుల్లో పెరుగుదల లేదు. అంటే మంజూరైన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల్లో 2.4లక్షల ఖాళీలు ఈ ఏడాది కూడా అలాగే కొనసాగుతాయని అర్థమవుతోంది. అలాగే ఇతర పథకాలకు మరీ ముఖ్యంగా చెప్పాలంటే ఇతర విభాగాలు, మంత్రిత్వ శాఖలకు సంబంధించినంతవరకు ఇదే పరిస్థితి నెలకొంది.

ఈ బడ్జెట్‌లో ఉపాధి కల్పనా సామర్థ్యాల గురించి, గత విధానాల గురించి అనేక అసత్యాలను ప్రచారం చేయడంలో ప్రభుత్వం, దాని కీలక బాధ్యులు తలమునకలై ఉన్నారు. ఉద్యోగాలను సృష్టించగల మూల ధన వ్యయం కోసం మోడీ ప్రభుత్వం మరిన్ని మొత్తాలను కేటాయిస్తోందనేది వాటిల్లో ఒకటి. అయితే మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు పెట్టే దానికన్నా సామాజిక కేటాయింపులకు అంటే విద్య లేదా వైద్యం వంటి రంగాలపై ఖర్చు చేసినట్లైతే ఒక యూనిట్ ఖర్చుకు వచ్చే ఉద్యోగాలు మరిన్ని ఎక్కువగా ఉంటాయన్నది ఇక్కడ అందరూ



అంగీకరించగలిగిన, సుస్పష్టమైన వాస్తవంగా ఉంది. అలాగే, మోడీ హయాంలో, విదేశీ యంత్రాల వంటి వాటిని మరింతగా దిగుమతి చేసుకోవడంలో మూల ధన వ్యయం ఇమిడి వుంది. అంటే దేశీయ ఉత్పత్తి, స్థానిక ఉద్యోగాలను పణంగా పెట్టి మూల ధన వ్యయంతో చేసుకునే దిగుమతులు పెరుగుతాయి.

పరిశ్రమలకు బ్యాంక్ రుణాలను సులభతరం చేయడం వల్ల ఉత్పాదక సామర్థ్యాలు విస్తృతమవుతాయని అంటే మరిన్ని ఉద్యోగాల సృష్టికి దారి తీస్తుందనేది మరో కట్టుకథ. గత కొన్నేళ్ళ అనుభవాలను చూసినట్లైతే కార్పొరేట్ రంగానికి ఇస్తున్న పలు రాయితీలు, మినహాయింపులు, సులభతరమైన రీతిలో రుణాలను అందించినా మరిన్ని ఉద్యోగాలు సృష్టించడంలో విఫలమయ్యాయి. కరోనా మహమ్మారి నెలకొన్న రెండేండ్లలో లిస్టెడ్ కంపెనీల లాభాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. కానీ ఉపాధి కల్పన మాత్రం నిరాశపరిచే రీతిలోనే ఉంది. ఇందుకు కారణమేంటనే వివరణ ఇవ్వడం చాలా తేలిక. నిరుద్యోగిత, తక్కువ ఆదాయాల కారణంగా ప్రజల్లో కొనుగోలు శక్తి తగినంతగా లేకుండా పోయింది. దానివల్ల వస్తువులు, సేవలకు డిమాండ్ తగ్గింది. అయితే రాయితీలు లేదా రుణాలనేవి ఉత్పత్తిని మరింత విస్తరించడానికి, మరింతమంది కార్మికులను తీసుకోవడానికి పరిశ్రమల యజమానులను ప్రలోభపెడతాయి. ఇటువంటి యజమానులకు ప్రభుత్వం రుణాల రూపంలో ఇచ్చే డబ్బంతా వారి లాభాల మార్జిన్‌ను మెరుగు పరుచుకోవడానికే ఉపయోగపడుతుంది.

మొట్టమొదటగా పెద్ద నోట్లరద్దు, ఆ తర్వాత జీఎస్‌టీ దెబ్బ, అటుపై కరోనా మహమ్మారి ఇలా వరుస దెబ్బలతో తీవ్రంగా ధ్వంసమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం (ఎంఎస్‌ఎంఇ) గురించి ఏం చెప్పుకోవాలి? ప్రస్తుత బడ్జెట్‌లో హామీ ఇచ్చిన తరహాలో ఈ రంగానికి సులభంగా రుణాలు అవసరం లేదా? భారతదేశంలో 6.33కోట్ల ఎంఎస్‌ఎంఇల్లో 6.30కోట్లు (99శాతం) సూక్ష్మ సంస్థలే. 3.31లక్షలు చిన్న తరహా యూనిట్లు, కేవలం 5వేలు మాత్రమే మధ్య తరహా సంస్థలు. సూక్ష్మ సంస్థల్లో దాదాపు 11కోట్ల కార్మికులు ఉన్నారు. చిన్న తరహా సంస్థల్లో 32 లక్షల మంది ఉన్నారు. మధ్య తరహా సంస్థల్లో కేవలం రెండు లక్షల కార్మికులే ఉన్నారు. కాబట్టి, ఎక్కువ ఉపాధిని సృష్టించేది సూక్ష్మ సంస్థలే. వీటికి నిధులు అవసరం. ఎంఎస్‌ఎంఇ రంగానికి ఉద్దేశించిన

> గత కొన్నేళ్ళ అనుభవాలను చూసినట్లైతే కార్పొరేట్ రంగానికి ఇస్తున్న పలు రాయితీలు, మినహాయింపులు, సులభతరమైన రీతిలో రుణాలను అందించినా మరిన్ని ఉద్యోగాలు సృష్టించడంలో విఫలమయ్యాయి. కరోనా మహమ్మారి నెలకొన్న రెండేండ్లలో లిస్టెడ్ కంపెనీల లాభాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. కానీ ఉపాధి కల్పన మాత్రం నిరాశపరిచే రీతిలోనే ఉంది. ఇందుకు కారణమేంటనే వివరణ ఇవ్వడం చాలా తేలిక. నిరుద్యోగిత, తక్కువ ఆదాయాల కారణంగా ప్రజల్లో కొనుగోలు శక్తి తగినంతగా లేకుండా పోయింది. దానివల్ల వస్తువులు, సేవలకు డిమాండ్ తగ్గింది.

రుణంలో చాలా భాగం మధ్యతరహా సంస్థలకు వెళ్ళిపోతోంది. 2022 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఎంఎస్‌ఎంఇలకు ఇచ్చే రుణాలు చాలా తీవ్రంగా పెరిగాయి. చిన్న, మధ్య తరహా సంస్థలకు కలిపి రూ.2.57లక్షల కోట్లు రుణాలు ఇవ్వగా, సూక్ష్మ సంస్థలకు కేవలం రూ.68.9 వేల కోట్లు మాత్రమే దక్కాయి. దీనంతటిని బట్టి స్పష్టమయ్యేదేమిటంటే నయా ఉదారవాద సిద్ధాంతం మత్తులో పడి మోడీ ప్రభుత్వ కళ్ళుమూసుకుపోయాయి. బడా పెట్టుబడిదారుల-దేశీయ, విదేశీ- మీద అది పూర్తిగా ఆధారపడుతున్నది. వారిని ప్రోత్సహిస్తే ఆర్థిక వ్యవస్థకు వారే ఊపు తెస్తారని, ఉద్యోగ అవకాశాలు వాటంతటవే పెరిగిపోతాయన్నట్టుగా వ్యవహరిస్తున్నది. అసంభవమైన 'ట్రికిల్ డౌన్' సిద్ధాంతంపై దానికున్న నమ్మకమే ఉద్యోగ సంక్షోభ పరిష్కారంపై దృష్టిపెట్టకుండా దాని చేతులు కట్టిపడేస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తన విధానాలను సమూలంగా మార్చుకునేలా చేయడమో లేక వచ్చే ఎన్నికల్లో దానిని విసిరికొట్టడమో చేయాల్సిన అవసరముంది.

-'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

ప్రమాదవశాత్తు ఎవరైనా ఈ ప్రపంచాన్ని కొద్దికాలం పాలించవచ్చు. కాని ప్రేమను ఆధారంగా చేసుకున్నవారు ఎప్పటికీ ఈ ప్రపంచాన్ని ప్రభావితం చేయగలరు.

ప్రేమ! ఒక మధుర భావన, మానసికోద్వేగం, ఊగించి శాసించే కలాపం, క్షణం నిలువనివ్వని తపన. హృదయాన్ని ఊరడించే మధురస్వప్నం. మనసుని మెత్తగా హత్తుకునే ఒక ఆత్మీయ భావం. మనం నిత్యం వినే మాట ప్రేమ.. ప్రేమ.. ప్రేమ... అనే పదం వినపడని రోజంటూ ఉండదు. పల్లె, పట్నం, నగరం ఎక్కడైనా ప్రేమ స్వరాలు వినిపిస్తూనే ఉంటాయి. ప్రేమకి సంబంధించిన నిజాలు, అబద్ధాలు పుకార్లు కలగలిసి షికార్లు చేస్తుంటాయి. ఆర్థిక స్థోయి, సామాజిక స్థాయి ఏదైనా ప్రేమ పరవశం కోసం మనుషులు ఆరాటపడుతుంటారు. అలాంటి ప్రేమ యువతను ఒక్కోసారి పక్కదోవ పట్టిస్తుంది. సమస్యనూ సృష్టిస్తుంది. మరి అలాంటి సమస్యల్లో పడకూడదంటే అసలు ప్రేమంటే ఏమిటో ఈరోజు మానవిలో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా...

ప్రేమంటే ఏమిటంటే..?

ప్రేమంతే ఒత్తిడుల
వడగళ్ళ వానలుంటాయి
సమస్యల సుడిగుండాలుంటాయి
అడుగడుగునా అన్ని పరీక్షలుంటాయి
ఆర్థిక సంక్షోభాలుంటాయి
శాడిస్టుల హత్యలుంటాయి
తట్టుకొని నిలబడలేకపోతే
ఆత్మహత్యల ఆలింగనాలుంటాయి
ప్రేమంతే గులాబీపువ్వు కాదు
ఆకు ఆకుకు పొంచి ఉన్న ముల్లు
ప్రేమంటే మకరందం తాగి
ఎగిరిపోయే తుమ్మెద కాదు
పరిమళాన్ని వెదజల్లే పుష్పం
ప్రేమంతే మొబైల్లో నొక్కే పదం కాదు
గుండెమీద నిలుపుకునే
కోహినూరు వజ్రం

– జి.విజయలక్ష్మి, జర్నలిస్టు

సరిగ్గా ప్రేమించడం కొందరికే తెలుసు. ఆ ప్రేమను నిలుపుకోవడం చాలా కొద్ది మందికే తెలుసు.

నిజమైన ప్రేమికులు, ప్రేమికులను మార్చుకోరు. ప్రేమించే పద్ధతిని మార్చుకుంటారు.

అమ్మాయిలూ ఆలోచించండి



– ముదిగొండ రాజ చంద్రిక, కవయిత్రి.

ప్రేమ ఈ రెండు అక్షరాలు ఎంత శక్తివంతమైనవో అందరికీ తెలుసు. అరిటాకు ముల్లు అనేది పాత సామెత అయినా ప్రేమ ప్రయాణంలో అధికంగా బాధపడుతున్న వారు అమ్మాయిలే. చదువు, తెలివితేటలు, ఆర్థిక అస్తిత్వం, ఆత్మవిశ్వాసం అన్నీ వున్నా ప్రేమ విషయంలో యువతులు బోల్తా పడుతూనే వున్నారు. అందుకే యువతులు యుక్తితో మెలగాలి. ఆకర్షణకి ప్రేమకి తేడా తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ప్రేమ స్నేహం ఏ బంధం అయినా భావోద్వేగాలు అదుపులో వుంటే విపత్కర పరిస్థితుల్లో కృంగి పోకుండా వుండవచ్చు. ప్రస్తుత కాలంలో బోయ్ ఫ్రెండ్ లేదు అంటే ఏదో లోపంగా భావిస్తున్నారు. ఇది కేవలం అవతలి వ్యక్తి భ్రమ అని గుర్తించాలి. స్నేహితులకి చూపించు కోడానికి ప్రేమలో పడాల్సిన అవసరం లేదు. చదువుకునే చోట, పని చేసే చోట, ఇంటి దగ్గర ఎక్కడైనా సరే ప్రలోభాలకు లొంగి ప్రేమలో పడి ఆ తర్వాత ఇబ్బందులు పడవద్దు. వయసుకు తగ్గట్టు ఆలోచన చేస్తూ అడుగు ముందుకు వెయ్యాలి. ముందు చదువు, ఆర్థిక సామర్థ్యం ఆ తర్వాతే ప్రేమ, పెండ్లి అని స్థిర నిర్ణయం తీసుకోవాలి. అవసరం అయినప్పుడు అదే నిర్ణయం మీ వాళ్ళకి, మీకు ప్రేమ ప్రపోజల్ పెట్టిన వారికి తెలిపే ధైర్యమూ వుండాలి. ప్రేమ అనే ఒక్క ఎమోషన్, నిర్ణయం మీ జీవితాన్ని తారుమారు చేస్తుంది తస్మాత్ జాగ్రత్త. ఇన్ని ఆలోచించి చేస్తే అది ప్రేమ ఎలా అవుతుంది అని అనుకుంటే పెండ్లి తర్వాత తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయి. "ప్రేమ ఎప్పుడు ఎక్కడ ఎవరిమీద ఎలా పుడుతుందో తెలీదు"ఇలాంటి సినిమా డైలాగులకు ప్రభావితం కావద్దు. మీరు ఎలాంటి భవిష్యత్తు కోరుకుంటున్నారు దానికి ఆ వ్యక్తి సరిపోతాడా లేదా కచ్చితంగా ఆలోచించాలి. ఇక ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తుంటే తక్షణమే ఇంట్లో వారికి, పోలీసులకి తెలియజేయాలి. నలుగురికీ తెలిస్తే పరువు పోతుంది జంకుతే సమస్య జటిలం అవుతుంది. అభిరుచి వుండడం తప్పు కాదు కానీ కేవలం బాహ్య సౌందర్యం చూసి ప్రేమికుడిని ఎన్నుకోవడం నూటికి నూరు శాతం తప్పు. అసలు ప్రేమికుడిని ఎన్నుకోవడం అంటే జీవితాన్ని ఎన్నుకోవడం అని గుర్తు పెట్టుకోవాలి. అమ్మాయిలూ మీరు ప్రేమిస్తున్నా ప్రేమలో మునిగి తేలుతున్న, ప్రేమలో బోల్తా పడుతున్నా ఒక్క విషయం గుర్తుంచుకోండి. జీవితం ఎక్కడా ఆగిపోదు. పోవద్దు. పయాణం సాగుతూనే ఉంటే ప్రేమ ఒక మధుర జ్ఞాపకంగా మిగిలి పోతుంది. విఫలమైతే విషాద పడి ఆగిపోతే ఆ ప్రభావం జీవితాంతం వుండి పోతుంది. అమ్మాయిలూ ఆలోచించండి.

ప్రేమిస్తున్నారా.. ఒక్క క్షణం ఆగండి...



– పి.యస్.యమ్.లక్ష్మి, కవయిత్రి, మహబూబ్‌నగర్

అమ్మాయి టీన్స్‌లోకి వచ్చిందంటే వలపు తలపులు మొదలవుతాయి. ఆకర్షణలు పెరుగుతాయి. అందులోనూ ఈ మధ్య ప్రతివారి చేతిలోనూ సెల్ ఫోన్. పైగా దానిని అవసరాలకి మించి ఆడంబరాలకి వాడటం ఫ్యాషన్ అయిపోయింది. చదివిన చదువులకు సరైన ఉద్యోగం సంపాదించే అవకాశాలు అందివ్వని సమాజం. ఇలా ఎన్నో, ఎన్నెన్నో కారణాలు నేటి అమ్మాయిలు ప్రేమ అనే ఎండమావి వెనక పడటానికి కారణాలు. ఈ మధ్య చదువుకున్న అమ్మాయిలు వరుణ్ణి ఎంచుకోవటంలో చాలా జాగ్రత్త పడుతున్నారని, అబ్బాయిలకు వివాహం కావటం కష్టమవుతున్నదని కొందరు తల్లుల ఆందోళన. ఇలాంటివారు ప్రేమలో పడ్డా పర్వాలేదు. ఎదుటివారిని గుడ్డిగా నమ్మి ఏ పనీ చెయ్యరు. కానీ ఎక్కువగా చదువుకోని అమ్మాయిలు, యుక్త వయసులో ఆకర్షణకి లోనయి జీవితాలు నాశనం చేసుకునే సంఘటనలు ఎక్కువగా వున్నాయి. కొంచెం డబ్బున్నవాడిగా కనబడి నాలుగు ప్రేమ కబుర్లు చెప్పగానే తాము హీరోయిన్స్ అనుకుంటారు. తాము లేనిదే తమ ప్రేమికుడు బతకలేడు అనుకుంటారు. ఇలా అన్యాయమయ్యే ఆడపిల్లల జీవితాలు ఏమవుతున్నాయో ఎన్నో చూస్తున్నాం. అయితే మీరు నమ్మవలసిన నిజం ఇంకోటి వుంది. సినిమాల్లో హీరోల్లాగా మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. అన్యాయమయిపోయిన ఆడ పిల్లలు తాము మనుష్యులమని మరచిపోయి రోజు రోజూ చస్తూ బతకాల్సి వుంటుందని. అమ్మా నాన్నల ముద్దుల పట్టి మీరు. అందం వున్నా లేకపోయినా, ఆస్తి వున్నా లేకపోయినా మీరూ ఒక మనిషి. మీకూ మనసుంది. దానికి మీరెలా బతకాలో ఒక అవగాహన వుందో లేదో చూసుకోండి. కాస్త తెలివిగా మీ జీవితాన్ని దిద్దుకోండి. ఒక అబ్బాయి అంటే ఇష్టపడటంలో తప్పేమీ లేదు. అయితే అతని మనస్తత్వం, అలవాట్లు, కుటుంబం, అన్నీ తెలుసుకోండి. ఆ కుటుంబంవారు మిమ్మల్ని వాళ్ళ కుటుంబంలోకి అంగీకరిస్తారో లేదో కూడా గ్రహించండి. అమ్మాయిలూ, మీరూ మనుష్యులేనమ్మా. ఆకర్షణా, ప్రేమ, పెండ్లి ఇవే కాదు జీవిత ఆశయాలు. ముందు మీరు అవకాశం వున్నంతమటుకూ చదువుకోండి. చదువు విచక్షణా జ్ఞానం ఇస్తుంది. అన్నింటికన్నా ముందు మీ జీవితంలో మీరు నిలదొక్కుకోండి. స్త్రీకైనా, పురుషుడికైనా ఆర్థిక స్వావలంబన అత్యవసరం. ముందు మీ కాళ్ళ మీద మీరు నిలబడండి. కూలి చేసినా, పదవులేలినా మీ ఆర్థిక స్వాతంత్ర్యం మీకుండేటట్టు చూసుకోండి. మరి అవతల వ్యక్తి ఆర్థిక స్తోమతు కూడా అతను పెట్టే ఖర్చుబట్టి కాకుండా అతను చేసే పనిబట్టి తెలుసుకోండి. తియ్యని మాటలకి పొంగిపోయే గుణం మానుకోండి. ఆలోచన పెంచుకోండి. ఆడపిల్ల పెండ్లి గురించి తల్లిదండ్రులు ఎన్నో ఆలోచనలు చేస్తారు. తమ కూతురుకి మంచి సంబంధం తెచ్చి పెండ్లి చెయ్యాలనే చూస్తారు. వాళ్ళకన్నా మీ శ్రేయస్సు కోరేవారు వుండరు. మీ ప్రేమని వారికి విషయం చెప్పండి. వారు అంగీకరించకపోతే ఆవేశంలో నిర్ణయం తీసుకోవద్దు. కారణాలు తెలుసుకోండి. వాటిని అధిగమించగలరో లేదో ఆలోచించండి. ప్రేమ అంటే ఇవాళ ప్రేమ, రేపు పెండ్లి కాదు.. జీవితం. పెండ్లికి గుర్తింపు కూడా అవసరం. పెద్దలు చేసే పెండ్లిగానీ, చట్టబద్ధమైన పెండ్లిగానీ చేసుకోండి. ఇరువైపు పెద్దలూ ముఖ్యులే. వాలెంటైన్స్ డే అని సంతోషంగా సంబరాలు జరుపుకోవటం కాదు. మీ జీవితంలో చక్కని రాజ బాటలో పయనించి జీవితాంతం సంతోషంగా వుండండి.



పారా హుషార్



– సునీత బందారు, కవయిత్రి. మహబూబ్‌నగర్

నేడు బాలికలు, యువతులు, వివాహితలపై జరుగుతున్న దాడులను చూసి మనసు ద్రవించిపోతుంది. దిశ చట్టాలు ఎన్ని వచ్చినా మహిళల పట్ల తీరు మారడం లేదు. కుటుంబం నుంచే అక్కాచెల్లెళ్ల అనుబంధాలను, కుటుంబ బాంధవ్యాలను స్నేహితుల మమతానురాగాలను తెలుపుతూ సమాజంలో మానవ సంబంధాలను బలోపేతం చేయాలి. తల్లిదండ్రులు గురుతర బాధ్యత తీసుకొని తమ కొడుకులు, కూతుర్లు ఎక్కడికి వెళు తున్నారో, ఎప్పుడు వస్తున్నారో, ఎక్కడి నుంచి వస్తున్నారో ఒక కంట కనిపెడుతూ వారికి స్నేహపూర్వకంగా విద్యాబుద్ధులు నేర్పాల్సిన బాధ్యత వారికి ఉండాలి. నవ నాగరిక సమాజంలో ఆటవిక రాజ్యాన్ని అంతం చేయాలి. తాను అనుకున్నది సాధించాలనే తపనతో తమ తల్లి, చెల్లి కూడా ఒక స్త్రీ అని మరచిపోతూ ఇతరులపై హింసకు పూనుకుంటున్న నేటితరం భవిష్యత్తు అగమ్య గోచరం. యువతపనైనే కాక వృద్ధాప్యంలో కొట్టుమిట్టాడుతున్న ముసలి వాళ్లను, చివరకు పసిమొగ్గల పైన కూడా అరాచకత్వాన్నికి పాల్పడడం సిగ్గుచేటు. తరతరాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అవమానాలను, హింసా ధోరణులను, హత్యలను, లైంగిక దాడులను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉంది. తెలిసీ తెలియని వయసులో ప్రేమ అంటూ వెంటపడుతూ తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్న వారిని ఎంతో మందిని మనం చూస్తున్నాం. ప్రేమ పేరుతో రహస్యంగా ఫొటోలు, వీడియోలు చిత్రీకరిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు వాటికి అసభ్య కామెంట్లు జోడించి యూట్యూబ్ ఛానెళ్లలో అప్‌లోడ్ చేస్తున్నారు. బయటికి వెళ్ళిన బిడ్డలు మళ్ళీ ఇంటికి తిరిగి వచ్చే వరకు కూడా మనం సందేహంతో ఎదురుచూస్తూనే ఉంటాము. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారి నుంచి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడానికి ప్రాథమిక తరగతి నుంచే స్త్రీ విద్యను ప్రవేశపెట్టాలి. ఆత్మ రక్షణ కొరకై తరగతులు నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకుండా మనోధైర్యాన్ని మనసులో నింపాలి.

కొన్ని సందర్భాల్లో మన కండ్లతోటి, చేతులతోటి, దేహాలతోటి ప్రేమిస్తుంటాం. శాశ్వతంగా ప్రేమించేది హృదయాలతోనే.

నిన్ను బాధించిన హృదయాన్ని ప్రేమించు. నిన్ను ప్రేమించే హృదయాన్ని బాధించకు.

చర్చికి నిప్పు...

(మొదటిపేజీ తరువాయి)

వివరాల ప్రకారం... గిరిజనులు ఎక్కువగా నివసించే నర్మదాపురం జిల్లా చౌకీ పురా గ్రామంలో క్రైస్తవ ప్రార్థనా మందిరం ఉంది. ఐదేళ్ల కిందట నిర్మించిన ఈ చర్చి వద్దకు ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొందరు వ్యక్తులు వచ్చారు. కిటికీ తెరిచి లోనికి ప్రవేశించారు. లోపల ఉన్న కొన్ని వస్తువులకు నిప్పుపెట్టారు. మరి కొన్ని వస్తువులను ధ్వంసం చేశారు. చర్చి లోపలి గోడలపై 'రామ్' అని హిందీలో రాశారు. సోమవారం ఉదయం ఈ దారుణ ఘటనను చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో వివాదస్పద ఘటన

మరోవైపు మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాలో మరో వివాదస్పద సంఘటన చోటుచేసుకున్నది. ఒక ముస్లిం వ్యక్తి ఇంట్లోకి కొందరు బలవంతంగా చొచ్చుకొచ్చారు. ఆ ఇంట్లో హనుమంతుడి విగ్రహాన్ని ఉంచారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అక్కడకు చేరుకున్న పోలీసులు లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా జరిగిన రాళ్ల దాడిలో నలుగురు పోలీసులు గాయపడ్డారు. ఈ సంఘటనలపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేయటంతోపాటు.. ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ వివాదానికి ప్రధాన నిందితుడు హిందూ నాయకుడు రవి అవద్ అని పోలీసులు తెలిపారు.

దిగొచ్చిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)



విషయం అనుకోకుండా బయటకు వెళితే నిధుల ప్రవాహంపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని తెలిపారు. హిండెన్‌బర్గ్ నివేదిక అనంతరం తలెత్తిన పరిస్థితులపై సెబీ సహా ఇతర అత్యున్నత సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయని వివరించారు. హిండెన్‌బర్గ్ నివేదికపై దర్యాప్తు జరపాలని కోరుతూ విశాత్ తివారీ, మనోహర్‌లాల్ శర్మ లు వేసిన రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఈనెల 10న విచారణ జరిపింది. ఈ ధర్మాసనంలో సీజేఐ చంద్రచూడ్‌తో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జె.బి పార్థివాలలు ఉన్నారు. స్టాక్ మార్కెట్‌లో లక్షల కోట్ల రూపాయలు ఆవిరి కావడంపై కోర్టు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. భారత మదుపరులను రక్షించాల్సి ఉన్నదని అభిప్రాయం వ్యక్తం చేసింది. రెగ్యులేటరీ ప్రక్రియపై కేంద్రం, సెబీ అభిప్రాయాలను కోరింది. దీనిపై విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో నిపుణుల కమిటీని వేయాలని సూచించింది. దీంతో ఈ వేర్వేరు పిటిషన్లపై సోమవారం కొనసాగిన విచారణలో కమిటీ ఏర్పాటుకు కేంద్రం తన సమ్మతిని తెలిపింది.

గుడిసె పోరాటాలు..



(మొదటిపేజీ తరువాయి)

స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తా మని హెచ్చరిస్తున్నారు. వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాల్టీ పరిధిలో పేదల కోసం పాతిక సంవత్సరాల కిందట టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి జాగాల పట్టాలిచ్చింది. పట్టణానికి దగ్గరలో దుబాయికుంటలో 7.30 ఎకరాలను 1996-97లో పేదల ఆవాసాల కోసం పంపిణీ చేశారు. కానీ వారికి హద్దులు చూపించలేదు. దాంతో అప్పటి నుంచి ఇండ్లు కట్టుకోలేకపోయారు. మొత్తం 400 మంది లబ్దిదారులున్నారు. గతేడాది సెప్టెంబరు 6న బాధితులంతా.. తమ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. పట్టాలకు సంబంధించి హద్దులు చూపించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అమరచింతలో బాధితులు పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి ఆ భూమిలో గుడిసెలు వేసుకున్నారు. దాంతో ఎంఆర్‌ఓతో పాటు సీఐ, 20 పోలీసులు వచ్చి హద్దులు చూపిస్తామని హామీ ఇచ్చారు. ఐదు నెలలు దాటినా హామీ అమలు కాలేదు. మక్తల్ ఎమ్మెల్యే, వనపర్తి కలెక్టర్, మంత్రి నిరంజన్‌రెడ్డికి విన్నవించుకున్నా ఫలితం లేదు. దాంతో బాధితులంతా రోజూ అక్కడే ఉంటూ నిరసన తెలుపుతున్నారు. ఒక్కో ఇంటికోసం ఇప్పటికే రూ. 10 వేలు ఖర్చు పెట్టుకున్నారు. ఇక్కడ ఒక కాలనీ మాదిరిగా తయారైంది. సీపీఐ(ఎం) నాయకులే గుడిసెవాసులకు తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పెద్దఎత్తున ఎంఆర్‌ఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం అఖిలపక్షం ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలన్నీ పేదల పక్షమేనని నేతలు చెప్పారు. బాధితులకు స్థలాల హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. అయితే బీఆర్ఎస్ నాయకులు మాత్రం గుడిసెలు తీయాలని పట్టుబట్టగా.. ఎట్టి పరిస్థితుల్లోనూ గుడిసెలు తీసేది లేదని సీపీఐ(ఎం) నేతలు వాదించారు.

నిరుపేదల నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల ఆవాసాల కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. వనపర్తి జిల్లా, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, ఎత్తం, బల్మూర్, అచ్చంపేట , కల్వకుర్తి ప్రాంతాల్లో ఇంటి స్థలాల కోసం ఉద్యమాలు చేస్తున్నారు. కొల్లాపూర్‌లో 8ఎకరాలు, బల్మూరులో 4 ఎకరాల్లో ప్లాట్లు చేయాలని బాధితులు కోరుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంచాలని కోరుతున్నా... పాలకులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

పట్టాలు ఇవ్వకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
ఎండి జబ్బార్- సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కార్యదర్శి

జిల్లాలో అనేక చోట్ల పేదలకు ఆవాసాల కోసం గతంలో ఇచ్చిన స్థలాలను ఇప్పటికీ చూపలేదు. ముఖ్యంగా అమరచింత పట్టణంలో 400 మంది ఇండ్ల కోసం 7.30 ఎకరాలను పాతికేండ్ల కిందట కేటాయించారు. ఇప్పటికీ స్థలాలకు హద్దులు చూయించలేదు. స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వాలి. లేనిచో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం.

అగస్టా వెస్ట్‌ల్యాండ్ స్కామ్‌తో అదానీకి లింక్..!

(మొదటిపేజీ తరువాయి)

సంస్థగా ఉంది. అదానీ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీనే 2002లో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌గా మార్చుతూ ఆ కంపెనీ బీఎస్ఈకి సమాచారం ఇచ్చింది. గుడామి ఇంటర్నేషనల్ కంపెనీలో అదానీకి చెందిన డైరెక్టర్ కీలక వాటాదారులుగా ఉన్నారు. గుడామి ఇంటర్నేషనల్ కంపెనీ నిలిచిపోయిందని, పొరపాటున పేరు ఇచ్చామని 2017లో సింగపూర్ అధికారులు లేఖ ఇచ్చారు. దీంతో ఈడీ తన ఛార్జ్‌షీట్ నుంచి అదానీ సంబంధిత కంపెనీ పేరును తొలగించడం విశేషం.

అగస్టావెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కేసులో 2014లో ఈడీ దాఖలు చేసిన తొలి చార్జిషీట్‌లో సింగపూర్‌కు చెందిన కంపెనీ పేరు ఉంది. ప్రధాన నిందితుడు గౌతమ్ ఖైతాన్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో నకిలీ ఇన్‌వాయిస్‌లను పెంచడం ద్వారా గుడామి వ్యాపారం చేస్తున్నాడని ఛార్జిషీట్ ప్రధానంగా ఆరోపించింది. 2017లో దాఖలు చేసిన రెండవ అనుబంధ ఛార్జిషీట్‌లో కూడా గుడామి ఇంటర్నేషనల్ పీటీఈ లిమిటెడ్‌ను ప్రస్తావించింది. మధ్యవర్తి రాజీవ్ సక్సేనాపై దాఖలు చేసిన ఈ ఛార్జిషీట్‌లోనూ ఆ కంపెనీల గురించి మరోసారి చేర్చింది. ఖైతాన్‌పై 2009లో ఈడీ అధికారులు దాడి చేసినప్పుడు ఆ సమయంలో ఆ కంపెనీ ఉద్యోగి నుంచి ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుంది. ఫోరెన్సిక్ పరీక్షలో గుడామితో సహా డొల్ల కంపెనీల ద్వారా నిధులు పొందిన అనేక కంపెనీల పేర్లను గుర్తించారు. అగస్టావెస్ట్‌ల్యాండ్ స్పా 2.43 కోట్ల యూరోలను ట్యునీషియా ఆధారిత కంపెనీ ఐడీఎస్ టాన్సియాకు బదిలీ చేసింది. ఇందులోంచి 1.24 కోట్ల యూరోలు ఖైతాన్‌కు చెందిన ఇంటెర్‌స్టెల్లర్ టెక్నలాజీస్‌కు బదిలీ చేయబడ్డాయి. ఇంటర్‌స్టెల్లర్ నగదు తీసుకోవడం, చెల్లింపుల ఆధారంగా చేసుకుని ఈడీ ఛార్జిషీట్‌లో చేర్చింది.

రెవెన్యూ లక్ష్యాలకు కోత

హిండెన్‌బర్గ్ రిపోర్ట్ ప్రభావం నేపథ్యంలో అదాని గ్రూపు తన రెవెన్యూ వృద్ధి లక్ష్యం అంచనాలకు కోత పెట్టుకుందని సమాచారం. అదేవిధంగా తాజా పెట్టుబడుల వ్యయాలను నిలిపివేసినట్టు తెలుస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అదానీ గ్రూపు రెవెన్యూ వృద్ధి లక్ష్యాన్ని 15-20 శాతానికి తగ్గించుకుంది. ఇంతక్రితం 40 శాతం వృద్ధి అంచనా వేసింది. మరోవైపు అదానీ గ్రూపు షేర్ల పతనం కొనసాగింది. సోమవారం అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 7.63 శాతం తగ్గి రూ.1,706కు పడిపోయింది. అదాని పవర్ 4.99 శాతం, అదాని విల్మర్ 5 శాతం, అదాని పోర్ట్ 5.39 శాతం, ఎన్‌డీటీవీ 4.98 శాతం చొప్పున నష్టపోయాయి.

సచార్ కమిటీ
కీలక సిఫారసులు తొలగింపు!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోబోతున్నట్టు 'ద టెలిగ్రాఫ్ ఆన్‌లైన్' వార్తా కథనం పేర్కొంది. గత గురువారం కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ పెండింగ్ బిల్లులు, ఇతర హామీలకు సంబంధించిన 79వ నివేదికను లోక్‌సభ ముందుంచింది. 'సచార్ కమిటీ'పై మధ్యంతర స్థాయి మంత్రిత్వశాఖల సంప్రదింపులను నివేదికలో వివరించారు. 'ఈవోసీ' ఏర్పాటుపై పలు మంత్రిత్వ శాఖలు విముఖత వ్యక్తం చేశాయని, సానుకూలంగా స్పందించలేదని, కేంద్ర ఆర్థికశాఖ, కేంద్ర హోంశాఖ వ్యతిరేకించాయని నివేదికలో తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేస్తే..సచార్ కమిటీ ప్రతిపాదనలు, సూచనలు అంతా అటకెక్కినట్టే.

ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేందర్ సచార్ నేతృత్వంలో 2005లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ కమిటీని నియమించారు. కమిటీ 2006లో 403 పేజీల నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో భారత్‌లోని ముస్లింల సమగ్ర అభివృద్ధికి పలు సూచనలు, పరిష్కారాలను ప్రతిపాదించింది. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా రెండోసారి అధికారంలోకి వచ్చాక, 'ఈవోసీ' చట్టబద్ధమైన సంస్థగా పేర్కొంటూ ముసాయిదా బిల్లును రూపొందించింది. ఈ బిల్లుకు 2014 ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అయితే అదే ఏడాది 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, కేంద్రంలో మోడీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక, అప్పట్నుంచీ ఈ బిల్లు పెండింగ్‌లో ఉండిపోయింది.


తెలంగాణలో
భారీగా పెరిగిన అప్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఇప్పుడు ఆ అప్పులు రూ.2,83,452 కోట్లకు చేరాయి. 2022 అక్టోబర్ నాటికి మొత్తం అప్పులు రూ. 4,33,817.6 లక్షల కోట్లు ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ అప్పు ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే చేసింది కాదనీ, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు అన్ని కలిపి చేసిన అప్పు అని కేంద్రం స్పష్టం చేసింది. లోకసభలో కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

తెలంగాణ వచ్చిన నాటి నుంచి 2022 వరకూ అప్పులు..

2014-15లో రూ. 8,121 కోట్లు
2015-16లో రూ. 15,515 కోట్లు
2016-17లో రూ. 30,319 కోట్లు
2017-18లో రూ. 22,658 కోట్లు
2018-19లో రూ. 23,091 కోట్లు
2019-20లో రూ. 30,577 కోట్లు
2020-21లో రూ. 38,161 కోట్లు
2021-22లో రూ. 39,433 కోట్లు




ఇవి మాత్రమే కాకుండా... రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లకు రుణాలు ఇచ్చినట్టు కేంద్ర ఆర్థిక శాఖకు ప్రభుత్వ రంగ బ్యాంకులు నివేదించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, నాబార్డు, ఇతర కార్పొరేషన్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థలు తీసుకున్న రుణాలు రూ.1,50,365.60 కోట్లకు చేరినట్టు కేంద్రం పేర్కొంది. 12 బ్యాంకుల నుంచి కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు రూ.1,30,365.60 కోట్లకు చేరాయి. రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ. 8,871 కోట్లు మంజూరు కాగా, రూ. 7,144 కోట్లు విడుదల చేసినట్టు కేంద్రం పేర్కొంది. వేర్ హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుంచి రూ. 972 కోట్లు మంజూరు కాగా... రూ. 852 కోట్లు విడుదల చేశామనీ, ఫుడ్ ప్రాసెసింగ్ ఫండ్ నుంచి 2015-16, 2016-17లో రూ. 28 కోట్లు మంజూరు కాగా, రూ. 10 కోట్లు విడుదలయ్యాయని తెలిపింది. నాబార్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ అసిస్టెన్స్ నుంచి వివిధ పథకాల అమలు కోసం రూ. 14,516.65 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 11,424.66 కోట్లు వినియోగించుకున్నట్టు కేంద్రం తెలిపింది.

పేరుకే పెద్దాస్పత్రులు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే వన్ టైం గ్రాంట్ కింద కేంద్రం ఒకే సారి రూ.130 కోట్లు ఇచ్చే నిబంధన ఉన్నప్పటికీ విభాగం ఏర్పాటు చేయకపోవడం, మరోవైపు రోగులకు బయట కూడా సకాలంలో చికిత్స దొరికేలా చెల్లింపులు చేయకపోవడం తదితర కారణాలు రోగులకు శాపాలుగా మారాయి.

రైల్వే సెంట్రల్ ఆస్పత్రి విషయంలోనూ ఇదే రకమైన విమర్శలొస్తున్నాయి. ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరులున్నప్పటికీ రోగులను కార్పొరేట్‌కు పంపిస్తున్నారనే వాదనలొస్తున్నాయి. రోగులను ఆస్పత్రులకు పంపించి వారికి చెల్లించే డబ్బులు వెచ్చిస్తే సొంతంగా రైల్వే ఆస్పత్రిలో ఆధునాతన క్యాన్సర్ విభాగం ఏర్పాటు చేయొచ్చుని ఆ రంగం నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



బీబీనగర్ ఎయిమ్స్‌లోనూ క్యాన్సర్ విభాగం లేకపోవడంతో రోగులకే కాకుండా సంబంధిత కోర్సుల్లో వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకూ నష్టమే జరుగుతున్నది. వైద్య విద్యలో అండర్ గ్రాడ్యుయేట్ దశలో క్యాన్సర్ ఒక ఆప్షనల్‌గా మాత్రమే ఉండటంతో ఎయిమ్స్ లో ఈ విభాగం ఏర్పాటుపై ఆసక్తి చూపించటం లేదని తెలుస్తున్నది. అయితే భవిష్యత్తులో ఆంకాలజీ (క్యాన్సర్) విభాగంలో పీజీ సీట్లు రావాలంటే ఈ విభాగం తప్పనిసరి ఉండితీరాలి.

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ఏది?

గర్భాశయ క్యాన్సర్ సమస్య మహిళలను పట్టిపీడిస్తున్నది. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది లక్ష మంది మహిళలు కొత్తగా దీని బారిన పడుతుండగా, దాదాపు 60 వేల మంది ప్రాణాలొదులుతున్నారని లెక్కలు చెబుతున్నాయి. వైద్యపరిశోధనల ఫలితంగా కొన్ని రోగాలకు వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయి. హ్యూమన్ పాపిల్లో వైరస్ వల్ల వచ్చే ఈ క్యాన్సర్‌ను నివారించే వ్యాక్సిన్ పరిశోధన ఫలితాలు అందించింది. 12 ఏండ్లు దాటిన యువతులు, మహిళలు ఈ వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి ప్రయివేటులో రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతుండటంతో పేద మహిళలు వ్యాక్సినేషన్‌కు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో పేద యువతులు, మహిళలను ఆదుకునేందుకు ఆయా ఆస్పత్రుల్లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను అందుబాటులోకి తేవల్సిన అవసరమున్నది.

ప్రతిపాదనలు పంపాలి

క్యాన్సర్ విభాగాల ఏర్పాటు కోసం ఆయా ఆస్పత్రుల హెడ్స్ ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. వాటిని ఆమోదించాక ఒక విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కనీసం ఏడాది పట్టొచ్చని ఆంకాలజీ నిపుణులు చెబుతున్నారు. ఈ విభాగం ఏర్పాటుతో రోగులకు ఆధునిక చికిత్సలందడమే కాకుండా వైద్య విద్యార్థులకు పీజీ సీట్ల సంఖ్య కూడా పెరుగుతుందని వారు సూచిస్తున్నారు.

కార్పొరేట్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

న్యాయం చేయాలంటూ విద్యార్థి సంఘాల ధర్నా




(ఫైల్)

నవతెలంగాణ-బోడుప్పల్

ఇంటర్‌లో పరీక్షల్లో మాస్ కాపియింగ్ చేశావంటూ కళాశాల యాజమాన్యం మందలించడంతో అవమానంగా భావించిన విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్ మేడిపల్లి పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. మేడిపల్లి పోలీసులు, విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా, బల్మూరు మండలం చెంచుగూడా గ్రామానికి చెందిన నిమ్మల రాములు పెద్ద కుమార్తె రమాదేవి(17) మేడ్చల్ జిల్లా పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ చైతన్య ఇంటర్ కళాశాలలో మొదటి ఏడాది చదువుతున్నది. సోమవారం ప్రీ ఫైనల్ పరీక్షల్లో చూసి రాస్తుందని లెక్చరర్ మందలించారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన రమాదేవి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు తలుపు తీసేందుకు ప్రయత్నించగా ఎంతకూ తీయకపోవడంతో కిటికీలోంచి చూశారు. రమాదేవి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దాంతో వారు యాజమాన్యానికి సమాచారం ఇవ్వగా.. వారు మేడిపల్లి పోలీసులకు చెప్పారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

కళాశాల వేధింపులు భరించలేకనే రమాదేవి ఆత్మహత్య చేసుకుందని, కళాశాల గుర్తింపు రద్దు చేయడంతోపాటు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, బీఎస్పీ, కాంగ్రెస్ నేతలు కళాశాల ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ.. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా విద్యార్థులపై కఠినంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థిని ఆత్మహత్యకు కారకులైన కళాశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నేతలను పోలీసులు అరెస్టు చేసి ఉప్పల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకట్ రాములు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అన్వర్, కాంగ్రెస్ పార్టీ పీర్జాదీగూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి, బీఆర్ఎస్వీ నేత వర్కాల శివకిషోర్ గౌడ్, రాకేష్, బీఎస్పీ నాయకులు అంబేద్కర్, ఎంఆర్పీఎస్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ పంగ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షల షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 22 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 28వ తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

అందుకనుగుణంగా ఆరు పేపర్లతో ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. డీఈవోలు, ఆర్జేడీలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 22న ఫస్ట్ లాంగ్వేజ్, 23న సెకండ్ లాంగ్వేజ్, 24న ఇంగ్లీష్, 25న మ్యాథమెటిక్స్, 27న ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు సైన్స్, 11.20 నుంచి 12.50 గంటల వరకు బయలాజికల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్ పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. వచ్చేనెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు ఆయా పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నాపత్రాలపై సమీక్ష, విద్యార్థులతో చర్చ ఉంటుందని తెలిపారు.

పరీక్షలు నిర్వహించే ప్రతిరోజూ సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకు మరుసటి రోజు సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు సన్నద్ధం కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందిస్తున్న సంగతి విదితమే. రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఏప్రిల్ మూడు నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు.

15 నుంచి టెన్త్ పరీక్షలపై టీశాట్ అవగాహన

పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడురోజులపాటు టీశాట్ అవగాహన కార్యక్రమాలను ప్రసారం చేయనుంది. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి సోమవారం మార్గదర్శకాలను విడుదల చేశారు. డీఈవోలు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు, మండలం, క్లస్టర్ నోడల్ అధికారులు, ఎఫ్ఏసీ హెడ్మాస్టర్లు, పదో తరగతి సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు చూడాలని ఆదేశించారు.

గిరిజన వర్సిటీని వెంటనే ప్రారంభించాలి

- ప్రధాని మోడీకి పోస్టుకార్డుల ఉద్యమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పది శాతం గిరిజన రిజర్వేషన్లు అమలు చేయాలనీ, గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలనీ డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పోస్టు కార్డులను పంపే ఉద్యమాన్ని బీఆర్ఎస్ గిరిజన విద్యార్థి విభాగం చేపట్టింది. సోమవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆ సంఘం నాయకులు దాడి శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి కేటీఆర్ చేనేత కార్మికుల సమస్యలపై ప్రారంభించిన పోస్టు కార్డు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని దీన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై

హత్య కేసు నమోదు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యార్థుల ప్రాణాలను తీస్తున్న శ్రీచైతన్య యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ విద్యార్థికి అండగా నిలబడిన ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి ఆత్మహత్యకు కారకులైన యాజమాన్యంపై హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. లాభాలు తప్ప విద్యార్థుల సంక్షేమం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ, అవి శ్రీచైతన్య చేస్తున్న హత్యలేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా ఆ యాజమాన్యంపై హత్యకేసు, క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను విడుదల చేయాలని తెలిపారు. ఈ ఘటనకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలనీ, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

విచారణ జరపాలి : పీడీఎస్‌యూ

శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి ఆత్మహత్య ఘటనపై విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం, ప్రధాన కార్యదర్శి ఇడంపాక విజయ్‌కన్నా డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని కార్పొరేట్ కాలేజీల గుర్తింపును రద్దు చేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని తెలిపారు.

శ్రీచైతన్యను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి : పీడీఎస్‌యూ

శ్రీచైతన్య విద్యాసంస్థలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన ఆ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఆ విద్యాసంస్థ ఎలాంటి నిబంధనలు పాటించకున్నా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

బండ ప్రకాశ్‌కు కోలేటి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్‌కు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మండలిలో బండ ప్రకాశ్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన నిబద్ధత గల నాయకుడని పేర్కొన్నారు. మండలిలో జరిగే చర్చలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

15,16 తేదీల్లో ఎల్బీ స్టేడియంలో వాలీబాల్ పోటీలు

- కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహణ
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని భారత జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 15,16 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కేసీఆర్ కప్-2023 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం ఆవిష్కరించారు. మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలతోపాటు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను కూడా ఇవ్వనున్నట్టు ఆమె ప్రకటించారు. కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని దళిత, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించనున్న దళిత క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను కూడా ఆమె విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భారత జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారంలోకి వస్తే పాత పెన్షన్ పథకం పునరుద్ధరిస్తాం

త్రిపుర ఎన్నికల ర్యాలీలో ప్రకాశ్ కరత్




అగర్తలా : త్రిపురలో అధికారంలోకి వస్తే పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వం తీసుకోబోయే మొదటి నిర్ణయంగా వుంటుందని సీపీఐ(ఎం) సీనియర్ నేత ప్రకాశ్ కరత్ చెప్పారు. పశ్చిమ త్రిపుర జిల్లాలోని ఖాయెర్‌పూర్‌లో ఎన్నికల ర్యాలీలో ఆదివారం కరత్ ప్రసంగించారు. రాష్ట్రంలో వామపక్ష సంఘటన ప్రభుత్వం అధికారంలో వున్నంతవరకు కొత్త పెన్షన్ పథకం అమలు కాలేదని గుర్తు చేశారు. 2018లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొత్త పెన్షన్‌ను అమలు చేసిందని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందనీ, అక్కడ పాత పెన్షన్ పథకాన్ని తిరిగి పునరుద్ధరించారని గుర్తు చేశారు. త్రిపురలో కూడా వామపక్షాలు అధికారంలోకి వస్తే అదే జరుగుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దిగజారిందని, 2020 జనవరి నుంచి 2022 డిసెంబరు మధ్య కాలంలో 707 లైంగికదాడి కేసులు నమోదయ్యాయని కరత్ పేర్కొన్నారు. మహిళలపై నేరాలు పెరగడంతో రాష్ట్రానికి చెడ్డపేరు వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవటానికి బీజేపీ పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తోందని కరత్ విమర్శించారు. బీజేపీ వ్యవహరిస్తున్న ఈ తీరు పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు గానూ బీజేపీ కుట్రలను భగ్నం చేయాలన్నారు. త్రిపుర వంటి చిన్న రాష్ట్రంలో ప్రతిపక్షాలు విజయం సాధిస్తే, జాతీయవ్యాప్తంగా దాని ప్రభావం, పర్యవసానాలు వుంటాయన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా జరిగే ఉద్యమాలు ఊపందుకునేందుకు ఈ రాష్ట్రంలో వామపక్షాల విజయం దోహదం చేస్తుందని తెలిపారు.

దేశంలో పలుచోట్ల భూకంపాలు

పరుగులు తీసిన జనం



న్యూఢిల్లీ : దేశంలోని పలుచోట్ల సోమవార భూకంపాలు సంభవించాయి. దేశ రాజధాని ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, ఘజియాబాద్, పంజాబ్, గురుగ్రామ్, నోయిడాల్లో ఈ భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైనట్టు జాతీయ భూకంప అధ్యయన కేంద్రం వెల్లడించింది. అయితే, ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు. ఢిల్లీ వాసులు భూకంపం కారణంగా తమకు ఎదురైన అనుభవాలను ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా నెటిజెన్స్‌తో షేర్ చేసుకుంటున్నారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో 4.3 తీవ్రతతో భూకంపం

ఆఫ్ఘనిస్తాన్‌లో నెల రోజుల వ్యవధిలోనే మరోసారి భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత 4.3గా నమోదైనట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించింది. 'సోమవారం ఉదయం 6.47గంటల సమయంలో ఫైజాబాద్‌కు దక్షిణ- ఆగ్నేయంగా 4.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం పొడవు 71. 40, 135 కి.మీ లోతులో ఫజియాబాద్‌కి 100 కిలోమీటర్ల దూరంలో సంభవించింది' అని ఎన్‌సీఎస్ తన అధికారిక ట్విటర్‌లో ఈ మేరకు పోస్టు చేసింది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే మరోసారి భూకంపం సంభవించినట్టు ఎన్‌సీఎస్ పేర్కొంది. గత నెలలో జనవరి 22వ తేదీన ఫైజాబాద్‌కు 79 కిలో సమీపంలో 4.2 తీవ్రతతో భూకంపం సంభవించింది.

35వేలు దాటిన టర్కీ, సిరియా భూకంప మృతులు

ఇస్తాంబుల్ : గత సోమవారం టర్కీ, సిరియాల్లో సంభవించిన పెను భూకంపంలో మృతుల సంఖ్య ఇప్పటికే 35వేలు దాటిందని అధికారులు, వైద్య బృందాలు తెలిపాయి. ప్రకృతి విపత్తు సంభవించి వారం రోజులు గడిచినందున ఇక శిథిలాల్లో చిక్కిన వారు జీవించి వుండే అవకాశాలు మృగ్యమవుతాయని గాలింపు, సహాయక బృందాలు తెలిపాయి. అందువల్ల తమ కార్యకలాపాలను ముగించాలని భావిస్తున్నాయి. టర్కీలో ఇప్పటివరకు 31,643మంది మరణించగా, సిరియాలో 3,581మంది చనిపోయారు. దీంతో మొత్తంగా మృతుల సంఖ్య 35,224కి చేరింది. భూకంప కేంద్రం భూమిలో 18 కిలోమీటర్ల లోతున వుందని అమెరికా భౌగోళిక సర్వే తెలిపింది. పైగా గాజియన్‌తాపెకి 33కిలోమీటర్ల దూరంలో ఈ భూకంపం కేంద్రం వుంది. ఈ ప్రాంతంలో పెళుసైన కాంక్రీటుతో కట్టిన భవనాలు ఎక్కువ. దీనివల్ల త్వరగా పగుళ్లు రావడానికి లేదా కూలిపోవడానికి, లేదా ఉక్కు తుప్పు పట్టడానికి అవకాశాలు వుంటాయని అమెరికా భౌగోళిక సర్వే (యుఎస్‌జిఎస్) తెలిపింది. ఈ కారణంగానే భూకంపంలో నష్టం కూడా ఎక్కువగా వుంది. టర్కీ సహజంగానే భూకంపాలు తరచుగా వచ్చే ప్రాంతం, 2020లో వచ్చిన భూకంపంలో 33వేల మంది చనిపోయారు.

ప్రభాకరన్ సజీవంగానే..?

- త్వరలో బయటకు వస్తారు' : పాళ నెదుమారన్
- ఇది 'జోక్' : శ్రీలంక

కొలంబో: ఎల్‌టీటీఈ అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్ బతికే ఉన్నారంటూ ఓ తమిళ జాతీయోద్యమ నేత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. 'ప్రభాకరన్ సజీవంగా, ఆరోగ్యంగా ఉన్నారు. త్వరలో బయటకు వస్తారు' అని తమిళ నేత పాళ నెదుమారన్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే శ్రీలంక రక్షణశాఖ దీన్నొక 'జోక్'గా అభివర్ణించింది. 'ప్రభాకరన్ 2009 మే నెలలో హతమైనట్టు నిర్ధారితమైంది. డీఎన్ఏ పరీక్షతోనూ అతని మరణాన్ని ధ్రువీకరించాం' అని శ్రీలంక రక్షణశాఖ ప్రతినిధి కర్నల్ నలిన్ హెరాత్ ఓ వార్తాసంస్థకు తెలిపారు.

పేదలకు ఇండ్ల స్థలాలపై మంత్రివర్గ ఉపసంఘం భేటి..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీపై చర్చించేందుకోసం మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉపసంఘం సోమవారం భేటీ అయింది. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి ఉపసంఘంలోని సభ్యులైన మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, శ్రీనివాసగౌడ్, మల్లారెడ్డి హాజరయ్యారు. పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. గ్రామ కంఠాలు సహా వివిధ ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకుని నివసిస్తోన్న పేదలకు వీలైనంత త్వరగా పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉపసంఘం ఆదేశించినట్టు తెలిసింది. గ్రామ కంఠంలోని స్థలాలకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన కసరత్తు.. 58, 59 ఉత్తర్వులకు లోబడి క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం, ప్రస్తుత స్థితి, సంబంధిత అంశాలపై మంత్రులు ఈ సందర్భంగా సమీక్షించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రస్తుత స్థితికి సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేయాలంటూ అధికారులను కమిటీ కోరినట్టు సమాచారం. సోమవారం మరోసారి సమావేశమై స్థలాల సంబంధిత అంశాలు, సమస్యల పరిష్కారంపై కమిటీ చర్చిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భేటీ అనంతరం మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాసగౌడ్... బీఆర్‌కే భవన్ నుంచి నూతన సచివాలయం, అమరవీరుల స్మారక భవనం పనులను పరిశీలించారు.

బిజినెస్

రిటైల్ ద్రవ్యోల్బణం సెగ



- 6.52 శాతానికి ఎగిసిన సీపీఐ

న్యూఢిల్లీ : ధరల కట్టడికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఓ వైపున వడ్డీ రేట్లు పెంచుతుండగా.. మరోవైపు ద్రవ్యోల్బణం ఎగిసిపడుతోంది. కొత్త ఏడాది జనవరిలో భారత రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) 6.52 శాతానికి ఎగిసి.. మూడు నెలల గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యిందని సోమవారం గణంకాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇంతక్రితం డిసెంబర్‌లో ఈ సూచీ 5.72 శాతంగా చోటు చేసుకుంది. సీపీఐ పెరగడం ద్వారా కుటుంబాల పొదుపు పడిపోవడంతో పాటుగా వినిమయం కూడా తగ్గనుంది. ఇది మరింత ఆర్థిక మందగమనం వైపు దారి తీయనుంది. గడిచిన జనవరిలో గ్రామీణ ప్రాంతాల్లో సీపీఐ 6.85 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం డిసెంబర్‌లో ఇది 6 శాతంగా ఉంది. ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 4.19 శాతం నుంచి 5.94 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్బీఐ వరుసగా ఆరో సారి వడ్డీ రేట్లను పెంచి రెపోరేటును 6.5 శాతానికి చేర్చింది.

డార్క్ చాక్లెట్ల ఉత్పత్తిలోకి మార్స్ రెగ్లీ

న్యూఢిల్లీ : కన్‌ఫెక్షనరీ తయారీలో ఉన్న మార్స్ రిగ్లీ ఇండియా కొత్తగా గెలాక్సీ ఫ్యూజన్స్ పేరుతో డార్క్ చాక్లెట్ల విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఐకానిక్ గ్లోబల్ చాక్లెట్ బ్రాండ్‌ల స్థానిక ఉత్పత్తిని విస్తరిస్తున్నట్టు పేర్కొంది. ఈ కంపెనీ దేశంలో చాక్లెట్‌లు, చూయింగ్ గమ్, పుదీనా, స్నాక్స్ తయారీలో ఉంది. దేశంలో 70 శాతం కోకోతో గెలాక్సీ ఫ్యూజన్స్ డార్క్ చాక్లెట్ల విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. వీటిని స్థానికంగా ఉత్పత్తి చేస్తున్నామని వెల్లడించింది. ఇవి అన్ని ఈ-కామర్స్ పోర్టల్‌లలో రూ.90 నుంచి లభిస్తాయని తెలిపింది.

సిఏ ఫౌండేషన్‌లో అకాడమీ విద్యార్థుల అర్హత

హైదరాబాద్ : ఆన్‌లైన్ ఎడ్‌టెక్ పోర్టల్ అకాడమీకి చెందిన 1250 మందికి పైగా విద్యార్థులు సిఏ ఫౌండేషన్-2022 పరీక్షలో అర్హత సాధించారని ఆ సంస్థ తెలిపింది. 128 పైగా తమ విద్యార్థులు 300 మార్కులు సాధించారని పేర్కొంది. ముగ్గురు 350 పైగా స్కోర్ చేశారని పేర్కొంది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో తమ విద్యార్థులు గణితం, అకౌంట్స్, ఎకనామిక్స్, న్యాయశాస్త్రములో అసాధారణమైన మార్కులు సాధించారని తెలిపింది.

ఆఫ్‌లైన్‌లోనూ డిజిటల్ చెల్లింపులు

- హెచ్‌డిఎఫ్‌సి పైలెట్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఇంటర్నెట్ లేనప్పటికీ ఆఫ్‌లైన్‌లో డిజిటల్ చెల్లింపులు చేసేలా సేవలను ప్రారంభించింది. ప్రయోగాత్మకంగా ఈ సేవలను ప్రారంభించినట్లు ఆ బ్యాంక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆర్‌బిఐ రెగ్యూలేటరీ అనుమతులతో నాలుగు నెలల పాటు దశల వారిగా రూ.200 పరిమితి చెల్లింపులతో ఆఫ్‌లైన్ డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఆఫ్‌లైన్ పే పేరుతో ఈ సేవలను ప్రారంభించినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడించింది. ఈ సేవలపై స్పష్టత రావాల్సి ఉంది.

లాభాల్లో బీఓఎం టాప్



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో అధిక లాభాల వృద్ధిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) అగ్రస్థానంలో ఉంది. 2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 12 పీఎస్బీలు సంయుక్తంగా 65 శాతం వృద్ధితో రూ.29,175 కోట్ల నికర లాభాలు సాధించాయి. కాగా.. బీఓఎం ఏకంగా 139 శాతం వృద్ధితో రూ.775 కోట్ల నికర లాభాలు సాధించినట్లు ఆ బ్యాంక్ తెలిపింది. బీఓఎం తర్వాత స్థానంలో యూకో బ్యాంక్ 110 శాతం వృద్ధితో రూ.653 కోట్ల లాభాలు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107 శాతం, ఇండియన్ బ్యాంక్ 102 శాతం చొప్పున పెరుగుదలను సాధించాయి. బీఓఎం స్థూల ఎన్పీఏలు 2.94 శాతానికి తగ్గాయి.

ప్రకటనలు ఘనం.. అమలు శూన్యం

- ఎన్నికల సమయాల్లో మోడీ సర్కారు భారీ హామీలు
- ఎన్డీయే-1 నుంచి ఎన్డీయే-2 వరకు ఇదే తీరు
- నెరవేరని పక్కా ఇండ్లు.. ప్రతి ఇంటికీ విద్యుత్.. రైతుల ఆదాయం రెట్టింపు వాగ్దానాలు
- ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ.. స్మార్ట్ సిటీ.. బుల్లెట్ ట్రైన్‌లదీ అదే దారి
- ముగిసిన 2022 డెడ్‌లైన్.. కొత్తగా '2047' ముందుకు
- కేంద్రం తీరుపై ప్రజలు, రైతుల ఆగ్రహం

కేంద్రంలోని మోడీ సర్కారు చేసే హామీల ప్రకటనలు.. వాటి అమలుకు తీసుకుంటున్న చర్యలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. 2014లో తొలిసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మోడీ సర్కారు..2019లో రెండోసారీ అధికారాన్ని చేపట్టిన తర్వాత.. పలు వాగ్దానాల అమలుకు 2022ను డెడ్‌లైన్‌గా విధించింది. పక్కా ఇండ్లు, ఇంటింటికీ విద్యుత్ కనెక్షన్, రైతుల ఆదాయం రెట్టింపు, స్మార్ట్ సిటీల ఏర్పాటు, బుల్లెట్ ట్రైన్‌లను తీసుకురావడం, దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడం, అంతరిక్షానికి మానవ సహిత ఉపగ్రహాన్ని పంపడం వంటివి మోడీ సర్కారు చేసిన మేజర్ హామీలు. అయితే, ఇప్పటికీ ఈ హామీలేవీ నెరవేరకపోగా.. కొత్తగా '2047 ఏడాది' రాగాన్ని మోడీ సర్కారు తీస్తున్నది.

న్యూఢిల్లీ : అమలుకు సాధ్యం కాని భారీ హామీలతో కేంద్రంలో మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను వంచిస్తున్నది. పలు సందర్భాలలో భారీ వాగ్దానాలను ప్రకటించి.. అందుకు నిర్ధీత గడువునూ విధించుకొని.. అమలులో మాత్రం పూర్తిగా విఫలమైంది. దేశం 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోబోయే సందర్భంగా ఈ హామీలను పూర్తి చేస్తామని అనేక వేదికలలో మోడీ చెప్పారు. ఇప్పుడు ఆ గడువు కూడా ముగిసింది. దీంతో చేసేదేమీ లేక మోడీ సర్కారు మౌనం వహించింది. మోడీ సర్కారు ప్రకటించిన అమలు చేయని వాటిలో పలు కీలక వాగ్దానాలు ఉన్నాయి.



ప్రతి ఇంటికీ 24 గంటల విద్యుత్

2022 నాటికి దేశంలోని ప్రతి ఇంటికీ 24 గంటల విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తామని 2015 సెప్టెంబర్‌లో మోడీ ప్రకటించారు. మోడీ విధించుకున్న గడువు కూడా ముగిసింది. భారత్‌లోని అనేక ఇండ్లు ఇప్పటికీ విద్యుత్‌కు నోచుకోక ఇక్కట్లను ఎదుర్కొంటున్నాయి. దేశంలోని అనేక గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం అందకపోవడం గమనార్హం.




రైతుల ఆదాయం రెట్టింపు

దేశంలోని అన్నదాతల్లో ఆశలు చిగురింపజేసిన హామీ రైతు ఆదాయాలను రెట్టింపు చేస్తామని హామీ ఇవ్వడం. 2022 నాటికి రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని 2017 నుంచి మోడీ అనేక సందర్భాలలో ఈ వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. 2021కు వరకు ప్రతి బడ్జెట్‌లోనూ కేంద్రం ఈ హామీని పునరుద్ఘాటించింది. అయితే, కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద సాగు చట్టాలకు రైతన్నల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి ఈ హామీ గురించి మోడీ మాట్లడటం ఆపేశారు. 2022 ముగిసినా.. ఇప్పటికీ దేశంలోని రైతుల ఆదాయం రెట్టింపు కాకపోవడం గమనార్హం. అదీ చాలక 2023-24 బడ్జెట్‌లో మోడీ సర్కారు వ్యవసాయానికి బడ్జెట్‌లో కోతలు విధించింది.

ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

2022 నాటికి భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల (దాదాపు రూ. 4.12 కోట్ల కోట్లు)ఆర్థిక వ్యవస్థగా మారుతుందని 2018 సెప్టెంబర్‌లో ప్రధాని ప్రకటించారు. 2018 నుంచి అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాల్లో, ఎన్నికల




ర్యాలీలు, విదేశాల్లో సైతం మోడీ ఈ ప్రకటనను తరచుగా వినిపించారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు సైతం ఇవే మాటలను పెద్దగా వినిపించారు. గడువు ముగియడంతో ప్రధానితో పాటు మంత్రులు, బీజేపీ నాయకులు ఈ ప్రకటనపై ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. భారత ఆర్థిక వ్యవవస్థ ఇప్పటికి మూడు ట్రిలియన్ డాలర్ల వద్దే ఆగిపోవడం గమనార్హం.ఇటు అమెరికా పరిశోధక ఏజెన్సీ అదానీపై సంచలన రిపోర్టును ప్రకటించిన అనంతరం రెండు వారాల్లోనే భారత ఆర్థిక వ్యవస్థ ర్యాంకు ఐదు నుంచి ఆరుకు పడిపోయింది.

బుల్లెట్ ట్రైన్



బుల్లెట్ ట్రైన్ గురించి మోడీ సర్కారు, బీజేపీ నాయకులు గొప్ప ప్రచారాలు చేశారు. 2022 నాటికి భారత్‌లో బుల్లెట్ రైలు పరుగులు తీస్తుందని నాలుగేండ్ల క్రితం ప్రధాని చెప్పారు. గల్ఫ్ దేశం ఒమన్‌లోని ప్రవాస భారతీయుల సమక్షంలో ఈ డెడ్‌లైన్‌ను మోడీ ప్రకటించారు. అయితే ఆ హామీ కూడా నెరవేరలేదు. కేవలం మహారాష్ట్రలో బీజేపీ మద్దతుతో నడుస్తున్న ఏక్‌నాథ్ శిండే ప్రభుత్వం మాత్రమే భూసేకరణ కోసం పనులు చేవడంతుండటం గమనార్హం.



అంతరిక్షంలోకి మానవ సహిత ఉపగ్రహం

అంతరిక్షంలోకి తమ సొంత వాహకనౌకలో ఒక భారతీయుడు 2022 నాటికి వెళ్తాడని మోడీ హామీ ఇచ్చారు. ఈ లక్ష్యం నెరవేరితే మానవ సహిత ఉపగ్రహాన్ని పంపిన నాలుగో దేశంగా భారత్ నిలిచేది. కానీ, 2022 ముగిసినా కూడా మోడీ ప్రకటించిన హామీ కార్యరూపం దాల్చకపోవడంతో భారత్‌కు ఆ ఘనత సాధించే అవకాశం కలగానే మిగిలిపోయిందని విశ్లేషకులు అన్నారు. ప్రస్తుతం ఈ హామీని మోడీ కూడా మర్చిపోయి ఉండొచ్చని తెలిపారు.

స్మార్ట్ సిటీ



ఇతర పథకాలు, ప్రకటనలను పక్కనబెడితే మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం స్మార్ట్ సిటీ పథకం. 2015లో దీనిని తీసుకొచ్చింది. స్మార్ట్ సిటీ పథకం కింద వంద నగరాలను ఎంపిక చేసి పలు వసతుల కల్పన కోసం 2022ను గడువు తేదీగా మోడీ సర్కారు విధించింది. అయితే, ఈ గడువు ముగిసినా.. దేశంలో ఒక్క స్మార్ట్ సిటీని కూడా తయారు చేయలేకపోవడం మోడీ సర్కారుకే చెల్లిందని నిపుణులు, విశ్లేషకులు అన్నారు. ఈ ప్రకటనలు, పథకాల అమలుకు 2022 ను గడువుగా నిర్ణయించుకున్న మోడీ సర్కారు.. వాటిని పూర్తి చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమైంది. ఇప్పుడు భారత్ 100 ఏండ్ల స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోబోయే ఏడాది అంటూ 2047 ఏడాదిని ప్రధాని మోడీ ముందుకు తీసుకొచ్చారు. రెండు దఫాలుగా దేశాన్ని పాలించి ఇచ్చిన కీలక హామీలలో ఏ ఒక్కదానిని కూడా నెరవేర్చని ఎన్డీయే ప్రభుత్వాలు.. కొత్త టార్గెట్‌తో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నాయని రాజకీయ





పక్కా గృహాలు

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానిగా మోడీ చేసిన అతిపెద్ద ప్రకటనల్లో ఒకటి దేశంలోని ప్రతి ఒక్క కుటుంబానికీ పక్కా గృహాన్ని కట్టించటం. 2022లో భారత్ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకోబోయే సందర్భంలో ప్రతి ఒక్కరికీ ఈ ఇండ్లు అందేలా చూస్తామని మోడీ హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం పక్కా గృహాలకు టాయ్‌లెట్లు, విద్యుత్, నీటి వసతులు వంటివీ కల్పిస్తామని తెలిపారు. ఎర్రకోటపై ఇచ్చే ప్రసంగంతో పాటు 2021లో దేశంలో జరిగిన పలు ఎన్నికల ర్యాలీలో ఇదే ప్రస్తావనను మోడీ తీసుకొచ్చారు. అయితే, 2022 గడిచిపోయింది.

కోట్లాది కుటుంబాలు ఇప్పటికీ ఇండ్లు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. పలుకుటుంబాలు మురికి ప్రాంతాల్లో నివసిస్తున్నాయి. గడవు ముగిసిపోవడంతో ఇప్పుడు మోడీ నోటి నుంచి ఈ ప్రకటనకు సంబంధించిన మాట కానీ లేదా కొత్త గడువు కానీ రాకపోవడం గమనార్హం.


ప్రతి కేసులో శిక్షలు పడేలా చూడాలి

- దర్యాప్తు అధికారులకు సీఐడీ డీజీ సూచన

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి : తాము జరిపే కేసుల దర్యాప్తుల్లో నిందితులకు కచ్చితంగా శిక్షలు పడేలా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని దర్యాప్తు అధికారులకు సీఐడీ డీజీ మహేశ్ భగవత్ సూచించారు. సీఐడీ విభాగం అధిపతిగా బాధ్యతలు స్వీకరించాక తమ శాఖలో జరుగుతున్న వివిధ కేసుల దర్యాప్తుల తీరు తెన్నులపై ఆయన సమీక్షలు నిర్వహిస్తున్నారు. సీఐడీ శాఖకు పోలీసు శాఖలో క్లిష్టతరమైన కేసుల దర్యాప్తులో ఆరితేరిన విభాగంగా పేరున్నదనీ, ఆ ప్రతిష్ఠను దిగజారనివ్వరాదని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా, ప్రభుత్వం వైపు నుంచి కూడా పలు కేసులు దర్యాప్తు నిమిత్తం సిఫారసు చేయబడతాయనీ, దాని అర్థం సీఐడీ విభాగం ఆ కేసులలో నిగ్గు తేలుస్తుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో సీఐడీ విభాగంలోని వివిధ దర్యాప్తు అధికారుల పరిశీలనలో ఉన్న కేసులలో ఎన్ని కేసులు దర్యాప్తు పూర్తయ్యాయి? ఎన్ని కేసులలో కోర్టులలో చార్జిషీట్లు దాఖలయ్యాయి? మరెన్ని కేసులలో న్యాయస్థానాలలో ట్రయల్ సాగుతుంది? తదితర అంశాలపై ఆయన దృష్టిని సారించారు. సీఐడీలో విచారణ సాగుతున్న దాదాపు అన్ని కేసులలో నిందితులకు శిక్షలు పడేలా చేయడానికి అవసరమైన సాక్షాలు, ఆధారాలు, సైంటిఫిక్ ఎవిడెన్సులను కచ్చితంగా సేకరించాలనీ ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

'కూలీ'పోతున్న బతుకులు

- మూడేండ్లలో 1.12 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు
- మొత్తం ఆత్మహత్యలు 4.56 లక్షలకు పైనే..!
- పార్లమెంటులో కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ : మోడీ పాలనలో కార్మికుల జీవితాలకు భద్రత కరువైంది. రెక్కాడితే గానీ డొక్కాడని దినసరి కూలీల బతుకులు అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. నూరేండ్ల ఆయుష్షు నిండకుండానే బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు తీవ్రమవుతున్నాయి. దేశంలో రోజువారీ కూలీల బలవన్మరణాలపై కేంద్రం పార్లమెంటులో వెల్లడించిన సమాచారం దీనిని తెలియజేస్తున్నది. కాంగ్రెస్ ఎంపీ తిరునవుక్కరసర్ అడిగిన ప్రశ్నకు సమాధానం కేంద్ర కార్మిక మంత్రి భూపెందర్ యాదవ్ సమాచారాన్ని తెలిపారు. దీని ప్రకారం.. 2019-21 మధ్య మూడేండ్లలో మొత్తం 1.12 లక్షల మందికి పైగా రోజువారీ కూలీలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2019లో 32,563 మంది, 2020 లో 37,666 మంది, 2021లో 42,004 మంది ఆత్మహత్య చేసుకొన్నారు. 2020, 2021 ఏడాదుల్లో కరోనా మహమ్మారి విజృంభించడం, మోడీ సర్కారు విధించిన లాక్‌డౌన్ వంటి పరిస్థితులు కార్మికులు, కూలీలకు నరకయాతనను చూపించిన విషయం తెలిసిందే. 2020 లో రైల్వే ట్రాకులపై 8,700 మందికి పైగా వ్యక్తులు చనిపోయారు. వీరిలో అధికం వలస కార్మికులే కావడం గమనార్హం. కాగా, ఈ మూడేండ్లలో దేశంలో మొత్తం 4.56 లక్షల మంది (రోజువారీ కూలీలతో కలుపుకొని) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో గృహిణిలు 66,912 మంది, సొంతంగా వ్యాపారాన్ని చేసుకునే వారు 53,661 మంది, ఉద్యోగులు 43,420 మంది, నిరుద్యోగులు 39,950 మంది, వ్యవసాయ రంగం మరియు వ్యవసాయ పనుల్లో ఉన్నవారు 31,839 మంది ఉన్నారు.

మార్చి 13కి పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా

ముగిసిన మొదటి విడత సమావేశాలు...



న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ మొదటి విడత సమావేశాలు ముగిశాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మార్చి 13కి వాయిదా పడ్డాయి. మార్చి 13 నుంచి రెండో విడత బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మొదలైనప్పటి నుంచి అదానీ అంశంపై చర్చ జరపాలంటూ ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో అదానీ గ్రూపు మోసాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయడంతో పాటు కాంగ్రెస్ ఎంపీ రజనీ పాటిల్ సస్పెన్షన్ ను ఎత్తివేయాలంటూ ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. ఈ నేపథ్యంలో సభను మార్చి 13 వరకు వాయిదా వేస్తున్నట్టు రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ ప్రకటించారు. సోమవారం రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష ఎంపీల నిరసనలు కొనసాగాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు చైర్మెన్ అనుమతి ఇవ్వాలంటూ ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టడంతో చైర్మెన్ అందుకు అంగీకరించారు. దీన్ని వ్యతిరేకిస్తూ అధికార పార్టీ సభ్యులు కూడా నినాదాలు చేయడం మొదలుపెట్టారు. దీంతో ఖర్గే చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు చైర్మెన్ వెల్లడించారు. ఇలా అధికార, ప్రతిపక్ష ఎంపీల నినాదాలు చేయడంతోపాటు పలువురు ఎంపీలు పోడియం వద్ద ఆందోళన చేపట్టారు. ఇలా సభ్యుల ఆందోళనల నడుమ సభను వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ ప్రకటించారు. అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, రాజ్యసభ నేత పీయూశ్ గోయల్ మీడియాతో మాట్లాడారు. సభా కార్యకలాపాలను అడ్డుకున్నందుకు ప్రతిపక్ష నేతలు ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రతిపక్ష నేతలు కౌంటర్ ఇచ్చారు. తాము సభ సజావుగా నడవాలని కోరుతున్నామని, అదానీ అంశంపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అయితే ప్రభుత్వం అందుకు సిద్ధపడటం లేదని, పారిపోతోందని విమర్శించారు.

రెండు విడతలుగా...

షెడ్యూల్ ప్రకారం బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా (జనవరి 31 నుంచి ఏప్రిల్ 6 వరకు) జరగనున్నాయి. తొలి విడతలో భాగంగా జనవరి 31న మొదలైన ఈ సమావేశాలు సోమవారం (ఫిబ్రవరి 13) వరకు కొనసాగాయి. మొదట పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించారు. అదే రోజు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైన, బడ్జెట్ పైన చర్చ జరిగింది. అయితే, కొంత విరామం తరువాత రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 13న తిరిగి ప్రారంభమవుతాయి.

త్రిపురలో గూండాగిరి..

(మొదటిపేజీ తరువాయి)

కలుసుకుంది. త్రిపుర ఓటర్లలో అత్యధిక మంది స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి లేదని వారు ఈసీకి తెలిపారు. ఇటీవల త్రిపురకు పెద్ద సంఖ్యలో మోటార్ సైకిళు దిగుమతి అయ్యాయని, వీటిపై అధికార బీజేపీకి చెందిన గూండాలు ప్రయాణిస్తూ గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. వామపక్షాలకు బలమున్న ప్రాంత్రాల్లో, గ్రామాల్లో పర్యటిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఈసీకి విన్నవించారు. "ఓటర్లను ప్రలోభపెట్టడానికి, బెదిరించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో గ్యాంగులుగా ఏర్పడ్డ కొంతమంది బీజేపీ కోసం పనిచేస్తున్నారు. ప్రతిపక్షాల వైపు ఉంటారనే వారిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిని వెంటనే ఆపాలి. పెద్ద పెద్ద రోడ్లపైన్నే కాదు, అంతర్గత రోడ్లపైనా మోటార్ సైకిళ్ల ర్యాలీలపై నియంత్రణలు విధించాలి. ఓటర్లలో విశ్వాసాన్ని నింపాల్సిన బాధ్యత ఈసీపై ఉంది" అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతినిధుల బృందం కోరింది. త్రిపుర ఎన్నికలపై తమ దృష్టికి తీసుకొచ్చిన విషయాలపై విచారణ జరుపుతామని, స్వేచ్ఛగా, శాంతియుతంగా ఎన్నికలు జరిగేట్టు చర్యలు చేపడతామని కేంద్ర ఎన్నికల సంఘం సీపీఐ(ఎం) బృందానికి హామీ ఇచ్చింది.

రేపు సీఎం కొండగట్టు పర్యటన



(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ సమావేశమవుతారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. వాస్తవానికి సీఎం మంగళవారమే కొండగట్టుకు వెళ్లాల్సి ఉన్నా.. మంగళవారం కొండగట్టుకు హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి కలిగించొద్దనే ఉద్దేశంతో బుధవారానికి ఆయన తన పర్యటనను వాయిదా వేసుకున్నారని సీఎంవో వర్గాలు తెలిపాయి.

'నాక్' గుర్తింపులేనివి 695 వర్సిటీలు..34వేల కాలేజీలు

- 'నాక్' పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం : కేంద్రం

న్యూఢిల్లీ : దేశంలో 695 యూనివర్సిటీలకు, 34వేల కాలేజీలకు 'నాక్' (నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడేషన్ కౌన్సిల్) గుర్తింపులేదని లోక్‌సభలో కేంద్రం వెల్లడించింది. వర్సిటీలు, కాలేజీల్లో బోధన, ఇతర సౌకర్యాలను మదింపు చేసిన తర్వాత 'నాక్' గ్రేడింగ్ (నాణ్యతా స్థాయి) ఇస్తుంది. మెరుగైన గ్రేడింగ్ అందుకున్న కాలేజీల వివరాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచుతుంది. ఏ కాలేజీలో చేరాలి? ఏది మెరుగైంది? అన్నది విద్యార్థులకు సులభంగా తెలుసుకోవడానికి యూజీసీ 'నాక్' విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే వందలాది వర్సిటీలు, వేలాది కాలేజీలకు 'నాక్' గుర్తింపు దక్కకపోవటం ప్రభుత్వాలు ఆలోచించాల్సిన విషయం. "యూజీసీ నుంచి తీసుకున్న సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా మొత్తం 1113 యూనివర్సిటీలు, 43796 కాలేజీలున్నాయి. ఇందులో 418 వర్సిటీలకు, 9062 కాలేజీలకు మాత్రమే 'నాక్' గుర్తింపు దక్కింది" అని ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర సహాయమంత్రి సుభాష్ సర్కార్ వెల్లడించారు.

వర్సిటీలు, విద్యాసంస్థలన్నింటినీ 'నాక్' పరిధిలోకి తీసుకొచ్చేందుకు అనేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 'నాక్' అక్రిడేషన్, ఇతర గుర్తింపు పొందేందుకు నిర్దేశించిన ఫీజును తగ్గించామని, నమోదు ప్రక్రియను సరళతరం చేశామని అన్నారు. అనుబంధ కాలేజీల స్వీయ అధ్యయన నివేదికలను కూడా చాలా వరకు తగ్గించినట్టు ఆయన చెప్పారు. కేంద్రం త్వరలో నూతన జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ)ని తీసుకురాబోతున్నది. దీంతో వర్సిటీలు, కాలేజీలన్నీ 'ఎన్ఈపీ' పరిధిలోకి రాబోతున్నాయి. అయితే 'ఎన్ఈపీ'పై విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యారంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకే ఈ కొత్త పాలసీని మోడీ సర్కార్ ఎంచుకుందని ఆరోపిస్తున్నాయి. దీనివల్ల అణగారిన వర్గాలు, పేదలకు వర్సిటీ విద్య అత్యంత ఖరీదుగా మారుతుందని విద్యావేత్తలు సైతం హెచ్చరిస్తున్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనానికి మళ్లీ టెండర్

- ఇంటర్ బోర్డు నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనానికి సంబంధించి మళ్లీ టెండర్‌ను ఆహ్వానించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ఆన్‌లైన్ మూల్యాంకనానికి సంబంధించిన టెండర్‌కు దరఖాస్తు చేసే ప్రక్రియ సోమవారంతో ముగిసిందని తెలిపారు. మూడు గంటలకు టెండర్ బిడ్‌లను ఓపెన్ చేశామని పేర్కొన్నారు. మాగ్నటిక్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మాత్రమే టెండర్‌లో పాల్గొన్నదని వివరించారు. సస్పెండైన జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి మధుసూదన్‌రెడ్డి ఆరోపణల ప్రకారం గ్లోబరీనా కొత్త అవతారం ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ టెండర్‌లో పాల్గొనలేదని తెలిపారు. దీంతో ఆయన చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని రుజువైందని పేర్కొన్నారు. ఒకే సంస్థ బిడ్ దాఖలు చేయడంతో కొత్తగా మళ్లీ ఆన్‌లైన్ మూల్యాంకనం కోసం టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇంటర్ వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీతోపాటు జవాబు పత్రాల రీవెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్ ప్రకారం ప్రస్తుత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షల్లో తొలుత లాంగ్వేజ్ సబ్జెక్టులకు 20 లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యూమానిటీస్) సబ్జెక్టులకు పది లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులకు ఐదు లక్షలు కలిపి మొత్తం 35 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు. సైన్స్ సబ్జెక్టులకు ఆఫ్‌లైన్ (పాత పద్ధతిలో) మూల్యాంకనం జరుగుతుంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో లాంగ్వేజ్ సబ్జెక్టులు ఏడు లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యూమానిటీస్) సబ్జెక్టులు 3.50 లక్షలు, ఒకేషనల్ 1.50 లక్షలు కలిపి మొత్తం 12 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేపడతారు.

మధుసూదన్‌రెడ్డి హర్షం

ఆన్‌లైన్ మూల్యాంకనం కోసం మళ్లీ టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని నిర్ణయించడం పట్ల ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్మికుల పాదయాత్రకు ఎస్‌డబ్ల్యూఎఫ్ మద్దతు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్‌తో పాటు మరో ఐదుగురు నాయకులు చేస్తున్న పాదయాత్రకు టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పాలకుర్తిలో జరిగిన సభలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాంచందర్ పాల్గొని మద్దతు తెలిపారు. వారి పాదయాత్రకు సంఘీభావంగా రూ.5వేల నగదును సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గ్రామ పంచాయతీ కార్మిక నాయకులు సీహెచ్ వెంకటయ్యలకు అందచేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న కృషి గొప్పదనీ, అలాంటి వారి సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు కూడా ఇలాంటి సమస్యలతోనే సతమతమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



పారిశుధ్య కార్మికుల జీతాలు అరకొర..

- పాదయాత్ర ముగియక ముందే చర్చలకు పిలువండి.. : గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్రలో పాలడుగు భాస్కర్
- సమస్యలు వివరించిన కార్మికులు



నవతెలంగాణ-దేవరుప్పుల

తెలంగాణలో గ్రామపంచాయతీ కార్మికులకు రూ.4000 వేతనం ఇవ్వడం సిగ్గుచేటని, అరకొర జీతాలతో కుటుంబాలను ఎలా నెట్టుకొస్తారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక వైపు పల్లె ప్రకృతి వనాల శుభ్రత.. మరోవైపు మోరీల సఫాయి, కుళ్ళిన కుక్కల శవాల తరలింపు లాంటి పనులన్నీ పంచాయతీ కార్మికుల వల్ల సాధ్యమేనా అని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర రెండవ రోజు సోమవారం దేవరుప్పుల మండలంలో కొనసాగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అధ్యక్షతన ముందుగా ధర్మపురం గ్రామంలో సాయుధ పోరాట యోధులు దుర్గ్యానాయక్‌ను కలిసి పోరాట స్ఫూర్తి విషయాలను తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని షేక్ బందగీ స్తూపానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో మనిషికి మనిషికి సంబంధం లేకుండా జీవించిన తరుణంలోనూ గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు చేసిన సేవలు, శ్రమ, మానవత్వంను కొనియాడారు. కరోనా సమయంలో చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతేడాది దుస్తులతో పాటు మాస్కులు, గ్లౌజులు, తోపుడు బండ్లు అందించాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి కారోబార్, బిల్ కలెక్టర్ ప్రత్యేక హోదా కల్పించాలని కోరారు. మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా, చిన్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు గడవడం కష్టంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేసి, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆరోగ్య బీమా కల్పించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళిత బంధు పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, పాదయాత్ర సాయంత్రం వరకు మండలంలోని సింగరాజుపల్లి వరకు చేరుకుంది. పాదయాత్రలో ఒక చోట పాలడుగు భాస్కర్ చెత్తను తీసుకెళ్లే రిక్షాను తొక్కారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తమ సమస్యలను పాద యాత్ర బృందానికి వివరించారు. పాదయాత్రలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తునికి మహేష్, వినోద్ కుమార్ జనగామ జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకన్న, మండల అధ్యక్షకార్యదర్శులు రామచందర్, గనగాని ఉప్పలయ్య, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించకపోవడంతో..
కలెక్టరేట్ పైకి ఎక్కి రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

దశాబ్ద కాలానికి పైగా అపరి ష్కృతంగా ఉన్న తమ భూ సమ స్యను పరిష్కరించడంలో అధికారులు నిర్ల క్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ సోమ వారం రైతు దంపతులు కలెక్టరేట్లో ఆత్మహత్యాయత్నం చేసు కున్నారు. ఇదే రైతు గతంలో కూడా కలెక్టరేట్లో ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలు స్తోంది. జనగామ జిల్లా మండలం పసరమట్ల గ్రామానికి చెందిన రైతు దంపతులు నిమ్మల నర్సింగరావు, రేవతి సోమవారం ప్రజావాణి కార్య క్రమం సందర్భంగా తమ సమస్యను వివరించుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. కాగా, ఎన్నో ఏండ్లుగా పరిష్కారం కాని తన భూసమస్యను అధికారులు పట్టించుకోవడం లేదన్న మనస్తాపంతో కలెక్టరేట్ పైకి ఎక్కి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దాంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అధికారులు, ప్రజలు ఆందోళనతో అటువైపు పరిగెత్తారు. తమ భూమిని స్థానిక తహసీల్దార్ ఇతరులకు అక్రమంగా పట్టా చేశారని బాధిత రైతు ఆరోపించారు. పోలీసులు, అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

పోడు రైతులను దురాక్రమణదారులనడం సిగ్గుచేటు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రంలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులను సీఎం కేసీఆర్ దురాక్రమణదారులు అనడం సిగ్గుచేటని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా సోమవారం ఆయన ఉట్నూర్‌కు వచ్చారు. ఐటీడీఏ నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అందుకు నిదర్శనమే ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయమని చెప్పారు. ఎన్నో దశాబ్దాల కాలంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను సీఎం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే నోరు కూడా మెదపడం లేదన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు, గిరిజనులు పడుతున్న బాధలను చూశానన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల చుట్టుపక్కల ఉన్న వేల కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ధరణి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రాన్ని మరోసారి దోచుకోవడానికే ధరణి అన్నారు. ధరణి వల్ల సాగుదారులు ఇబ్బందులు పడుతున్నా, సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను చూస్తుంటే ఏదో మ్యాచ్ ఫిక్సింగ్ లాగా ఉందన్నారు. కేవలం అంకెల గారడిని ప్రవేశపెట్టారన్నారు. ఏజెన్సీలో పోడుభూములు సాగు చేసుకుంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వకుండా సాగుదారులను దురాక్రమణదారులుగా పోల్చడం సరైంది కాదన్నారు. వెంటనే కేసీఆర్ ఆదివాసీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏండ్ల నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్న వారిపై దాడులు, దౌర్జన్యం చేసి జైల్లో పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు అభివృద్ధి సాధించాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

అదానీ కుంభకోణాలపై..
జేపీసీ వేయడానికి మోడీకి భయమెందుకు?
ఆర్‌బీఐ వద్ద ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ- సిటీబ్యూరో

అదానీ కుంభకోణాలపై జాయింట్ పార్ల మెంటరీ కమిటీ వేయడానికి ప్రధాని నరేంద్రమోడీకి భయమెందుకని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. జేపీసీలో అధికార బీజేపీకి సంబంధించిన పార్లమెంట్ సభ్యులు కూడా ఉంటారని, నరేంద్రమోడీ ఎలాంటి తప్పులూ చేయకుంటే ఆ కమిటీని వేయడానికి ఎందుకు వెను కాడుతున్నారని ప్రశ్నించారు. అదానీ కుంభకోణాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలని, తక్షణమే అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌బీఐ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. అదానీ ఆర్థిక సామ్రాజ్యం గాలిబుడగ లాంటిదని, అది అవినీతి పునాదులపై నిర్మించిన సామ్రాజ్యమని విమర్శించారు. హిండెన్ బెర్గ్ విడుదల చేసిన నివేదిక తర్వాత అదానీ అవినీతి సంపాదన గుట్టురట్టు అయిందన్నారు. నరేంద్రమోడీ కనుసన్నల్లోనే ఎల్ఐసీ నుంచి రూ.80 వేల కోట్లు, ఎస్‌బీఐ నుంచి రూ.25 వేల కోట్ల పెట్టుబడులు అదాని కంపెనీలలో పెట్టారని చెప్పారు. అదానీ కంపెనీల కుంభ కోణాలను వెలికితీయాలని ప్రతిపక్షాలు, వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తుంటే, ప్రధాని ఎదురుదాడికి పూనుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును అదానీ కంపెనీలో ఎలా పెట్టుబడులు పెడతారని, ఇప్పుడు నష్టపోయిన సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దేశ వార్షిక బడ్జెట్ రూ.45 లక్షల కోట్లు ఉంటే, అందులో దాదాపు జీఎస్టీ రూపంలో రూ.20 వేల కోట్లు వసూలు అవుతున్నాయని, ఆ జీఎస్టీలో పేదవాడు కట్టిన సొమ్మే ఎక్కువ భాగమని చెప్పారు. పేదలకు ఇచ్చే సబ్సిడీలను క్రమేపి తగ్గిస్తున్నారని, ఆహారం మీద రూ.లక్ష కోట్లు తగ్గించారని, ఎరువులపై రూ.50 వేల కోట్లు. ఇలా మొత్తం సబ్సిడీలను రూ.3 లక్షల కోట్లకు తగ్గించారని వివరించారు. ఈ విధంగా తగ్గించుకుంటూ పేదవాడిని కొట్టి కార్పొరేట్ సంస్థలకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీపీఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్య మంత్రి కానప్పుడు అదానీ ఎవరో సమాజానికి తెలియదని, అలాంటి వ్యక్తి మోడీ అండదండలతో ప్రపంచ కుబేరులలో స్థానం పొందారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రూ.30 వేల కోట్లు కోత విధించారని, ప్రజలకు ఇచ్చే సొమ్ముపై కోతలు విధించి, కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, ఎన్.బాలమల్లేష్, వీఎస్.బోస్, ఇటి.నర్సింహ్మలు, సీపీఐ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కార్యదర్శులు పాలమాకుల జంగయ్య, డీజీ.సాయిల్‌గౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ఎ.రవీంద్రాచారి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయనాయక్, బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం

- టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-మణుగూరు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళిత, ఆదివాసీ పేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిస్తామని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం గొల్లగూడెం నుంచి మొదలైన హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర అశ్వాపురం మంచి కంటి నగర్, జగ్గారం, మిట్టగూడం, కళ్యాణపురం మీదగా మణుగూరు మండలంలోని తోగూడెంలోకి సోమవారం అడుగుపెట్టింది. గిరిజన సంప్రదాయాలతో ప్రజలు రేవంత్‌కు స్వాగతం పలికారు. ప్రధాన రహదారి వెంట ప్రజలను కలుస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంకులు, వివిధ షాపుల్లో పనిచేసే కార్మికులు, మెకానికుల సమస్యలు తెలుసుకున్నారు. జగ్గారం ఎస్సీ కాలనీలో దళితులు తమకు ఇంటి స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని ఇఫ్టు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. బూర్గంపాడు మండలం వరద ముంపు బాధితులు మహిళలు 200 రోజులుగా చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని రేవంత్‌రెడ్డిని కోరారు. మణుగూరు మున్సిపాలిటీని రద్దు చేసి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ చట్టం అమలు చేయాలంటూ వినతిపత్రాలు అందజేశారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య, ములుగు శాసనసభ్యురాలు సీతక్క, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా నాయకులు కమటం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు.

ఈమోజ్ వర్చువల్ వేదికను పరిచయం చేసిన ఐఐఎల్



నవతెలంగాణ -హైదరాబాద్ బ్యూరో

ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మొదటిసారి తమ మెడికల్ ప్రతినిధుల కోసం ఈమోజ్ అనే వర్చువల్ వేదికను సోమవారం ఆవిష్కరించింది. ఇది వైద్యులు, మెడికల్ ప్రతినిధుల సమాచారాన్ని సులభతరం చేయనున్నది. దీని ద్వారా వైద్యులకు ఎక్కువ సౌకర్యాన్ని అందించడం, వారి విలువైన సమయాన్ని ఆదా చేయడం ద్వారా రోగికి మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఐఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్ తెలిపారు. "ఈ తరం ఆరోగ్య సంరక్షణ నిపుణులు డిజిటల్ కమ్యూనికేషన్ విధానంపై చాలా ఆసక్తి చూపుతున్నారు. మాదగ్గరకు వచ్చే రోగులకు ఆకర్షణీయమైన డిజిటల్ అనుభవాన్ని ఈ మోజ్ ద్వారా అందించాలని మేం భావిస్తున్నాం' అని తెలిపారు.

32 ఫామ్‌హౌస్‌లపై ఏక కాలంలో పోలీసుల దాడులు

- మొయినాబాద్, మేడ్చల్, శంషాబాద్‌లోని ఫామ్‌హౌస్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు
- 22 మంది అరెస్టు, పలు సామగ్రి స్వాధీనం





నవతెలంగాణ - శంషాబాద్

రంగారెడ్డి జిల్లా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏకకాలంలో 32 ఫామ్‌హౌస్‌లపై పోలీసులు దాడులు చేశారు. ఇందులో నాలుగు ఫామ్‌హౌస్‌ల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేస్తున్నట్టు గుర్తించారు. ఈ దాడుల్లో 22 మందిని అరెస్టు చేసి, పలు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ పీఎస్ పరిధిలోని బిగ్‌బాస్ ఫామ్‌హౌస్, జహంగీర్ డ్రీమ్ వ్యాలీ ఫామ్ హౌస్, శంషాబాద్ పీఎస్ పరిధిలోని రిఫ్లెజ్ ఫామ్‌హౌస్, మేడ్చల్ పీఎస్ పరిధిలోని గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంపై సోమవారం దాడులు నిర్వహించారు. శంషాబాద్‌లో అక్రమంగా మద్యం, హుక్కా సేవిస్తున్నట్టు గుర్తించారు. మేడ్చల్‌లో బెట్టింగ్ ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. బిగ్‌బాస్ ఫామ్‌హౌస్ వాచ్‌మెన్ అబ్దుల్ మజీద్, ఉప్పల్‌కు చెందిన బి.స్వామిని అరెస్టు చేశారు. ఫామ్‌హౌస్ యజమాని పరారీలో ఉన్నాడు. జహంగీర్ డ్రీమ్ వ్యాలీ ఫామ్ హౌస్‌లో మంగళ్ హాట్‌కు చెందిన షేక్ సొఫియాన్ ప్రయివేటు వర్క్ చేస్తున్న టోలిచౌకికి చెందిన ఇస్మాయిల్, ఎండీ నవాజ్, ఎండీ అఫ్రోజ్ అలీ, కాలా పత్తర్‌కు చెందిన సయ్యద్ సిద్ధిక్, బాలానగర్‌కు చెందిన సయ్యద్ రఫీ, బోయిన్‌పల్లికి చెందిన ఎండీ ఎజాజ్ అక్తర్ హుస్సేన్, బొరబండకు చెందిన ఎండీ నదీమ్, ఎండీ ఫ్రోజ్ ఖాన్, మల్లేపల్లికి చెందిన ఎం డీ ముస్తఫాను అరెస్టు చేశారు. ఇంటి యజమాని అజహర్ పరారీలో ఉన్నాడు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రిఫ్లెజ్ ఫార్మ్ హౌస్‌లో కాచిగూడకు చెందిన నిఖిల్, హైటెక్ సిటీకి చెందిన ఫామ్ హౌస్ యజమాని హేమంత్, సూపర్‌వైజర్ మహ్మద్ ఇంతియాజ్, ఫూస్సీమియా గూడకు చెందిన మేనేజర్ రాజు పట్టుబడ్డారు. మేడ్చల్ గోవర్ధన్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఫామ్‌హౌస్ యజమాని గోవర్ధన్ రెడ్డి, మీనాక్షి ఎంక్లేవ్ కండ్లకోయకు చెందిన పి.రాజేష్, కొంపల్లి బృందావన్ ఎంక్లేవ్‌కు చెందిన ఎం. మాధవ రెడ్డి, యంజాల్‌కు చెందిన టీ. శ్రీనివాస్, కండ్లకోయకు చెందిన ఎస్ .రవి, కౌకూర్‌కు చెందిన ఆర్. ప్రకాష్ రావు, షాపూర్‌నగర్‌కు చెందిన సాయి పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ. 1.03 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ప్లే కార్డులు 10 సెట్లు, సెల్ ఫోన్లు 7, హుక్కా కుండలు 10, హుక్కా పైపులు 5, హుక్కా బ్లూ బెర్రీ రుచులు 17, బొగ్గు 4, సిల్వర్ పేపర్ 3, ఫిల్టర్ ప్యాకెట్ - 1 ఎంఏ 19 బ్లెండర్ ప్రైడ్ - 1, కింగ్ ఫిషర్ లైట్ - 16, బ్రీజ్‌లు 5, ఇతర మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆత్మహత్యకు అనుమతివ్వండి

- కలెక్టరేట్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం
- అవినీతిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన



యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మద్నూర్ మార్కెట్ యార్డులో అవినీతి జరిగిందని సాక్షాధారాలతో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేయడంతో తనను మానసికంగా వేదిస్తున్నారని, బెదిరింపులు, దాడులు పెరిగాయని.. తనకు ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతివ్వాలని ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కామారెడ్డి కలెక్టరేట్ వద్ద సోమవారం కలకలం రేపింది. ఎస్ఐ అప్రమత్తతతో యువకుడు ప్రాణం నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం అవల్‌గావ్ గ్రామానికి చెందిన సిద్ధప్ప అనే యువకుడు రెండేండ్ల కిందట మద్నూర్ మార్కెట్ యార్డులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఆర్టీఐ ద్వారా మార్కెట్ కమిటీకి వచ్చే నిధులు, ఖర్చుల వివరాలు కోరారు. అయితే యార్డు అధికారులు సమాచారం ఇవ్వలేదు. దాంతో తనవద్ద ఉన్న ఆధారాలతో ఢిల్లీ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. రూ.5 కోట్ల అవినీతి జరిగిందని తగిన సాక్షాధారాలతో కలెక్టర్ కార్యాలయంలో, వ్యవసాయ శాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందన రాలేదు. అధికారుల చుట్టూ తిరగడంతో పాటు సిద్ధప్ప వద్ద ఉన్న ఆధారాలు ఇవ్వాలంటూ అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. బెదిరింపులకు పాల్పడటం కూడా మొదలు పెట్టారు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా తనపైనే థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఆధారాలు లాక్కునే ప్రయత్నం చేసారని సిద్ధప్ప ఆరోపించారు. మార్కెట్ యార్డులో 5 కోట్ల వరకు అవినీతి జరిగిందని, విచారణకు అదేశించి అధికారులు వివరాలు కోరితే ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో పాటు అధికార పార్టీ మండల నాయకులు తన అనుచరులకు మద్యం తాగించి తనను కొట్టించాడని ఆరోపించారు. దాంతో 7 నెలలుగా తాను ఇంటికి వెళ్లడం లేదని, నిజామాబాద్‌లో ఉంటున్నానని తెలిపారు. అవినీతిపై ప్రశ్నించినందుకు తన కుటుంబం మొత్తాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తాను ఇంటికి వెళ్తే ప్రాణహాని ఉందని చెప్పారు. తన కుటుంబంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతిపై ఫిర్యాదు చేస్తే న్యాయం జరగకపోగా చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని దీనంగా ప్రాధేయపడ్డాడు. అధికారులు ఇకనైనా స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.

కాజీపేట-బలార్షా రూట్లో పలురైళ్లు రద్దు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోని కాజీపేట-బలార్షా సెక్షన్‌లో ఈనెల 15 నుంచి 24, 25 తేదీల వరకు పలు రైళ్లను పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ రూట్లో మూడవ లైన్ కనెక్టివిటీ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ప్రయాణీకులు రైల్వే ఎంక్వైరీ ద్వారా ఆయా రైళ్ల వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. పై రూట్లో 17 రైళ్లు పూర్తిగా, 7 రైళ్లు పాక్షికంగా రద్దు అయినట్టు తెలిపారు.

వనస్థలిపురంలో బస్‌టెర్మినల్‌కు గ్రీన్‌సిగ్నల్

- 'హరిణ వనస్థలి' నుంచి 1.354 హెక్టార్ల భూమి కేటాయింపు : ఆమోదం తెలిపిన రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు
- శ్రీశైలం రహదారి విస్తరణకు అనుమతి నిరాకరణ
- వన్యప్రాణుల దాడిలో చనిపోతే రూ.10 లక్షల పరిహారానికి ప్రతిపాదనలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వనస్థలిపురంలో నిర్మించబోయే బస్‌టెర్మినల్‌కు మహవీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు నుంచి 1.354 హెక్టార్ల భూమిని ఇచ్చేందుకు వైల్డ్ లైఫ్ బోర్డు ఆమోదం తెలిపిందని పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్ తెలిపారు. శ్రీశైలం రహదారి విస్తరణకు అనుమతి ఇవ్వాలంటూ వచ్చిన దరఖాస్తును తిరస్కరించామన్నారు. వన్యప్రాణుల దాడిలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇచ్చే ప్రతిపాదనలను రాష్ట్ర సర్కారుకు పంపనున్నట్టు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర వన్యప్రాణి మండలి, మనుషులు-జంతువుల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించే చర్యల సూచన కమిటీ సమావేశాలను నిర్వహించారు. స్టేట్ వైల్డ్ లైఫ్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన తర్వాత జరిగిన తొలిసమావేశం ఇదే. సమావేశాల నిర్ణయాలను డోబ్రియాల్ మీడియాకు వివరించారు. రాష్ట్రంలో మొదటి సారి చేపట్టిన పులుల ఆవాసాల్లో ఉన్న మానవ ఆవాసాల తరలింపు (కవ్వాల్‌లో రెండు గ్రామాలు) ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నదని చెప్పారు. వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచాలని నిర్ణయించామని తెలిపారు. ప్రస్తుతమిస్తున్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. సాధారణ గాయాలైతే వాస్తవ వైద్యం ఖర్చు (లక్ష రూపాయలకు మించకుండా), తీవ్రంగా గాయపడితే వైద్యానికి అయ్యే ఖర్చు (మూడు లక్షల రూపాయలకు మించకుండా), అంగవైకల్యం ఏర్పడితే లక్ష రూపాయల పరిహారం, పెంపుడు జంతువులు చనిపోతే వాస్తవ అంచనా(యాభై వేల రూపాయలకు మించకుండా) ఇచ్చే ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశామన్నారు. అలాగే పంట నష్ట పరిహారాన్ని రూ.7,500కు పెంచాలని కూడా సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. గత బోర్డు సమావేశంలో 24 ప్రతిపాదనలు అటవీ అనుమతుల కోసం రాగా 15 అప్లికేషన్లను పరిశీలించి అనుమతుల కోసం నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డుకు పంపామన్నారు. మిగతా తొమ్మిది రాష్ట్ర పరిధిలో ఉన్నాయన్నారు. తాజాగా మరో ఏడు ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు. వనస్థలిపురంలోని బస్‌టెర్మినల్‌కు స్థలం కేటాయించిన నేపథ్యంలో హరిణ వనస్థలి కోసం అవసరమైన రక్షణాత్మక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీశైలం రహదారి విస్తరణ కోసం వచ్చిన ప్రతిపాదనను అమ్రాబాద్‌లోని వన్యప్రాణి సంరక్షణను దృష్టిలో పెట్టుకుని తిరస్కరించామన్నారు. కడెం పరిధిలో లక్ష్మీపూర్ లిఫ్ట్, నాగార్జున సాగర్ పరిధిలో పెద్ద గుట్ట లిఫ్ట్ కేబుల్ పనులకు అనుమతులిచ్చామన్నారు. వన్యప్రాణులు ప్రమాదంలో పడ్డప్పుడు కాపాడేందుకు అవసరమైన రెస్క్యూ టీమ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులు కోవ లక్ష్మి, రాఘవ, బానోతు రవికుమార్, అనిల్ కుమార్, పీసీసీఎఫ్ (ఎఫ్ఏసీ) ఎం.సీ. పర్గెయిన్, అటవీశాఖ అడిషనల్ సెక్రటరి ప్రశాంతి, ఓఎస్డీ శంకరన్, ఇతర అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోలోనే వేయాలి

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్



నవతెలంగాణ-సరూర్‌నగర్

ఇంట్లో పోగు అయ్యే చెత్తను వీధిలో వేయకుండా ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటోలోనే వేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. సోమవారం సరూర్‌నగర్ పాత గ్రామంలో ప్రజలకు అవగాహన కోసం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆటోలోనే చెత్తను వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు కాలనీ, వీధిలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రంతోటే ఆరోగ్యంగా ఉంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్కి సంస్థ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

మన్సూరాబాద్ డివిజన్, వివేకానందనగర్ కాలనీలో తరచూ పొంగుతున్న డ్రెయినేజీ సమస్యకు వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్, కాలనీవాసులతో కలిసి స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఏ కాలనీలోనైనా సామర్థ్యం సరిపోని పాత కాలం నాటి డ్రెయినేజీ లైన్ సమస్య తరచుగా వచ్చే



డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వివరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్యాంసుందర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రవిచంద్ర, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే దేవి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

దుర్గా భవాని నగర్ కాలనీ పరిధిలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపుతానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా దుర్గాభవాని నగర్ కాలనీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకట్, నిషాకాంత్, నాగేశ్వరరావు, జగన్, నరసింహ, రవీందర్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, ప్రభాకర్, సాయిలు, కిషోర్, రాహుల్, బద్రి, రామకృష్ణారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, మోహన్ రెడ్డి, రత్నారావు, సురేంద్రరెడ్డితో కలిసి శంకుస్థాపన పనులు ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్య వల్ల తలెత్తిన సమస్యను స్థానికుల విజ్ఞప్తి మేరకు పరిశీలించి సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే విధంగా ప్రతివాడలో మురుగునీరు మరమ్మతులు డ్రైనేజీ ప్రవాహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమగ్రంగా తీసుకోవలసిన చర్యలపై అధికారులకు చర్చించడం జరిగింద



న్నారు. మొదటిసారిగా వేసిన భూగర్భ డ్రైనేజీ పూర్తిగా దెబ్బతింది, ప్రస్తుతం 4 అడుగులు ఉండడం వలన జనాభా పెరుగుదల అనుసారంగా 8 అడుగులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. సమస్య పరిష్కారానికి 100 ఫీట్ పొడవున కొత్త డ్రైనేజీ వ్యవస్థకు కలపాని సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని, డ్రైనేజీ, సీసీ రోడ్డు, మంచినీరు, విద్యుత్ దీపాలు, వంటి అన్ని రకాల మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆయన చెప్పారు. కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, మెరుగైన ప్రజా జీవనాన్ని అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని, కాలనీని ఆదర్శవంతమైన డిబి నగర్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, వృద్ధుల పట్ల..

కఠినంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

- మానవీయ కోణంలో స్పందించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలు, వృద్ధుల పట్ల కఠినంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సోమవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న తొంభై తొమ్మిదేండ్ల వృద్ధుడు, మాజీ సైనికోద్యోగి ఎస్.సత్యనారాయణ తమ చిన్న కుమారుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సీపీకి ఫిర్యాదు చేసేందుకు నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయానికి వెళ్లాడు. అయితే విషయం తెలుసుకున్న సీపీ స్వయంగా తన క్యాబిన్ నుంచి బయటకు వచ్చి వృద్ధుని నుంచి ఫిర్యాదును తీసుకున్నారు. తక్షణమే విచారణ జరిపి వారికి తగిన న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలు, వృద్ధుల పట్ల అమానుషంగా వ్యవహరించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు స్వయంగా రాలేని బాధితులు రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూమ్ 9490617111కు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించి సత్వర న్యాయం చేస్తామనితెలిపారు. ఇదిలావుండగా సీపీ స్వయంగా ఫిర్యాదు తీసుకోవడం, వెంటనే స్పందించిన తీరుతో



బాధితులే కాకుండా ప్రతీ ఒక్కరు ప్రశంసించారు. బాధితులు ఎస్.సత్యనారాయణ సంతోషంతో సీపీ చేయి తీసుకుని ముద్దుపెట్టారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ఉప్పల శ్రీనివాస్ గుప్తా





నవతెలంగాణ-నాగోల్

రాజస్థాన్, ఉదయపూర్‌లోని తన మిత్రుడి ఫామ్ హౌస్‌లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, ఎంపీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు సోమవారం వారి (పెళ్లిరోజు) 26వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ మరియు ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తవారి సతీమణి స్వప్నతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టూరిజం చైర్మెన్ మాట్లాడుతూ తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం ఆనందంగా ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది మొక్కలు నాటేందుకు తెలంగాణకు హరితహారం కార్యక్రమం చేపట్టారు. అలాగే 'తెలంగాణకు హరిత హారం' కార్యక్రమంతో కూడా సీఎం కేసీఆర్ ఒక పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కొన్ని కోట్ల మొక్కలు నాటించి, ప్రతి సంవత్సరం తెలంగాణకు హరితహారం కార్యక్రమం తుచ తప్పకుండా అమలు పరుస్తు న్నారని అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపడం పట్ల ఎంపీ సంతోష్‌కుమార్ కృషిని అభినందిస్తూ..అందుకు స్ఫూర్తినిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యూపీఐ పేమెంట్లకు వీలు కల్పించిన ఫిన్‌టెక్ వేదికగా ఫోన్ పే ఘనత

నవతెలంగాణ-హైదరాబాద్

యూపీఐ ఇంటర్నేషనల్ పేమెంట్లకు సహకారాన్ని ప్రారంభించామని భారతదేశంలోని అతిపెద్ద డిజిటల్ పేమెంట్ల కంపెనీ అయిన ఫోన్పే ప్రకటించింది. ఈ ఫీచర్ విదేశాలకు వెళుతున్న ఫోన్ పే భారతీయ వినియోగదారులకు యూపీఐ ని ఉపయోగించి విదేశీ మర్చంట్లకు తక్షణమే పే చేసేందుకు వీలు కల్పిస్తుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, నేపాల్, భూటాన్లలో స్థానిక క్యూఆర్ కోడ్ కలిగిన అంతర్జాతీయ మర్చంట్ అవుట్లెట్లు అన్నిటికీ తక్షణ పేమెంట్లు చేసేందుకు సహకరిస్తుంది. ఈసందర్భంగా ఫోన్పే సీటీఓ, సహ వ్యవస్థాప కుడు రాహుల్ చారి మాట్లాడుతూ... గడచిన ఆరేళ్లకు పైగా, భారతదేశ వ్యాప్తంగా మన జీవితాలను రూపాంతరం చేసిన యూపీఐ పేమెంట్ల విప్లవాన్ని అనుభవించడంలో తాము చాలా అదృష్టవంతులమన్నారు. ప్రపంచంలోని ఇతర భూభాగాలకు కూడా యూపీఐ అనుభవాన్ని అందించడంలో యూపీఐ ఇంటర్నేషనల్ మొదటి ప్రధాన అడుగుగా నిలుస్తుం దన్నారు. ఇది ఒక గమ్చేంజర్ నిరూపించబడుతుందని, విదేశాలకు వెళ్లే భారతీ యులు మర్చంట్ అవుట్ లెట్లలో పే చేసే పద్ధతిని పూర్తిగా మారుస్తుందని తాను గట్టిగా చెప్పగలనన్నారు. మార్కెట్కు కొత్త యూపీఐ ఫీచర్లను తీసుకునే మొదటి టీపీఏపీ (థర్డ్‌పార్టీయాప్)గా నిలవడం పట్ల ఎప్పటిలాగే ఫోన్ పే గర్విస్తోందన్నారు.

వినియోగదారులకోసం సెన్సోడైన్ కంప్లీట్ ప్రొటెక్షన్ ప్లస్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్

సెన్సోడైన్ తయారీదారులైన హేలియన్ తన సరికొత్త ఉత్పాదన అయిన సెన్సోడైన్ కంప్లీట్ ప్రొటెక్షన్ ప్లస్ ఆవిష్కారాన్ని ప్రకటించింది. వినియోగదారులు తమ సమస్తమైన నోటి సంరక్షణ అవసరాలను నిర్వహించుకోవడానికై ఒక ఆల్-ఇన్-వన్ సెన్సోడైన్ ఉత్పాదనను అందించాలని ఈ ఆవిష్కరణ లక్ష్యంగా చేసుకొంది. ఈసందర్భంగా సెన్సోడైన్ కంప్లీట్ ప్రొటెక్షన్ ప్లస్ ఆవిష్కరణ గురించి గ్లాక్సో స్మిత్ క్లైన్ కన్స్యూమర్ హెల్త్కేర్ ఓరల్ కేర్, ఏరియా మార్కెటింగ్ లీడ్ భావన సిక్కా మాట్లాడుతూ... దేశంలోని అగ్రగామి నోటి రక్షణ బ్రాండులలో సెన్సోడైన్ ఒకటన్నారు. ఇది ఇండియాలో అనేక సంవత్సరాల పాటుగా అర్థవంతమైన వినూత్న ఆవిష్కారాలను ప్రవేశపెట్టిందన్నారు. ఇండియాలో మిలియన్ల కొద్దీ ప్రజలు దంత సున్నితత్వం, కారణంగా రాజీ పడిన జీవనం కొనసాగిస్తున్నారన్నారు. అటువంటి వారి కోసం ఒక ప్రత్యేకమైన సున్నితత్వ ప్రతిభ కల, ఇతర నోటి రక్షణ ప్రయోజనాలను కూడా అందించగల టూత్పేస్ట్ అవసరాన్ని అర్థం చేసుకోవడానికి తాము వారితో కలిసి పని చేశామన్నారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడండి

బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర నాయకులు చెవ్వ శ్రవణ్

నవతెలంగాణ-మీర్‌పేట్

జిల్లెలగూడ రెవెన్యూ పరిధిలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర నాయకులు చెవ్వ శ్రవణ్ కుమార్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్, బాలాపూర్ తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాపూర్ మండలం జిల్లెలగూడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 124లో 5ఎకరాల ప్రభుత్వ భూమి ఉండాలి. దాంట్లో కొంతభాగం మున్సిపల్ కార్యాలయానికి కేటాయించారు. మిగిలిన భూమిని కొందరు భూ కబ్జాదారులు పక్క సర్వే నెంబర్‌తో తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. గతంలో అదే స్థలంలో నిర్మాణాలు చేపడితే మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఆ నిర్మాణాలను కూల్చివేశారని తెలిపారు. మళ్లీ అదే స్థలంలో నిర్మాణాలు చేస్తుంటే అధికారులు తమకేమీ తెలియద



న్నట్లుగా చూసీచూడనట్లు వ్యవరించడాన్ని తప్పుపట్టారు. అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు అధికార పార్టీ నాయకులకు అండగా ఉండటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతిరెడ్డి, ముఖేష్ యాదవ్, స్వామి, రాజేంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు లేదు.. అభివృద్ధి పనుల జాడే లేదు

కాలనీల్లోని సమస్యలు పట్టింపు లేదా?

కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఉప్పల్

ఏ కాలనీలో చూసినా కొత్తగా చేసిన అభివృద్ధి లేదు.. ఎక్కడి సమస్యలు అక్కడనే ఉన్నాయి.. సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వంలోని పెద్దలు మాత్రం నగరాన్ని డల్లాస్ చేస్తాం అంటున్నారు. నగరాభివృద్ధి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం అంటున్నారు.. అసలు కేటాయించిన డబ్బులు ఎక్కడ పోతున్నాయి. అభివృద్ధి ఎక్కడ జరుగుతుంది అంటూ కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, మేకల శివారెడ్డిలు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదు డివిజన్లలో హాత్ సే హాత్ జోడో యాత్రలో పలు సమస్యలు ప్రజలు విన్నవించారు. జోడో యాత్రలో గుర్తించిన సమస్యలను సోమవారం ఉప్పల్ సర్కిల్ మున్సిపల్ అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా అన్ని



కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మాణం చేయాలని కోరారు. అనంతరం వాటర్ వర్క్స్ అధికారులను కలిసి కలుషిత జలాల సరఫరా, మురుగు సమస్యలను గురించి వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుర్వి మురళిగౌడ్ ఆకారపు అరుణ్ పటేల్, మరియు చిలకనగర్ డివిజన్ అధ్యక్షుడు కొంపల్లి బాలరాజు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తవిడబోయిన గిరిబాబు, ఈగ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షౌర వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - ఎల్బీనగర్

దిల్‌సుఖ్‌నగర్ క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర క్యాలెండర్ ప్రజాసంఘాలు కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంకాల సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు గంధం మనోహర్ మాట్లాడుతూ క్షౌర వృత్తిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లెపాక వీరయ్య ప్రజా సంఘాల నాయకులు సీహెచ్ వెంకన్న,



గిరిజన సంఘం జిల్లా నాయకులు గోపి నాయక్, నాయిబ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొలనుకొండ అశోక్, చైతన్యపురి డివిజన్ నాయి బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

మార్నింగ్ వాక్‌లో కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఏ5 ఫంక్షన్ హాల్ కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోర్ సూపర్ మార్కెట్ కాలనీ మొత్తం తిరుగుతూ సీసీ రోడ్డు పరిశీలిస్తూ ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. కాలనీలతోపాటు బస్తీలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో వేగంగా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. ప్రజలంతా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సన్‌షైన్ ప్రెసిడెంట్ అజీజ్ పాషా, అహ్మద్, ఇస్మాయిల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సీసీ రోడ్డు సదుపాయం



కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ డివిజన్‌లోని రంగనాయకులు గుట్టలో వచ్చే రెండు మూడు రోజుల్లో మొదలుకానున్న నూతన సీసీ రోడ్డు పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సోమవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు బస్తీవాసులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రోడ్డు నిర్మాణం చెపట్టాలని అధికారులకు తెలిపారు. అంతే కాకుండా ప్రజ అవసరాలకు అనుగుణంగా డివిజన్‌లోని ప్రతి కాలనీ అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్ రావు, ఏఈ నరేంద్ర తేజ, వర్క్ ఇన్స్‌పెక్టర్ సురేష్ రంగ నాయకులగుట్ట కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గడీల పాలనకు చరమగీతం పాడాలి : సామ రంగారెడ్డి

నవతెలంగాణ - హస్తినాపురం

రాష్ట్రంలో తెలంగాణ సర్కారు అవలంబిస్తున్న సంక్షేమ పథకాలు కేవలం వారి కార్యకర్తల కోసమే కానీ పేద ప్రజలకోసం ఏ మాత్రం కాదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి అన్నారు. బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆటో స్టాండ్ వద్ద రాష్ట్ర బీజేపీ ఆదేశాల మేరకు ప్రజాగోస - బీజేపీ భరోసా కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న అప్రజాస్వామిక నిర్ణయాలను బీజేపీ ఎప్పటికప్పుడు ఎండగడుతుందని, రానున్న రోజుల్లో గడీల పాలనకు చరమగీతం పాడేలా కార్యాచరణ వుంటుందని వారు అన్నారు. కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించి, అభివృద్ధికి కృషిచేస్తామని వారు



అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మరియు డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షులు కొంతం నవ కిషోర్ రెడ్డితోపాటు సీనియర్ నాయకులు, కాలనీల అధ్యక్షులు, కార్యకర్తలు అభిమానులు మరియు తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ షరీఫ్ దర్గాను సందర్శించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నవతెలంగాణ-నాగోల్

రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గాను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ మరియు ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త కుటుంబ సమేతంగా సందర్శించి దర్గాకు చాదర్‌ను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. భారతీయ రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్రానికి పరిమితం కాకుండా భారత దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా ముందుకు వెళుతుందని, దీంతో దేశంలో కూడా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి దేశవ్యాప్తంగా జరగాలని ఆయన కోరారు. దేశ రాజకీయాలలో మరియు పాలనలో గుణాత్మక మార్పు కోసం బీఆర్ఎస్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. దర్గాను సందర్శించిన కార్యక్రమంలో భాగంగా దర్గా కమిటీ సభ్యులు సాంప్రదాయ పద్ధతిలో ఆశీర్వాదాలు అందించారు. అనంతరం ఉప్పల శ్రీనివాసగుప్తతోపాటు కుటుంబ



సభ్యులు పేదలకు అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్వప్న, సాయికిరణ్, సాయి తేజ పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు, వస్త్రాల పంపిణీ

- అభాగ్యులకు అన్నదానం చేసిన విశ్రాంత లెప్రసీ, పారామెడికల్ ఆఫీసర్లు
- పేదల సేవలో తరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు నేటి తరానికి ఆదర్శం : గట్టు గిరి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలోని అనాథలకు రిటైర్డ్ ఆఫీసర్లు ఉద్యోగం, వయసుకే రిటైర్మెంట్‌ని మనసు, సామాజిక సేవకు కాదనీ లెప్రసీ, పారామెడికల్ రిటైర్డ్ ఆఫీసర్లు కలిసి నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాధశ్రమంలో దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగం, వయసుకే గానీ సహాయం చేయటానికి రిటైర్మెంట్ మనసుకు కాదన్నారు. సమాజంలోని ఎంతో మంది అనాథలు, పేదలకు సేవ చేయటం వల్ల తమకు ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకున్నందుకు సంతోషంతోపాటు తమకు మానసిక ఆరోగ్యం ఎక్కువ లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు, విలేజ్ లైబ్రరీ ఫౌండర్ హనుమంతరావు మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు, ఆఫీసర్లు కలిసి విరాళాలు వేసుకుని సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వటం గొప్ప విషయమన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత సామాజిక సేవలో తరించటం మానసిక ఆరోగ్యం, ఉల్లాసం కలుగుతుందన్నారు. రిటైర్డ్ ఆఫీసర్ ముదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తరపున ప్రతినిధిగా హాజరై మాతృదేవోభవ అనాధాశ్రమంలో అభాగ్యులకు అన్నదానం, వస్త్రాల పంపిణీ చేయటం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నట్లు హనుమంతరావు తెలిపారు. తమ ఆశ్రమంలోని అనాధాశ్రమానికి దాదాపు రూ.లక్ష విలువైన వస్త్రాలు, అన్నదానం 110 మందికి చేయటం చాలా సంతోషమని నిర్వాహకులు గట్టుగిరి చెప్పారు. అనాధలకు అండగా నిలిచేందుకు గ్రామపెద్దలు ముందుకు రావాలని నాదర్‌గుల్ వాసులను గిరి కోరారు.



కుష్టువ్యాధి నివారణోత్సవాల సందర్భంగా మానసిక, శరీరక వైకల్యం చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ శరీరక, మానసిక ఉల్లాసంగా ఉండాలని, ముందే లెప్రసీని గుర్తించి సరైన చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సద్గునాచారి, పి.సత్యనారాయణ, జి.సుధాకర్‌రెడ్డి, విద్యాసాగర్ రావు, బాలసుబ్రహ్మణ్యం, వి.సత్యనారాయణ, గురుప్రకాశ్, వేణుగోపాల్, విశ్వనాథం, సదానందం తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ జన్మదిన పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నాచారం



సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల మారయ్య ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శప్రాయం అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశ అభివృద్ధి, ఐక్యత కోసం అడుగులు వేస్తున్న మహానేత కేసీఆర్ జన్మదినాన్ని ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నారాయణ, నాయకులు పాండు నాయక్, గడ్డం శ్రీను, శంకర్ నాయక్, శాతం రమేష్, దాస్ కుమార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు రండి

- ఎంపీ సంతోష్ కుమార్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 21 వరకు జరుగుతునందున్న బ్రహ్మోత్సవాలకు రావాలని ఎంపీ సంతోష్ కుమార్‌ను సోమవారం ప్రగతిభవన్‌లో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, కీసర గ్రామ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బాబు యాదవ్ పాల్గొన్నారు.

కీసరగుట్ట జాతరకు చురుకుగా సాగుతున్న పనులు

- ఈనెల 16 నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలు
- 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం





నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రతియేటా జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబౌతుంది. ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 5 లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉండటంతో జాతర పరిసరా ప్రాంతాల్లో అధికారులు చురుకుగా పనులు కొనసాగిస్తున్నారు. గత బ్రహ్మోత్సవాల్లో జరిగిన లోటుపాటులను సవరించు కుంటూ ఈసారి భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుస్తుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మేడ్చల్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కీసరగుట్ట జాతరను విజయవంతం చేయడానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమొయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా పలుమార్లు అధికారులతో సమీక్షా సమావేశాలు సైతం నిర్వహించారు.

జాతరను విజయవంతం చేస్తాం



కీసరగుట్ట జాతరను విజయవంతం చేయడానికి అందరూ సహకరిస్తున్నారు. కీసరగుట్ట ఆలయాకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భక్తుల కోసం ప్రసాదాలు, మంచీనీరు, మరుగుదొడ్లు, క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేశాం.

ఆలయ చైర్మెన్ తటాకం రమేష్ శర్మ

జాతర పరసర ప్రాంతంలో చురుకుగా పనులు

కీసరగుట్ట జాతరకు 5 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉండంటతో అధికారులు జాతర పరిసర ప్రాంతంలో చాలువ పందిళ్లు, స్ననాపు గదులు, మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకులు, నిరంతర విద్యుత్, లడ్డు ప్రసాదాల తయారీ కేంద్రం, క్యూలైన్, పార్కింగ్ కోసం స్థలాన్ని చదునుచేయడం వంటి పనులు చురుకుగా జరుగుతున్నాయి.

ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్ సమస్యలను పరిష్కరించండి

- కేటీఆర్‌కు మంత్రి తలసాని వినతి



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎంతోకాలంగా అపరిష్కతంగా ఉన్న ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్ సమస్యలను పరిష్కరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఇండ్ల స్థలాల సమస్యలపై మంత్రి కేటీఆర్ అధ్యక్షతన ఏడుగురు మంత్రులతో ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీలో సభ్యులైన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నో ఏండ్ల నుంచి ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మించుకుని అనేకమంది పేదలు నివసిస్తున్నారనీ, వారికి యాజమాన్యపు హక్కులు కల్పించాలని కోరుతూ వస్తున్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏండ్లలో ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజల ఇండ్ల సమస్య పరిష్కరించాలనే ఆలోచన కూడా చేయలేదనీ, సీఎం కేసీఆర్ పేద ప్రజల అవస్థలు తెలిసిన వ్యక్తిగా అపరిష్కతంగా ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇందుకు సంబంధించి పలు సమస్యలు పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని జీరా కాంపౌండ్ లోని నర్సింహ స్వామి, బాలాజీ ఆలయాల పరిధిలో 70 కుటుంబాలు ఇండ్లను నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వం రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కూడా కల్పించిందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల కోరిక మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించాలని ప్రతిపాదనలను పంపించామనీ, స్థల బదలాయింపునకు కోర్టు ఉత్తర్వులు అడ్డంకిగా ఉన్నాయని చెప్పారు. ఈ స్థలాన్ని దేవాదాయ శాఖ నుంచి కొనుగోలు చేసేందుకు జీహెచ్ఎంసీ సుముఖంగా ఉందనీ, కలెక్టర్‌కు కూడా లేఖ పంపిన విషయాన్ని గుర్తు చేశారు. కవాడి గూడలో గల సోమప్ప మఠం స్థలంలో సుమారు 100 నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నాయనీ, 1996లో 56 కుటుంబాలకు ధృవీకరణ పత్రాలను ఇచ్చినట్టు తెలిపారు. ఈ స్థలాన్ని జీహెచ్ఎంసీకి బదలాయింపు చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలోని పేదల ప్రజలు ఎంతో కాలం నుంచి కోరుతూ వస్తున్నారని పేర్కొన్నారు. జీరా కాంపౌండ్ కాలనీలో 134 గృహాలు ఉన్నాయనీ, 1994లో జీఓ 816 ప్రకారం రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకోన్నప్పటికీ, ఆ సమయంలో సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉండటం వల్ల అప్పటి ప్రభుత్వం దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిందన్నారు. 2002లో లబ్దిదారులకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ జీఓ 816 గడువు ముగియడంతో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 1938లో ఆదయ్య నగర్‌లో 380, రాంగోపాపేటలో 691, న్యూ బోయగూడలో 66 మొత్తం 1047 ఇండ్లను అప్పటి మున్సిపల్ అధికారులు నిర్మించి రూ.2 అద్దెకు ఇవ్వగా, 1984లో 1961లో మార్కెట్ ధరల ప్రకారం లబ్దిదారులకు రూ.1489 విక్రయించాలని నిర్ణయించి ఆదయ్యనగర్‌లో 143, రాంగోపాల్‌పేట లో 267 ఇండ్లను లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిపారు. 2000లో అప్పటి అధికారి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తర్వాతనే యాజమాన్యపు హక్కులు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సనత్ నగర్ లోని శ్యామలకుంట, రాంగోపాల్ పేట లోని వెంగళ్ రావు నగర్ లలో అనేక మంది పేదలు ఇండ్లను నిర్మించుకుని ఏండ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. రికార్డులలో ఎఫ్‌టీఎల్ కింద నమోదు చేయబడిందనీ, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరంగల్ లో చేసిన విధంగా ఆయన్ కింద మార్పిడి చేసి అక్కడ నివసిస్తున్న ప్రజలకు పట్టాలు ఇవ్వడం ద్వారా వారికి ఎంతో మేలు చేసిన వారం అవుతామని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఇబ్బందులు, వాస్తవ పరిస్థితులను తెలియజేసేందుకు ఈ నెల 15వ తేదీన రెవెన్యు, దేవాదాయ, ఇరిగేషన్ తదితర శాఖలకు చెందిన ఉన్నత అధికారులతో కలిసి పర్యటించనున్నట్టు మంత్రి తెలిపారు. వచ్చే సోమవారం జరిగే క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ముందు ఈ వివరాలను సమర్పించనున్నట్టు తెలిపారు.

'ప్రజావాణి' ఆర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్
- ప్రజావాణికి 70 దరఖాస్తులు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజావాణిలో తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో వచ్చే ఆర్జీదారులకు వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, ఈ విషయంలో అవసరమైతే సంబంధిత సమస్యను ఆర్జీ సమర్పించిన వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం శామీర్‌పేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో లింగ్యానాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలు, దరఖాస్తులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట పార్కింగ్ వేలం రూ.27 లక్షల 11 వేల 770

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



కీసరగుట్ట పార్కింగ్ వేలం రూ.27 లక్షలా 11 వేల 770 కు ఆన్‌లైన్ వేలం ద్వారా టి.విజయ్ కుమార్ దక్కించుకున్నారని జిల్లా పంచాయతీ అధికారి రమణ మూర్తి తెలిపారు. సోమవారం కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆన్‌లైన్ టెండర్‌ను నిర్వహించగా టి.విజయ్ కుమార్ అత్యధికంగా రూ.27 లక్షలా 11 వేలా 770 కు వేలంలో పార్కింగ్ టెండర్‌ను దక్కించుకున్నట్టు తెలిపారు. కీసరగుట్ట జాతరకు పెద్ద ఎత్తున భక్తులు, వాహనదారులు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్ సౌకర్యం పకడ్బందీగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కీసర సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, ఎంపీఓ మంగతయారు, పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ సర్కిల్ పరిధిలో స్ట్రీట్ లైట్ రోజువారీ నిర్వహ ణకు పి.ధనుంజయ ప్రైవేట్ ఏజెన్సీ (సాయి కీర్తన ఎంటర్ప్రై జెస్) ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగలకు సక్రమంగా జీతాలు చెల్లించని సదరు స్ట్రీట్ లైట్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అల్వాల్ బీజేపీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీలో అల్వాల్ సర్కిల్‌లోని 3 డివిజన్లు 3 చొప్పున మొత్తం 9మంది ఉద్యోగులకు ప్రతి నెలా సు మారు రూ.18వేల జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ కూడా ఇస్తానని చెప్పి సదరు కాంట్రాక్టర్ ఉద్యోగులను నియమించుకున్నట్టు తెలిపారు. కానీ సదురు కంట్రాక్టర్ ప్రతి నెలా సుమారు రూ.3వేలు జీతం నుంచి కట్ చేస్తూ కేవలం రూ.15వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగికీ ప్రతి నెలా జీతం రూ.18వేలతో పాటు పీఎఫ్ కేవలం రూ.9వేలు ఈపీఎఫ్ ఖాతాలో జమ చేసినట్టు తెలిపారు. ఈఎస్ఐ కింద వారికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించడం లేదన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే ఉద్యోగులు ఈ సమస్య పై కాంట్రాక్టర్‌ను నిలదీయడంతో సదురు కాంట్రాక్టర్ ఆగ్రహించి ఉద్యోగులను తొలగించారన్నారు. సదరు కాంట్రాక్టర్ పి.ధనుంజయ (సాయి కీర్తన ఎంటర్ప్రైజెస్) ప్రయివేటు ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ఏజెన్సీ కాంట్రాక్టును రద్దు చేయడంతో పాటు, కాంట్రాక్టు ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి కాంట్రాక్టు ప్రారంభమైన నుంచి నేటి వరకు ఉద్యోగులకు రావల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అల్వాల్ సీనియర్ నాయకులు దండుగుల వెంకటేష్, నిమ్మ కృష్ణారెడ్డి, శేఖర్, కార్తీక్ గౌడ్, రవి కిరణ్, మల్లికార్జున గౌడ్, తూప్రాన్ లక్ష్మణ్, గోపి, ఎం.శ్రీనివాస్ రావు, అనిల్, నాగరాజు, ఆనంద్, రాజేష్, రవి, రామ్ సింగ్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌కు వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-నాచారం

నాచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన కిరణ్ కుమార్ బదిలీపై సైబర్ క్రైమ్‌కు వెళ్తున్న సందర్భంగా నాచారం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజలకు మరింతగా చేరువవుతారని నిరూపించారు కిరణ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కొనసాగించాలని ఆదేశించిన తదుపరి స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ప్రజలతో ఫ్రెండ్లీగా ఉంటూ వారికి అప్పుడుగా నిలిచారని కొనియాడారు. శాంతి భద్రతల నియంత్రణ కోసం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాలతో స్నేహపూర్వకంగా మెదులుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆత్మబంధువుగా, అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారన్నారు. సేవా భావం కలిగిన అధికారి ఎక్కడ పని చేసినా ప్రజలకు దగ్గర అవుతారనీ, పోలీస్ సిబ్బంది, ఎస్సైలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగరాజు, కుమారస్వామి, కానిస్టేబుళ్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సఫిల్‌గూడలో అక్రమ నిర్మాణం తొలగించాలి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్/మల్కాజిగిరి

సఫిల్‌గూడ చౌరస్తా వద్ద అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు డిమాండ్ చేశారు. సఫిల్ గూడా చౌరస్తా నుంచి ఆనంద్ బాగ్ చౌరస్తా వరకు ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఫుట్ పాత్‌ను పూర్తిగా ఆక్రమించి, గ్రీనరీ, సుందరీకరణ పేరుతో అక్రమ నిర్మాణాలు చేస్తున్న జైన్ బాలాజీ కమర్షియల్ కన్స్ట్రక్షన్ సంస్థ పై శాఖపరమైన, చట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో రెండుసార్లు జైన్ బాలాజీ కమర్షియల్ కన్స్ ట్రక్షన్ (బిగ్ టౌన్స్) అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించినట్టు చెప్పారు. అయినా అధికారుల్లో స్పందన లేకపోవడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్న జైన్ బాలాజీ బిగ్ టౌన్ షిప్ పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రజా సౌకర్యార్థం నిరంతరం రద్దీగా ఉండే ప్రధాన కూడలి సఫిల్ గూడ చౌరస్తా నుంచి ఆనంద్ బాగ్ చౌరస్తా వరకు ఉన్న ఫుట్ పాత్ ను ఆక్రమించి గ్రీనరీ, సుందరీ కరణ పేరుతో అక్రమ నిర్మాణాలు చేస్తున్న సంస్థకు అధికారులు వత్తాసు పలుకుతున్నారంటేనే అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా దీనిపై సంబంధిత జోనల్ కమిషనర్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలనీ, ప్రజా సౌకర్యార్థం ఫుట్ పాత్‌ను యధావిధిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిర్మాణం వల్ల ఏండ్లుగా ఉన్న ఆటో ట్రాలీ స్టాండ్ స్థలం కుదించుకపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనీ, వారాంతపు సంత వల్ల రద్దీ పెరుగుతుందనీ, సఫిల్‌గూడ (మినీ ట్యాంక్ బండ్) పార్కు సందర్శనకు వెళ్ళే పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై మల్కాజిగిరి డిప్యూ టీ కమిషనర్ రాజును వివరణ కోరగా..పింక్ ఏరియా జోనల్ పరిధిలో ఉంటుందనీ, జోనల్ వాళ్ళు చూస్తారు అని తెలిపారు.

యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీ కార్మికులకు టీ షర్ట్స్ పంపిణీ



నవతెలంగాణ-నాచారం

నాచారం పారిశ్రామిక వాడలోని యునైటెడ్ స్పిరిట్స్, డిస్నీ గ్రూప్ (యు ఎస్ ఎస్) సంస్థ యూనిట్ మేనేజర్ శరత్ త్యాగి చేతుల మీదుగా యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియూ) జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్లా ఆధ్వర్యంలో కార్మికులందరికీ టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా యునైటెడ్ స్పిరిట్స్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. కంపెనీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కార్మికులకు ప్రోత్సాహకంగా టీ షర్ట్‌లను యూనియన్ సహకారంతో అందిస్తున్నట్టు పేర్కొన్నారు. యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియూ) గెలిచిన మరుసటి రోజు నుంచే కార్మికుల సంక్షేమం, కంపెనీ పురోగతి కోసం యూనియన్ కార్మికులు సంయుక్తంగా కృషి చేస్తున్నందుకు సంస్థ యాజమాన్యం ముందుకు వచ్చి కార్మికులకు ప్రోత్సాహకారంగా టీ షర్ట్‌లను పంపిణీ చేసిన యాజమాన్యానికి యూనియన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటనారాయణ రెడ్డి, యూనియన్ ప్రతినిధులు తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజు, రాము పాల్గొన్నారు.



వీఆర్ హాస్పిటల్‌లో యూరాలజీ సేవలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి గణేష్‌నగర్ కాలనీలోని వీఆర్ హాస్పిటల్‌లో యూరాలజీ వైద్య సేవలు నూతనంగా అందుబాటులోకి వచ్చాయని హాస్పిటల్ ఎండీ వై.నంద కిషోర్ తెలిపారు. సోమవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ యురాలజీ వైద్యులు కృష్ణ కార్తీక్, పిడియాట్రిక్ వైద్యులు శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ఇప్పటికే హాస్పిటల్‌లో 24/7 చిన్నపిల్లలు వైద్య సేవలు అందుబాటులోకి ఉండగా ఇక నుంచి వారంలో 3 రోజులు ప్రముఖ యురాలజీ వైద్యులు కృష్ణ కార్తీక్ కూడా అందుబాటులో ఉంటాడని వెల్లడించారు. యురాలజీకి సంబంధించిన అన్ని రకాల శస్త్రచికిత్సలు ఈ హాస్పిటల్‌లో చేయడబుతాయని చెప్పారు. తమకు వ్యాపారం ముఖ్యం కాకుండా సేవా భావంతో రోగులకు తక్కువ ఫీజుతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్, కృష్ణ కార్తీక్‌ను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్ సన్మానించారు.

జర్నలిజం విద్యార్థులు భాషపై పట్టు పెంచుకోవాలి

- తెలుగు వర్సిటీ వీసీ కిషన్ రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జర్నలిస్టులు, ఆ కోర్సు చదివే విద్యార్థులు భాషపై పట్టు పెంచుకోవాలని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కిషన్‌రావు అన్నారు. సమాజంపైనా అవగాహనతో ముందుకు పోవాలని సూచించారు. సోమవారం నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీల జర్నలిజం విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కిషన్ రావుతో పాటు వర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్, మాజీ రిజిస్ట్రార్ సత్తిరెడ్డి, ప్రొఫెసర్లు సుధీర్‌కుమార్, హసీనా అతిథులుగా హాజరై మాట్లాడారు. సీనియర్ల నుంచి జూనియర్ విద్యార్థులు సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు వర్సిటీ అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. జర్నలిజం వృత్తి పవిత్రమైనదనీ, దాని గొప్పతనాన్ని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా అతిథులతో పాటు ఎంసీజే సెకండియర్ చదువుతున్న సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ వేణుగోపాల్, బీసీ కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్‌లను సన్మానించారు. అలాగే జర్నలిజం స్టూడెంట్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ రావు, నవీన్, జక్కుల వెంకటేశ్, లవకుమార్, హబీబ్ ఖాద్రి, రాకేష్, అరవింద్, రాము, ప్రియాంక, జ్యోతి, రమణి, అనిల్ కుమార్, ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు

పట్టు వస్త్రాలు అందజేత

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



చీర్యాల గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణానికి సర్పంచ్ టి.ధర్మేందర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏటా మల్లన స్వామి కల్యాణానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం ద్వారా గ్రామ సర్పంచ్ తుంగ ధర్మేందర్ ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రముఖ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ కమలానగర్ ఆఫీసులో ప్రముఖ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ జన్మదినం సందర్భంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. చార్లెస్ డార్విన్ సంస్మరణ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ విద్యావేత్త, ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం శ్రీ నాగయ్య , ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాసులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. ప్రముఖ రచయిత స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు చారి మాట్లాడుతూ చార్లెస్ డార్విన్ చేసిన ప్రయోగాలు మానవాళికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. చార్లెస్ డార్విన్‌ను డాక్టర్ చేయాలని వాళ్ళ తండ్రి భావిస్తే దానికి భిన్నంగా క్రైస్తవ మత ప్రభాతకుడిగా మారాలని బైబిల్ తో నావలో బయలుదేరాడన్నారు. 1868 లో డార్విన్ "ది వారియేషన్ ఆఫ్ ఆనిమల్స్ అండ్ ప్లాంట్స్ అండర్ డొమెస్టికేషన్" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. "ఇంసెక్టివోరస్ ప్లాంట్స్" "డీసెంట్ ఆఫ్ మ్యాన్", "ది ఫార్మేషన్ ఆఫ్ గజిటబుల్ మౌల్డ్ థ్రూ ది ఏక్షన్ ఆఫ్ వర్మ్స్" వంటి వి ఈయన రాసిన మరికొన్ని పుస్తకాలు ఈ డార్విన్ పరిణామ సిద్ధాంతం అనేక సాక్ష్యాలతో రుజువుకావడంతో మత గ్రంథాల సృష్టివాదాలు అపోహాలని రుజువవుతోంది. మానవ పరిణామం కూడా ఇంతటితో ఆగకుండా భవిష్యత్తులో నూ కొనసాగుతుందన్నారు. భారత దేశం లాంటి వెనుకపడిన దేశంలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ప్రచారం కావలసి ఉందని అన్నారు. నాగయ్య శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం సభికులందరూ డార్విన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జి.శివరామకృష్ణ, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, లక్ష్మణ్, జె.చంద్రశేఖర్, సాంబశివరావు, జయప్రకాష్, రాజమల్లు, స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఈ నెల 20న వాహనాల వేలం

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాలల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 20న వేలం వేస్తామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో వివిధ పోలీస్‌స్టేషన్లలో దాదాపు 283 ఆటోలు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ వాహనాలకు సంబంధిత యజమానులు తీసుకెళ్లలేదని, దాంతో వేలం వేస్తున్నామని స్పష్టం చేశారు. అంబర్‌పేట్‌లోని సీటీ ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్‌క్వార్టర్స్‌లో(పరేడ్ గ్రౌండ్‌లో) వాహనాలున్నాయన్నారు. బహిరంగ వేలం పాట ద్వారా వాహనాలను విక్రయిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు వాహనాలను ఈ నెల 17, 18 రెండు రోజులు పరిశీలించుకునే అవకాశముందన్నారు. పూర్తి వివరాలకు 9441037994, 8008338535లో సంప్రదించాలని కోరారు.

మెడిబావి ప్రాంతంలో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

మేడిబావి, దేఢ్ లాక్ బిల్డింగ్ ప్రాంతంలో కార్పొరేటర్ సామల హేమ సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి వివిధ అభివద్ధి పనులను పరిశీలించారు. సీవరేజీ లైన్ సమస్య శాశ్వత పరిష్కారంపై అధికారులతో కలిసి చర్చించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మురుగు కాల్వలను శుభ్రపరచాలని, పవర్ బోర్ల మరమ్మతులు చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ డ ఎస్‌బీ, జీఎం రమణా రెడ్డి, డీజీఎం కష్ణ, మేనేజర్ అన్విత్ పాల్గొన్నారు.

సర్కారు భూముల్లో వెలసిన పేదల గుడిసెలు

- పీర్జాదీగూడలో ఇండ్లు కేటాయించాలని కోరుతూ గుడిసెలు వేసుకున్న ప్రజలు
- బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు కేటాయించిన స్థలంలో గుడిసెలు వేయడంపై అధికారుల్లో ఆందోళన



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 103 లో గల సర్కారు భూమిలో స్థానిక పేద ప్రజలు తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గుడిసెలు వేసుకున్నారు. పేదలు ఆందోళన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి అక్కడికి చేరుకుని అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించడంలో సర్కారు విఫలం అయ్యిందని అందుకే సర్కారు భూముల్లో గుడి సెలు వేసుకున్నారని అన్నారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు అందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పేదలకు న్యాయం జరిగే వరకు వారి ఆందోళనకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ స్టేట్ కో-ఆర్డినేటర్ పవన్ గౌడ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి మోహన్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి తీసుకువేళ్తా..

పేద ప్రజలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న సంగతి తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ పాశం శశిరేఖ బుచ్చి యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అర్హులైన పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న విధంగానే ఇక్కడ కూడా అర్హులకు న్యాయం జరిగేలా ఈ విషయాన్ని స్థానిక మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా ఉండేందుకు గాను మేడిపల్లి సీఐ గోవర్ధన గిరి ఆధ్వర్యంలో భారీ బందొబస్తు ఏర్పాటు చేశారు.

రజక ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన భూమికే ఎసరా?

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా అన్ని కులాల వారికి రాష్ట్ర రాజధాని కేంద్రంగా ఆత్మగౌరవ భవనాలు నిర్మించే కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి మండల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 103లో రజక ఆత్మగౌరవ భవనానికి మూడు ఎకరాల స్థలం కేటాయింపు చేసింది. కేటాయింపు ఎలా ఉన్నా ఇప్పటి వరకు అక్కడ ఎలాంటి ప్రారంభోత్సవం చేపట్టకపోవడంతో ఖాళీ స్థలం ఉండడంతో ఈ స్థలంపై కొంత మంది కన్ను పడడంతో అక్కడ పేదల పేరిటా గుడిసెలు వేసే కార్యక్రమాన్ని కావాలనే చేపట్టినట్టు తెలుస్తుంది. ఇక్కడి స్థానిక నాయకులకు రజక ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించడం మొదటి నుంచి ఇష్టం లేని వారే పేదలు గుడిసెలు వేసేలా ప్రోత్సహించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.తమ ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన స్థలంలో వేరే వాళ్లు వచ్చి గుడిసెలు వేసుకున్నారనే సమాచారం అందుకున్న రజక సంఘాల నేతలు పి.కుమార స్వామి, కె.సంపత్, ఎ.నగేష్, కల్యారి ఎల్లయ్యలు సంఘటన స్థలానికి చేరుకుని స్థానిక తహసీల్దారుకు, మేడిపల్లి సీఐకి సమాచారం అందించడంతో పాటు బీడీ ఫెడరేషన్ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చిన అధికారులు రజక ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన స్థలం ఎటు పోదని స్పష్టం చేశారు.



మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లను పెంచాలి

- ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య
- బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తెలుగు సంక్షేమ భవన్ ముట్టడి



నవతెలంగాణ-మెహిదీపట్నం

పెరిగిన ధరలకనుగుణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మెస్ చార్జీలు స్కాలర్ షిప్‌లను పెంచాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీసీ విద్యార్థి సంఘం నాయకులు అంజి, నీలా వెంకటేష్, రామకష్ణల నాయకత్వంలో వందలాది విద్యార్థులు మాసబ్ ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ధర్నాకు హాజరైన ఆర్ కష్ణయ్య మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం నాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లను ప్రభుత్వం నేటికీ కొనసాగించడం దురదృష్టకరమన్నారు. ఇటీవల కాలంలో అన్ని నిత్యవసర వస్తువుల ధరలు మూడు రేట్లు పెరిగాయని కానీ ప్రభుత్వం పాత మెస్ ఛార్జీలే ఇవ్వడంతో హాస్టల్, గురుకుల పాఠశాల విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లిస్తున్న ప్రభుత్వం.. బీసీ విద్యార్థులకు మాత్రం చెల్లించకపోవడం తీవ్ర అన్యాయం అన్నారు. బీసీలు ప్రభుత్వానికి పనులు కట్టడం లేదా అని ప్రశ్నించారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లిస్తే ప్రభుత్వానికి రూ. 150 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల మెస్ చార్జీలను, స్కాలర్ షిప్‌లను పెంచాలని, అలాగే ఇంజనీరింగ్ పీజీ తదితర కోర్సులు చదివే బీసీ విద్యార్థుల పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బీసీ సంక్షేమ సంఘం నాయకత్వంలో ప్రభుత్వంపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీసీ నాయకులు అనంతయ్య తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అత్యధిక వేతనాలు ఉన్న ఉద్యోగులు రాష్ట్రంలోనే..

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ- సుల్తాన్ బజార్

దేశంలో అత్యధిక వేతనాలు ఉన్న ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నారని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కోఠిలోని డీఎంఈ ఆడిటోరియంలో అధ్యక్షుడు కలిముద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సంవత్సరాన్నికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్ని చెప్పి, ఇప్పుడుఉద్యోగాలు ఉడా కొడుతున్నారన్నారు. ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ కోసం కొత్త ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నామని.. త్వరలోనే విధివిధానాలు వస్తాయని చెప్పారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంటి వెలుగు లాంటి కార్యక్రమం పెట్టి ప్రజలకు కంటి పరీక్షలు చేయాలని, ఆ ఆలోచన చేసిన ఏకైక సీఎం మన కేసీఆర్ అని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు ఏమైనా మిగిలి ఉంటే త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి మమత. ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు కలిముద్దీన్. ప్రధాన కార్యదర్శి కే శ్రీనివా సులు. అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్ రామాంజనేయులు. కోశాధికారి చంద్రశేఖర రావు. వివిధ జిల్లాల డిఎంహెచ్ ఓ లు. ఉద్యోగులు పాల్గొన్నారు

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొత్త పోలీసు స్టేషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 20 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆరు జోన్లలో జోన్‌కు ఒకటి చొప్పున మహిళా పోలీస్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 13 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దోమలగూడ, లేక్ పోలీసు స్టేషన్, ఖైరతాబాద్, వారాసిగూడ, తాడ్బన్, బండ్లగూడ, ఐఎస్ సదన్, టోలీచౌకి, గుడిమల్కాపూర్, మాసబ్ ట్యాంక్, ఫిల్మ్ నగర్, రహమత్ నగర్, బోరబండలో కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఆరు జోన్లలో జోన్‌కు ఒకటి చొప్పున మహిళా పోలీస్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇదిలావుండగా మారేడుపల్లి, బోయిన్‌పల్లి, జూబ్లీహిల్స్, ఎస్ఆర్ నగర్, అంబర్‌పేట్, నల్లకుంట, నారాయణగూడ,చిలకలగూడ, బహదూర్‌పురా, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, టోలిచౌకి, లంగర్ హౌజ్‌లలో కొత్త ట్రాఫిక్ పోలీసు స్టేషన్లను సైతం ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే కొత్త పోలీసు స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని నియమించనున్నారు.

921మంది రోగులకు కండ్లద్దాల పంపిణీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్



తెలంగాణ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జనవరి 19 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు విక్రమ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో రీజినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ కోఠి వైద్య బృందం నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో 921 మంది రోగులకు కండ్లద్దాలు పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.మాధవి, శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ ఎం.మనోజ్ రెడ్డి తెలిపారు. సోమ వారం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం మొదలైన నుంచి నేటి వరకు తమ కంటి వెలుగు శిబిరంలో 921 మంది రోగులు లబ్ధి పొందినట్టు చెప్పారు. వారికి ఉచితంగా మందులు, కండ్లద్దాలు అందజేసినట్టు వారు తెలిపారు. కంటి వైద్యులు టి.రాజు, డిఈఓ అమ్రాన్ సుల్తానా, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు అనురాధ, శ్రీదేవి, ఉమా పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేస్తాం



- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- నాలా రిటర్నింగ్ వాల్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా హుస్సేన్ సాగర్ నాలా రిటర్నింగ్ వాల్ పనులు పూర్తి చేస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్ బస్తీలో నాలా రిటర్నింగ్ వాల్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుస్సేన్ సాగర్ నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణంతో చుట్టుపక్కన లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుంది తెలిపారు. వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకొని రిటర్నింగ్ వాల్ నిర్మిస్తామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జయసింహ, సీనియర్ నాయకులు ముఠా నరేష్, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్ కుమార్, కార్యదర్శి పోతుల శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్ ,మారిశెట్టి నర్సింగ్ రావు, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, మచ్చుకుర్తి ప్రభాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా క్రీడల్లో సత్తా చాటిన సిటీ కళాశాల విద్యార్థులు



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఖేలో ఇండియా యువజన క్రీడల్లో భాగంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 11 వరకు మధ్యప్రదేశ్‌లోని 11 నగరాలలో జరిగిన ఫెన్సింగ్ అండర్ 18 విభాగంలో తెలంగాణ తరపున సిటీ కళాశాల విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు. ఈ మేరకు బీఏ విద్యార్థులు బేబి రెడ్డి, మురళి, బి.శ్రవణ్‌లు కళాశాల పేరును మరోసారి జాతీయ స్థాయిలో చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్.పి.బాల భాస్క ర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేబి రెడ్డి రజత పతకం సాధించగా, మురళి, శ్రవణ్‌లు కాంస్య పతకాలు సాధించి కళాశాలకే కాక, రాష్ట్రానికి కూడా గర్వకారణంగా నిలిచారని అన్నారు. ఇలా తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై విజయాన్ని చేజిక్కించుకోవటం సంతోషంగా ఉందన్నారు. విజేతలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

జీహెచ్ఎంసీ పాలకవర్గానికి రెండేండ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ఎన్నికైన జీహెచ్ఎంసీ పాలకవర్గానికి నేటితో రెండేండ్లు పూర్తయ్యాయి. నగర మేయర్‌గా గద్వాల్ విజయలక్ష్మి ఎన్నికై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకు న్నారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది ఇతరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి పారు. నగర మేయర్‌గా 11 ఫిబ్రవరి 2021 సంవత్సరం నుంచి 2023 వరకు రెండు సంవత్సరాల పాటు నగర మేయర్‌గా విశిష్ట సేవలు అందించిన మేయర్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నగర మేయర్ హైదరాబాద్ నగర అభివృద్ధికి చేపట్టిన పలు ఎస్ఎన్‌డీపీ పనులు, చెరువుల దత్తత, మహిళా దినోత్సవం, స్టాండింగ్ కమిటీ, స్వతంత్ర భారత వజ్రోత్సవం వేడుకలు, మోడల్ గ్రేవ్ యార్డ్‌లు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చెరువుల దత్తత, గ్రీన్ సిటీ అవార్డు, సిస్టర్ సిటీ, బన్సీలాల్‌పేట్ స్టెప్‌వెల్ పునరుద్ధరణ ప్రాజెక్ట్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫ్లై ఓవర్స్, మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్స్, భారత రాష్ట్రపతి పర్యటన, సమ్మర్ కోచింగ్ క్యాంప్, శానిటేషన్ వర్కర్స్‌తో మీటింగ్, జోనల్ లెవెల్ మీటింగ్, సేఫ్టీ హెల్త్ కిట్‌ల పంపిణీ తదితర అంశాలలో సాధించిన పురోగతిపై మేయర్ అభిమానులు రూపొందించిన 'హమారా హైదరాబాద్ 2022-23' బుక్‌ను గద్వాల్ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ అమెరికా పర్యటనలో సిస్టర్ సిటీలో భాగంగా న్యూయార్క్, నార్త్ కెరోలినాను సందర్శించానన్నారు. నగర మేయర్‌గా హైదరాబాద్ నగరం నుంచి హెల్త్, ఎడ్యుకేషన్‌లో పరస్పర ఒప్పందం చేసుకోవడానికి ఆశాజనకంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో ఉన్న హరితహారం, ఇతర అభివృద్ధి పనులు చూడటానికి ఏప్రిల్ నెలలో హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తారని అన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన



నవతెలంగాణ-ఓయూ

ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ బేగంపేట్ వారు నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ సహకారంతో సోమవారం సాయంత్రం తార్నాక లోని ఎన్ఎంఐఎంఎస్ మేనేజ్‌మెంట్ కాలేజ్ విద్యార్థులకు, రేసోనేన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై ఒక రోజు అవగాహన కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు బాధ్యతగా వ్యవహరిస్తూ ఇతరులు కూడా నియమాలు పాటించే విధంగా చూడాలని సూచించారు. 18 ఏండ్లు నిండి లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ మొదలైనవి యువత నిస్సంకోచంగా చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు,ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



నవతెలంగాణ-అంబర్ పేట

స్వచ్ఛతకు ప్రతీ ఒక్కరు సహకరించి అనారోగ్యాల పాలు కాకుండా చూసుకోవాలని హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అన్నారు. సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా హిమాయత్ నగర్ డివిజన్‌లో పబ్లిక్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కలను నిజం చేయాలంటే సామాన్య ప్రజల భాగ్యస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛత కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

సురక్షితమైన అండ్ ప్రైవేట్ మెసేజింగ్‌కు వాట్సప్ గైడ్

నవతెలంగాణ-హైదరాబాద్

సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం త్వరలో రానుంది. ఈ ఏడాది దాని గురించి మాట్లాడాలనుకుంటున్నారా? ఆన్‌లైన్‌లో జీవితం గురించి సంభాషణల కోసం స్పేస్‌ని ఏర్పరుస్తుంది అనే థీమ్‌తో వాట్సప్ డిజిటల్ భద్రత ప్రాముఖ్యత గురించి మాట్లాడుతోంది. వినియోగదారుల భద్రతపై నియంత్రణను తీసుకునేలా వ్యక్తులను శక్తివంతం చేసే భద్రతా సాధనాలు, ఉత్పత్తి ఫీచర్లపై అవగాహన పెంచే ప్రయత్నంలో సురక్షితమైన, ప్రైవేట్ మెసేజింగ్‌కు ఉపయుక్త మయ్యే గైడ్‌ను విడుదల చేసింది. స్కామ్‌లను గుర్తించడం, తప్పుడు సమాచారం నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితం చేయడం వరకు, వాట్సాప్ యూజర్ గైడ్ నేటి ఫిజిటల్ లివింగ్ యుగంలో మనం ఎక్కువగా ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ సమస్యలకు పరిష్కారాలను అందించాలని భావిస్తోంది. 1. వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచండి, 2. మీ ఖాతాను సురక్షితంగా ఉంచడానికి భద్రతా లేయర్‌ను జోడించండి, 3. ఫార్వర్డ్ చైన్‌ను బ్రేక్ చేయండి, 4. స్కామ్‌లను గుర్తించి, రిపోర్ట్ చేయండి, 5. ఫేక్ న్యూస్? వాస్తవాన్ని పరిశీలించుకోండని వాట్సప్ గైడ్‌లో తెలుపుతోంది.

ఓయూ రిజిస్ట్రార్‌కు బీఆర్ఎస్‌వీ నేతల వినతిపత్రం



నవతెలంగాణ-ఓయూ

ప్రతీ డిపార్టుమెంటులో పీహెడీ ఖాళీలు పెంచి అడ్మిషన్ ప్రక్రియలో తెలంగాణ రోస్టర్ విధానాన్ని అమలు పరచాలని కోరుతూ బీఆర్ ఎస్‌వీ నాయకులు సోమవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రో.లక్ష్మీ నారాయణ కు వినతిపత్రాన్ని అందజేశారు. యూనివర్సిటీ పీహెచ్డి నోటిఫికేషన్ ఆగస్టులో వస్తే నవంబరులో వచ్చిన యూజీసీ నిబంధనలు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. యూజిసి నిబంధనల ప్రకారం ఎంఫిల్ పూర్తి చేసిన వారికి క్యాటగిరి 1లో ఇంటర్వ్యూకి పిలవాలని, డిపార్టుమెంటు వారిగా అర్హత సాధించిన విద్యార్థుల సమాచారం విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు తక్షణమే నింపాలని విద్యార్థులు కోరారు

సత్యనగర్‌లో త్వరలోనే నూతన డ్రయినేజీ పనులు

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

త్వరలోనే సత్య నగర్‌లో నూతన డ్రయినేజీ, సీసీ రోడ్లు పనులు ప్రారంభిస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ పరిధి లోనీ సత్య నగర్ లో స్థానిక అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు, అలాగే పెన్షన్లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్య నగర్ వాసులు దృష్టికి తీసుకు వచ్చిన సమస్యల మీద ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికీ సత్యనగర్‌లో డ్రయినేజీ సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా 40 లక్షల రూపాయల వ్యయంతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కాలనీ వాసులు అడిగినట్టు కమ్యూనిటీ హాల్లో అవసరమైన సదుపా యాలను, షెడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అదే విధంగా సొంత ఖర్చుతో పాడైపోయిన బోరు మరమ్మత్తు పనులు చేయిస్తానని తెలిపారు. కొందరు కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సొంత స్థలం ఉన్న అర్హులైన వారికి ఇండ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం ఇవ్వనున్న రూ.3 లక్షల మంజూరు అయ్యేలా చూస్తానని తెలిపారు. అదే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, జీహెచ్ఎంసీ డీఈ సువర్ణ, ఏఈ దివ్య, వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్, టౌన్ ప్లాన్ ఏసీపి సాయిబాబా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిడ్డి రాంబాబు, బస్తీ ప్రెసిడెంట్ రాంచందర్, బస్తీ వాసులు రాజేష్, ప్రతిభ, బిక్షపతి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మహిళా నాయకురాళ్లు

గోల్నాక డివిజన్ కు చెందిన బీజేపీ మహిళ నాయకురాళ్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. ప్రధానంగా బీజేపీ గొర్ల డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు కనకమ్మలతోపాటు మరో 60 మంది బీజేపీ మహిళా నాయకురాళ్లు సోమవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వీరందరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగు సంవత్సరాలలో అంబర్పేట నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న విషయాన్ని తెలుసుకుంటున్న బీజేపీ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ముస్ముందు మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పద్మ, దేవలక్ష్మి, అర్చన, సంధ్య, సత్య తదితరులతో పాటు బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు బీ.నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ పనులకు అనుమతివ్వండి



- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ వినతి

నవతెలంగాణ-అడిక్ మెట్

గాంధినగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఆదేశాలు జారీ చేయాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సోమవారం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగ్గా కార్పొరేటర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం, పార్కుల అభివద్ధితో పాటు ముఖ్యంగా గత ఏడాది 2022 నవంబర్‌లో స్పీడ్ బ్రేకర్స్ కోసం విన్నవించామని.. 3 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదని తెలిపారు. రోడ్లపై వేగంగా వెళ్తున్న వాహనాల ద్వారా ప్రజలకు తీవ్ర ఇబ్బందూ ఎదుర్కుంటున్నారని, కావున ప్రత్యేక చొరవతో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి స్పీడ్ బ్రేకర్‌ల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. యువ నాయకులు వినయ్ కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం మహొత్తమమైనది

- ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్



నవతెలంగాణ - ధూల్‌పేట్

రక్తదానం మహొత్తమమైనదని, రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. అంతర్జాతీయ లవ్ యూ ఫౌండేషన్ ఏసీవో, తెలంగాణ రాష్ట్ర యూఎస్ డీజీసీ హైదరాబాద్ శాఖల ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణాదానం అన్నారు. ఫౌండేషన్ కొరియా వ్యవస్థాపక సభ్యురాలు జాన్ గిల్ జా మాట్లాడుతూ.. తమ సంస్థ సుదీర్ఘ ప్రయాణంలో నగరంలోని ఉస్మానియా దవాఖానలో 508వ వరల్డ్ వైడ్ రక్త దాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. పేద రోగులకు తమ వంతు ఉదారభావ కార్యక్రమాన్ని నిర్వహించేలా కృషి చేసిన టీఎస్ యూఎన్ డీజీసీ హైదరాబాద్ శాఖ చైర్మెన్ ఎం.మధు, వైస్ చైర్మన్ ఆశీషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో 136 మంది ఫౌండేషన్ సభ్యులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో ఆర్ ఎంవో-1 డాక్టర్ బి.శేషాద్రి, డిప్యూటీ ఆర్ఎంవో - 1 డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఆర్ఎంవో, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.అనురాధ, ఆర్ఎంవోలు డాక్టర్ సిద్దిఖీ, డాక్టర్ కవిత, పాథాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్లు, నర్సింగ్ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

మందుబాబుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

- ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకన్న



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో చిక్కిన 11 మందిని సోమవారం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. తొలిసారిగా పట్టుబడ్డ వారికి రూ.2,100 జరిమానా, రెండోసారి దొరికిన నారాయణగూడ ప్రాంతానికి చెందిన ప్రయివేటు ఉద్యోగి గొంటి ముక్కల రాజుకు రూ.3,300 జరిమానా, 3 రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. అలాగే మూడోసారి దొరికిన నల్లకుంట ప్రాంతానికి చెందిన ప్రయివేటు ఉద్యోగి ప్రణబ్ పాల్ చౌదరికి రూ.3,300 జరిమానా, ఏడాది పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, పికెట్, సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ప్రయివేటు ఉద్యోగి కె.శైలేష్‌కు రూ.2,100 జరిమానా, 6 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ తీర్పు ఇచ్చినట్టు నారాయణగూడ ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకన్న తెలిపారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానందకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-దుండిగల్



గాగిల్లాపూర్ గ్రామంలో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న భవనంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని కోరిన వెంటనే ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్ళి మంజూరు చేసేలా కృషి చేసినందుకు సంజీవరెడ్డి రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం సంజీవరెడ్డి నేతృత్వంలో నాయకులు ఎమ్మెల్యేని వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటి మురళి, సి.మురళి, సి.పరంధామ, సి.దామోదర్, సి.నిఖిల్, సి.అరుణ్ పాల్గొన్నారు.

గ్యాదరి బాలమల్లుకు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి రంగారెడ్డి నగర్ డివిజన్ రంగారెడ్డి నగర్ పారిశ్రామిక వాడ (ఐ డి ఏ కూకట్ పల్లికి) చెందిన మానస టూల్ టెక్ అధినేత, కవి, గాయకులు, పారిశ్రామికవేత్త వాకిటి రామిరెడ్డి సోమవారం బషీర్‌బాగ్ పారిశ్రామిక భవనంలో (టి.ఎస్.ఐ.ఐ .సి.) చెర్మన్ గ్యాదరి బాలమల్లు జన్మదినోత్సవం పురస్కరించుకుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు శుభాకాంక్షలు తెలిపారు. బంగారు తెలంగాణలో పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ తో పాటు చిన్నతరహా పరిశ్రమలకు కొత్త పారిశ్రామిక స్థలాలు మంజూరు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. చెర్మన్ బాలమల్లు మరింత శక్తితో పరిశ్రమ వర్గాలకు అండదండలందించాలని కోరారు.

ఎగ్జిబిషన్ ఆదాయంతో నూతన విద్యా సంస్థలు

- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- నుమాయిష్ ముగింపు వేడుకలు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ తెలంగాణ రాష్ట్రంలో విద్యా సంస్థలను నెలకొల్పి విద్యా వ్యాప్తికి పాటు పడుతోందని హోం మంత్రి మహమూద్ అలీ తెలిపారు. సోమవారం నాంపల్లిలో నుమాయిష్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమం చేస్తున్న సమయంలో అప్పటి పాలకులు రాష్ట్రం ఏర్పడితే విద్యుత్, సాగునీటి సమస్య, శాంతి భద్రతల సమస్య ఏర్పడుతుందన్నారని, రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల వారు వారి రాష్ట్రాలలో అమలు పరుస్తున్నారన్నారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని



ఉమ్మడి పది జిల్లాలలో ఒక్క జిల్లా తప్ప తొమ్మిది జిల్లాలు వెనకబడి ఉన్నాయని ఎద్దేవ చేశారని, నేడు అన్ని జిల్లాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని తెలిపారు. నగరంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే నుమాయిష్‌కు ఎంతో చరిత్ర ఉందని, నుమాయిష్ లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులు విచ్చేసి వ్యాపారాలు నిర్వహిస్తారని తెలిపారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో సొసైటీ రాష్ట్రంలో విద్యా సంస్థలను నెలకొల్పి విద్యా వ్యాప్తికి పాటు పడుతోందని కొనియాడారు. ప్రధానంగా మహి ళలకు విద్యా బోధన చేయిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి విద్యా బోధన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశారని వివరించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీస్‌శాఖకు ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులను కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం నుమాయిష్ విజయవంతంగా సాగేందుకు పాటుపడిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్టాల్ హోల్డర్లకు, పలు తరగతు లలో ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కొంద రికి గోల్డ్ మెడల్స్ అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విన్ మార్గం, సెక్రటరీ సాయినాథ్ దయాకర్ శాస్త్రి, జాయింట్ సెక్రటరి వనం సురేందర్, నరోత్తం రెడ్డి పాల్గొన్నారు.

గౌడవెల్లి మల్లన్న జాతర మహోత్సవంలో మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధి గౌడవెల్లి గ్రామంలోని మల్లిఖార్జున స్వామి జాతర మహోత్సవంలో సోమవారం కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డికి నాయకులు ఘనస్వాగతం పలికారు. జాతర మహోత్సవంలో భాగంగా ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం స్వామి కళ్యాణం, సాయంత్రం అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు, గొలుసు తెంపుట వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ ఎంపీపీ పద్మజగన్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, బీఆర్ఎస్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ రణదీప్ రెడ్డి, డైరెక్టర్ అప్పల కృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు గోమారం శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సదానంద్ గౌడ్, సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ పెంటమ్మ యాదవ సంఘం నాయకులు పెద్దగొల్ల దాసరి శంకర్, బండారి సింహాలు యాదవ్, ఎల్.రవిందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానందకు సన్మానం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వడ్డెర కులస్తుల సమస్యలపై గళమెత్తిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందుని సోమవారం రాష్ట్ర అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర జాతిని బీసీ జాబితా నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్పించాలన్న తమ డిమాండ్‌ను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో సమస్య పరిష్కారానికి మొట్ట మొదటిసారిగా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ వేముల లక్ష్మణ్, నేషనల్ హానరబుల్ ప్రెసిడెంట్ నారాయణ స్వామి, నేషనల్ మహిళా ప్రెసిడెంట్ తిరుమలాదేవి,



నేషనల్ జనరల్ సెక్రెటరీ గుంజ శ్రీనివాస్, స్టేట్ ప్రెసిడెంట్ ఎత్తారి మారయ్య, జనరల్ సెక్రెటరీ గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు నారాయణ, రామకృష్ణ, నరసింహ, వైస్ ప్రెసిడెంట్ పుల్లయ్య, సెక్రెటరీ స్వామి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హనుమయ్య సోషల్ మీడియా కన్వీనర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అదానీపై 'జేపీసీ' వేయడానికి ఎందుకంత భయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అదానీ అక్రమలపై జేపీసీ వేయాలని కోరుతూ సోమవారం దేశవ్యాప్తంగా ఆర్బిఐ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమాలకు కుత్బుల్లాపూర్ నుండి సీపీఐ కార్యకర్తలు హాజరయ్యారు. అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాడు అని హిడెన్బెర్గ్ నివేదిక వచ్చాక వాటిపై జాయింట్ పార్లమెంట్ కమిటీ వేసి ప్రజలకు నిజానిజాలు చెబితే బాగుంటుందని కానీ బీజేపీ, మోడీ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదన్నారు. దాంట్లో ఎవరి తప్పు లేదని తేలితే ఏదైనా చెప్పుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. జాయింట్ పార్లమెంట్ కమిటీలో బీజేపీకి చెందిన ఎంపీలే ఎక్కువగా ఉన్నారనీ, అయినా వేయకపోవడం వెనుకల అద్వానీపై మోడీనే సహాయం చేస్తున్నాడని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను బలపరుస్తున్నయన్నారు. గ్లోబల్ ప్రచారం చేసుకున్నట్లు ఒకవేళ మోడీ బీజేపీ నిజాయితీ గలవారైతే వెంటనే జేపీసీ వేసి నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. అదానీ కంపెనీలోకి ఎల్ఐసీ, ఎస్‌బీఐ ద్వారా రూ.వేల కోట్లు అందులోకి మళ్లించి నేడు అందులో నుంచి సుమారు రూ.70 వేల కోట్లు ఆవిరి అయిపోయాయని ఇదంతా ప్రజల సొమ్మని అన్నారు. అదానీ నుంచి వసూలు చేసి ప్రజలకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇది చిన్న విషయంగా పరిగణిస్తే రానున్న రోజుల్లో ప్రజలకు చెందిన అనేక రూ.లక్షల కోట్లు అదానీ లాంటి వారికి అప్పజెప్పి ప్రజలను దివాలా తీస్తారన్నారు. జేపీసీ వేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, మండల కోశాధికారి సదానంద, మాజీ కౌన్సిలర్ నరసయ్య, మండల కార్యదర్శి శ్రీనివాస్, బాచుపల్లి మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, అశోక్ రెడ్డి, మల్లేష్, ఇమామ్, యాదన్న, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను పరిశీలించిన శ్వేతా మహంతి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



మూసాపేట బస్తీ దవాఖానతో పాటు కూకట్‌పల్లిలోని పలు డివిజన్ లలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి, డాక్టర్ చందర్, పీఓ ప్రభాకర్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద కార్పోరేట్ ఔట్ రీచ్ ప్రోగ్రామ్ను పరిచయం చేసిన ఎథర్ ఎనర్జీ

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలో సుప్రసిద్ధ ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారు, ఎథర్ ఎనర్జీ తమ అతిపెద్ద కార్పోరేట్ ఔట్ ప్రోగ్రామ్ ను ప్రారంభించడం ద్వారా దేశంలో ఈ మొబిలిటీని ప్రోత్సహిస్తుంది. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని 2500కు పైగా సంస్థల ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని ప్రారంభించారు. ఈ కార్యక్రమంతో కార్పోరేట్ ఉద్యోగులు ఎథర్ స్కూటర్లను కొనుగోలు చేసిన ఎడల మొత్తంమ్మీద 16,259 రూపాయల ప్రయోజనాలను పొందగలరు. ఈవీ రంగంలో సుప్రసిద్ధ సంస్థగా, ఈ కార్యక్రమంతో ఈవీల స్వీకరణను ఎథర్ మరింత వేగవంతం చేయనుంది. నేటితో ప్రారంభించి, గతంలో ఎన్నడూ వినని రీతిలో ఆఫర్లను కార్పోరేట్ ఉద్యోగుల కోసం ఎథర్ పరిచయం చేసింది. దీనిలో భాగంగా రూ.4వేల కార్పోరేట్ రాయితీ, రూ.4వేల విలువ కలిగిన మార్పిడి బోనస్, ఎథర్ కొనుగోలు చేసిన ఎడల తీసుకునే రుణాలపై పన్నుల ఆదా చేసుకోవడం చేయవచ్చన్నారు. ఉత్పత్తి కోణంలో చూస్తే, ఎథర్ ఇప్పుడు కాంప్లిమెంటరీగా 8,259 రూపాయల విలువ కలిగిన (450 ఎక్స్ మాత్రమే) రెండు సంవత్సరాల ఎక్స్టెండెడ్ బ్యాటరీ (తయారీదారు అందించే మూడు సంవత్సరాల వారెంటీ కంటే అదనం) అందిస్తుంది. ఈ ఆఫర్లు 28 ఫి బ్రవరి 2023 వరకూ మాత్రమే అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ తెలిపింది.

జింబాబ్వే ట్రేడ్ కమిషనర్‌గా డాక్టర్ రవి కుమార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జింబాబ్వే ఇండియా ట్రేడ్ కౌన్సిల్‌కు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు జింబాబ్వే ట్రేడ్ కమిషనర్ రాయబారిగా డాక్టర్ రవి కుమార్ పనస నియమితులయ్యారు. న్యూఢిల్లీలో ఇండియన్ ఎకనామిక్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్, డిప్యూటీ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మినిస్టర్, జింబాబ్వే రాయబారి రాజ్ కుమార్ మోడీ డాక్టర్ రవి కుమార్ పనసకి నియామకపత్రం అందజేశారు. పనస గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డా.రవి పనస ఈ కొత్త బాధ్యతను చేపట్టడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "భారత్, జింబాబ్వే మధ్య ద్వైపాక్షిక సంబంధాలను నెలకొల్పడం, కొత్త శిఖరాలను చేరుకోవడం నా లక్ష్యం. ఏప్రిల్ 2023లో రానున్న భారత ప్రతినిధి బృందం భారత్ వైపు నుంచి విపరీతమైన ఆసక్తిని చూస్తుంది" అని తెలిపారు. డా.పనస వ్యాపార ప్రపంచంలో ఎంతో అనుభవాన్ని సంపాదించడంతో పాటు, వ్యాపార నిర్వహణ, మీడియా ప్రమోషన్‌లలో యూనెస్కో ఐఎస్‌సీఈడీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆయన నాయకత్వంలోని పనస గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో ఎంఎల్ లగ్జరీ స్పిరిట్స్, పనస మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్, పనస ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి.

నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు దోహదం

నవతెలంగాణ-శామీర్‌పేట

నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు దోహదపడతాయని శామీర్‌పేట సీఐ సుధీర్ కుమార్ అన్నారు. మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని శామీర్‌పేట సీఐ సుధీర్ కుమార్ కోరడంతో అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ క్యాతం కృష్ణమూర్తి కుమారుడు ఉన్నత విద్యావంతులు యువ నాయకులు క్యాతం మధుక్రిష్ణ సానుకూలంగా స్పందించి సోమవారం శామీర్ పేట పేట సిఐ సుధీర్ కుమార్‌కు రు.2లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత మధు క్రిష్ణ మాట్లాడుతూ సీఐ సూచన మేరకు సామాజిక బాధ్యతగా



తను సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉంటే ఉన్నతమైన సమాజం నిర్మితమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవికుమార్, మునీందర్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యనందించాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను అందించడంతో భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధిస్తారని బాలాజీ నగర్ డివిజన్ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు అన్నారు. సోమవారం ప్రగతి నగర్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ను ఆమె పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్‌లను చూసి అభినందించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో మేధాశక్తి పెంపొందుతుందన్నారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సుశీల్ కుమార్, భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మార్పీఎస్' జాతీయ రహదారి దిగ్బంధం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సోమవారం హైదరాబాద్ ,విజయవాడ జాతీయ రహదారిపై హయత్ నగర్ చౌరస్తాలో దాదాపు నలభై నిమిషాలు బైఠాయించి ధర్నాకు దిగారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ 9 సంవత్సరాలు అవుతున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలను మోసం చేస్తున్నదని, ఒకపక్క వేలాది ఖాళీలతో వివిధ డిపార్ట్మెంట్‌లలో ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడిన సందర్భంగా వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగలకు దక్కాల్సిన వేలాది ఉద్యోగాలు కోల్పోతున్నామని, విద్య ఉద్యోగ రంగంలో తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులాలకు సైతం రిజర్వేషన్లు తీసుకొచ్చి డిమాండ్ ఉన్న రాష్ట్రాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వర్గీకరించుకునే హక్కు ఉందని చెప్పిన బీజేపీ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మాత్రం చేయకుండా మాదిగలకు నమ్మకద్రోహం చేస్తున్నదన్నారు. మాదిగలను మోసం చేసిన పార్టీలన్నీ రాష్ట్రంలో దేశంలో భూస్థాపితమైనట్లుగానే బీజేపీకి తెలంగాణలో పుట్టగతులు లేకుండా చేస్తామని తెలిపారు. వర్గీకరణ చేయకుంటే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో బీజేపీకి రాజకీయంగా బుద్ధి చెబుతామని, మాదిగ వాడల్లోకి,



మాదిగ పల్లెలోకి బీజేపీని రానివ్వకుండా తరిమి కొడతామని హెచ్చరించారు. రహదారిపై బైఠాయించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి 36 మందిని బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ బత్తిని సుధాకర్ మాదిగ, మాదిగ మహిళ సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు జెపి లత మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు నాగభూషణం, డల్ల సురేష్, పెద్దింటి గీత, సుజాత, డప్పు మల్లికార్జున్, టీ.వి నరసింహా, ఎమ్మార్పీఎస్ నాయకులు కనక ప్రమోద్, శనిగారపు మురళీకష్ణ, ప్రణీత్, రఘువరన్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



నవతెలంగాణ-బాలానగర్

అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో బాలానగర్ డివిజన్ పరిధిలోని శోటోఖాన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన గోనెల గౌరీ శంకర్, వి.కీర్తన సత్తా చాటారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ శోటోఖాన్ ఇనిస్టిట్యూట్ మాస్టర్ మురళి మాట్లాడుతూ న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించిందని తెలిపారు. ఈ పోటీలకు నాలుగు దేశాలకు చెందిన విద్యార్థులు దాదాపు 2500 మంది పాల్గొన్నారనీ, బీ గ్రూప్‌లో 12 సంవత్సర విభాగంలో తమ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు గౌరీ శంకర్, కీర్తన మూడో స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం మార్షల్ ఆర్ట్స్ విద్యను ప్రోత్సహిస్తూ తమకు సహకారం అందిస్తే ఇలాంటి బహుమతులను మరెన్నో గెలిచి దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటుతామని తెలిపారు.

విజయవంతంగా ముగిసిన అతిపెద్ద ప్లాస్టిక్స్ ప్రదర్శన ప్లాస్ట్ ఇండియా

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రపంచంలో అతిపెద్ద ప్లాస్టిక్స్ ప్రదర్శనగా గుర్తింపు పొందిన ఇంటర్నేషనల్ ప్లాస్టిక్స్ ఎగ్జిబిషన్ ప్లాస్ట్‌ఇండియా 2023 పదకొండవ ఎడిషన్ విజయవంతంగా ముగిసింది. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనకు 3.60 లక్షల మంది సందర్శకులు విచ్చేశారు. ప్లాస్టిక్స్ పరిశ్రమలో అత్యంత ప్రభావవంతమైన ప్రదర్శనగా గుర్తింపు పొందిన ఈ ప్రదర్శనలో 1800 మంది ఎగ్జిబిటర్లు తమ ప్రపంచశ్రేణి ప్రాసెసింగ్ మెషినరీ, ముడి పదార్థాలు, రీసైక్లింగ్ సాంకేతికత, తాజా ఆటోమేషన్ సాంకేతికతలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్లాస్ట్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు జిగిష్ దోషీ మాట్లాడుతూ... ముడిపదార్థాలు, మెషినరీ, ఫినిష్ ఉత్పత్తులు సైతం ఒకేచోట ప్రదర్శించడం వల్ల ఎగ్జిబిటర్లు, సందర్శకులు ప్రయోజనం పొందారన్నారు. ప్రపంచం ఇప్పుడు భారత్ వైపు చూస్తుందంటూ సరైన విధాన నిర్ణయ మద్దతు ఉంటే ప్లాస్టిక్స్ పరంగా త్వరలోనే ఇండియా అంతర్జాతీయ కేంద్రంగా నిలువనుందన్నారు. ప్లాస్ట్‌ఇండియా 2023 నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఛైర్మన్ అజయ్ షా మాట్లాడుతూ... ప్లాస్ట్ ఇండియా 2023 ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రదర్శించిన సాంకేతికతలు, ఆవిష్కరణలు భవిష్యత్తు రోడామ్యాప్ వేశాయన్నారు.



ఆర్థిక నడవడిక మంచి రక్షణ

నవతెలంగాణ-శామీర్‌పేట

మంచి ఆర్థిక నడవడిక నిజమైన రక్షణ అని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం మూడు చింతలపల్లి మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అభిషేక్ అగస్త్య హాజరై రెండు కిలోమీటర్లు రన్‌ను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఆర్‌బీఐ ఆదేశాలు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ రమణామూర్తి, ఎంపీపీ హారిక, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, సీబీఐ మేనేజర్, సర్పంచులు జాం రవి, రాంచంద్రయ్య, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారలు స్పిన్ ఆడలేకపోతున్నారు. కెఎల్ రాహుల్ ప్రదర్శన తీసికట్టుగా మారింది. రోహిత్ శర్మ ఏడాది తర్వాత టెస్టు మ్యాచ్ ఆడుతున్నాడు. అయినా, భారత్ టెస్టుల్లో దూసుకుపోతుంది. టాప్ ఆర్డర్‌లో కీలక బ్యాటర్లు నిలకడగా విఫలం అవుతున్నప్పటికీ స్వదేశంలో అద్వితీయ టెస్టు విజయాలు నమోదు చేస్తోంది. అందుకు కారణం, లోయర్ ఆర్డర్‌లో విలువైన ఇన్నింగ్స్‌లు నిలకడగా నమోదు కావటమే. ఆస్ట్రేలియాతో నాగ్‌పూర్ టెస్టులోనూ ఇదే జరిగింది.

తోకతో కొట్టేస్తున్నారు!

- భారత్ విజయాల్లో లోయర్ ఆర్డర్ పాత్ర
- బంతితో, బ్యాట్‌తో రాణిస్తున్న జడేజా, అశ్విన్, అక్షర్

నవతెలంగాణ క్రీడావిభాగం



అప్పుడు అలా, ఇప్పుడు ఇలా!

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్ బోణీ చేసింది. నాగ్‌పూర్ టెస్టు మ్యాచ్‌ను క్రికెట్ పండితులు 2017 బెంగళూర్ టెస్టుతో పోల్చుతున్నారు. ఆ టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి రోజు 189 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా మంచి ఆరంభం సాధించటంతో చిన్నస్వామిలో ఆతిథ్య జట్టు మరింత వెనుకంజ వేసింది. నాగ్‌పూర్‌లో ఆస్ట్రేలియా తొలి రోజు 177 పరుగులకు ఆలౌటైంది. భారత్‌కు మంచి ఆరంభం దక్కటంతో ఆసీస్‌కు కష్టాలు తప్పలేదు. అయితే, బెంగళూర్‌లో భారత్ పుంజుకుని గుర్తుండిపోయే విజయం సాధించగా..నాగ్‌పూర్‌లో ఆస్ట్రేలియా ఆ పని చేయలేదు. అందుకు కారణం, బెంగళూర్ టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 269/7 వద్ద నిలిచినా.. 276 పరుగులకే కుప్పకూలింది. నాగ్‌పూర్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 240/7తో నిలిచింది. కానీ ఇక్కడ భారత లోయర్ ఆర్డర్‌ను ఆస్ట్రేలియా కట్టడి చేయలేకపోయింది. ఏడు వికెట్లు పతనమైనా భారత్ మరో 56.2 ఓవర్లు ఆడి 160 పరుగులు జోడించింది. బెంగళూర్, నాగ్‌పూర్ టెస్టులు దాదాపుగా ఒకే తరహాలో సాగినా.. భారత లోయర్ ఆర్డర్ ఫలితంలో వ్యత్యాసం చూపించింది. నాగ్‌పూర్‌లో జడేజా, అక్షర్, షమి మధ్య రెండు 50 ప్లస్ భాగస్వామ్యాలు నమోదయ్యాయి.

తోక భాగస్వామ్యాలు

స్వదేశంలో భారత్‌కు తిరుగులేదు. నాణ్యమైన స్పిన్నర్లు భారత్ సొంతం. అశ్విన్, జడేజా, అక్షర్ సహా వాషింగ్టన్ సుందర్‌లు భారత్‌ను మేటి స్పిన్ జట్టుగా నిలిపారు. స్పిన్ పిచ్‌లపై మాయజాలంతో పాటు విలువైన పరుగులతోనూ భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అటు బంతితో, ఇటు బ్యాట్‌తో భారత్‌ను ముందంజలో నిలుపుతున్నారు. 2021 ఆరంభం నుంచి స్వదేశీ టెస్టుల్లో భారత్ ఏడో వికెట్ పడిన తర్వాత 12 సార్లు 50 ప్లస్ పరుగుల భాగస్వామ్యాలు నమోదు చేసింది. ఈ సమయంలో మరో జట్టుకు ఇన్ని భాగస్వామ్యాలు సాధించలేదు. ఇంగ్లాండ్, పాకిస్తాన్ 8 అర్థ సెంచరీ భాగస్వామ్యాలతో రెండో స్థానంలో నిలిచాయి. లోయర్ ఆర్డర్ 12 అర్థ శతక భాగస్వామ్యాలను భారత్ నాలుగు సార్లు వంద పరుగుల భాగస్వామ్యాలుగా మలిచింది. భారత లోయర్ ఆర్డర్ నిలకడగా ఈ ప్రదర్శన చేయటం అసమానం. లోయర్ ఆర్డర్‌లో ప్రతి నాలుగు భాగస్వామ్యాలకు ఓ అర్ధ సెంచరీ భాగస్వామ్యం నిర్మించారు. ఇది సాధారణ విషయం కాదు.



కండ్లుచెదిరే గణాంకాలు

2021 ఆరంభం నుంచి స్వదేశంలో స్పిన్ ఆల్‌రౌండర్ల రికార్డు మామూలుగా లేదు. వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా సగటు 60కి పైగా ఉండగా.. అక్షర్ పటేల్ 31.22, అశ్విన్ 28.38 సగటుతో పరుగులు పిండుకున్నారు. వికెట్ల మాయగాళ్లు పరుగుల ప్రవాహంలో కదం తొక్కటంతో భారత్‌పై భారత్‌లో టెస్టు విజయం సాధించటం విదేశీ జట్లకు అసాధ్యంగా మారింది. 2017 ఆస్ట్రేలియాతో రాంచీ టెస్టులో సాహా శతకం, అదే సిరీస్‌లో ధర్మశాలలో జడేజా, సాహా భాగస్వామ్యం ఈ కోవలోకే వస్తాయి. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో టెస్టులో భారత లోయర్ ఆర్డర్ ఏకంగా ఐదు 50 ప్లస్ భాగస్వామ్యాలు నిర్మించింది. ఈ సిరీస్‌లో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ కీలక పాత్ర పోషించారు. ఇక ఆస్ట్రేలియా పర్యటనలో లోయర్ ఆర్డర్ మాయ కొనసాగింది. అక్కడ అశ్విన్, వాషింగ్టన్ సుందర్ నిలకడగా పరుగుల వరద పారించారు. దీంతో భారత్‌పై టెస్టు విజయం సాధించేందుకు అశ్విన్, జడేజా, అక్షర్ స్పిన్‌ను ఎదుర్కొంటే సరిపోదు.. ఆ త్రయాన్ని బ్యాట్‌తోనూ సమర్థవంతంగా నిలువరించాలి. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న ఈ త్రయం బ్యాట్‌తో, బంతితో ప్రత్యర్థులతో ఓ ఆట ఆడుకుంటుంది!.

WPL AUCTION

మహిళల క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం. ఐపీఎల్ ఆరంభ సీజన్ ఆటగాళ్ల వేలానికి 15 వసంతాలు నిండగా.. మహిళల ప్రీమియర్ లీగ్ చారిత్రక క్రికెటర్ల వేలం ముగించుకుంది. మహిళల క్రికెట్ స్టార్ క్రికెటర్ల కోసం వేలంలో ఐదు ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించాయి. స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన వేలంలో రూ.3.4 కోట్ల రికార్డు దక్కించుకుంది. విదేశీ క్రికెటర్లు ఆష్లె గార్డ్‌నర్, నటాలీ సీవర్‌లు రూ.3.2 కోట్ల చొప్పున కైవసం చేసుకున్నారు. దీప్తి శర్మ, జెమీమా రొడ్రిగస్, షెఫాలీ వర్మలు సైతం రికార్డు ధర దక్కించుకున్నారు.



మంధానకు రూ.3.4 కోట్లు

- గార్డ్‌నర్‌కు, నటాలీ సీవర్‌కు రూ.3.2 కోట్లు
- దీప్తి శర్మ, జెమీమా, షెఫాలీలకు రికార్డు ధర

మహిళల ప్రీమియర్ లీగ్ క్రికెటర్ల వేలం





నవతెలంగాణ-ముంబయి

మహిళల క్రికెట్‌లో కోట్ల వర్షం కురిసింది. ఎన్నాండ్లుగానే ఎదురుచూసిన క్షణం రానే వచ్చింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభ క్రికెటర్ల వేలంలో ఊహించినట్టుగా భారత స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన రికార్డు ధర దక్కించుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జట్టు మంధాన కోసం మూడో వంతు డబ్బు ఖర్చు చేసింది. రూ.3.4 కోట్ల రికార్డు ధరకు మంధానను కొనుగోలు చేసింది. వేలంలో భారత, విదేశీ స్టార్ క్రికెటర్ల కోసం గట్టి పోటీ కనిపించింది. ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్ సోమవారం జరిగిన వేలంలో 409 మంది క్రికెటర్లు నిలువగా.. 87 మందిని ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. అందులో 57 మంది భారత క్రికెటర్లు కాగా, 30 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. అసోసియేట్ దేశానికి చెందిన తారా నోరిస్ (అమెరికా) తొలి డబ్ల్యూపీఎల్‌లో ఆడనుంది.



మంధానపై కోట్ల వర్షం : స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ రికార్డు ధర వెచ్చించింది. రూ.50 లక్షల కనీస ధరకు వేలంలోకి వచ్చిన మంధాన కోసం ముంబయి ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోటీపడ్డాయి. చివరకు రూ.3.4 కోట్లకు బెంగళూర్ తీసుకుంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ముంబయి ఇండియన్స్ తీసుకుంది. ఢిల్లీ, బెంగళూర్ నుంచి పోటీ ఎదురైనా రూ.1.8 కోట్లకు ముంబయి సొంతం చేసుకుంది. సోఫీ డెవిన్‌ను రూ.50 లక్షల కనీస ధరకు తీసుకున్న బెంగళూర్.. ఆసీస్ క్రికెటర్ ఎలిసీ పెర్రీ కోసం రూ.1.7 కోట్లను పెట్టింది. ఆసీస్ స్టార్ ఆష్లె గార్డ్‌నర్ విదేశీ క్రికెటర్లలో అత్యధిక ధర అందుకుంది. ముంబయి, వారియర్స్ పోటీపడినా.. గుజరాత్ జెయింట్స్ రూ.3.2 కోట్ల ధరకు గార్డ్‌నర్‌ను ఎగరేసుకుపోయింది. ఇంగ్లాండ్ స్పిన్ ఆల్‌రౌండర్ సోఫీ ఎకల్‌స్టోన్ రూ.1.8 కోట్ల ధరకు యూపీ వారియర్స్‌కు వెళ్లిపోయింది. వేలంలో తొలి సెట్ క్రికెటర్లలో ఏకంగా ముగ్గురిని బెంగళూరే కొనుగోలు చేసింది.





భారత క్రికెటర్లలో స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రికార్డు ధర సొంతం చేసుకుంది. క్యాపిటల్స్, జెయింట్స్, ముంబయి పోటీపడినా.. యూపీ వారియర్స్ రూ.2.6 కోట్ల ధరకు దీప్తిని కొనుగోలు చేసింది. పేసర్ రేణుక సింగ్‌ను రూ.1.5 కోట్ల ధరకు బెంగళూర్ తీసుకుంది. స్టార్ ఆల్‌రౌండర్ నటాలీ సీవర్ బ్రంట్ కోసం ముంబయి ఏకంగా రూ.3.2 కోట్ల రికార్డు ధరను పెట్టింది. యూపీ, ఢిల్లీలు నటాలీ కోసం గట్టిగా ప్రయత్నించాయి. ఆసీస్ ఆల్‌రౌండర్ తహ్లియ మెక్‌గ్రాత్ రూ.1.4 కోట్ల ధరకు యూపీ వారియర్స్ గూటికి చేరుకుంది. పరుగుల యంత్రం బెత్ మూనీ రూ. 2 కోట్ల ధరకు గుజరాత్ జెయింట్స్‌కు దక్కగా.. రూ.2 కోట్ల ధరకు షెఫాలీ వర్మ, రూ. 2.2 కోట్ల ధరకు జెమీమా రొడ్రిగస్‌లు ఢిల్లీ క్యాపిటల్స్ క్యాంప్‌లో పడ్డారు. పూజ వస్త్రాకర్ రూ.1.9 కోట్లు (ముంబయి), రిచా ఘోష్ రూ.1.9 కోట్లు (బెంగళూర్)లు భారీ ధర దక్కించుకున్నారు.

అత్యధిక ధర (రూ. కోట్లు)

స్మృతీ మంధాన	3.4
ఆష్లె గార్డ్‌నర్	3.2
నటాలీ సీవర్	3.2
దీప్తి శర్మ	2.6
బెత్ మూనీ	2.0
షెఫాలీ వర్మ	2.0





వేలంలో అమ్ముడైన క్రికెటర్లు : 87
వేలంలో ఖర్చు చేసిన డబ్బు : రూ.59.50 కోట్లు
విదేశీ క్రికెటర్లు : 30 | దేశవాళీ క్రికెటర్లు : 57

ఇక తెలుగు క్రికెటర్లలో అరుంధతి రెడ్డి, సబ్బినేని మేఘన, అంజలి, యశశ్రీలు వేలంలో ఫ్రాంచైజీలను ఆకర్షించారు. రూ. 30 లక్షలకు అరుంధతి రెడ్డిని ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకోగా.. రూ.55 లక్షలకు అంజలి శ్రావణిని యూపీ వారియర్స్ కొనుగోలు చేసింది. సొప్పదండి యశశ్రీ రూ. 10 లక్షల కనీస ధరకు యూపీ వారియర్స్‌కు దక్కగా.. సబ్బినేని మేఘన రూ.30 లక్షల ధరకు గుజరాత్ టైటాన్స్ సొంతమైంది.

మహిళల ప్రీమియర్ లీగ్ జట్లు

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : స్మృతీ మంధాన, సోఫీ డివైన్, ఎలిసీ పెర్రీ, రేణుక సింగ్, రిచా ఘోష్, ఎరిన్ బర్న్స్, దిశా కశాట్, ఇంద్రాని రాయ్, శ్రేయాంక పాటిల్, కణిక అహుజ, ఆశా శోభన, హీథర్ నైట్, డేన్ వాన్ నికెర్క్, ప్రీతి బోస్, పూనమ్ ఖేమ్నర్, కోమల్, మేఘన్ స్కాట్, సహన పవార్.

ముంబయి ఇండియన్స్ : హర్మన్‌ప్రీత్ కౌర్, నట్ సీవర్ బ్రంట్, ఆమేలి ఖేర్, పూజ వస్త్రాకర్, యస్తికా భాటియ, హీథర్ గ్రాహం, ఇస్సీ వాంగ్, అమన్జోత్ కౌర్, గుజ్జర్, షైక, మాథ్యూస్, చోలె, హుమైరా, ప్రియాంక, సోనమ్, జింటిమని, నీలం బిస్త్.

గుజరాత్ జెయింట్స్ : ఆష్లె గార్డ్‌నర్, బెత్ మూనీ, సోఫీ డంక్లె, అనాబెల్ సుథర్‌లాండ్, హర్లీన్ డియోల్, డాటిన్, స్నేహ్ రానా, సబ్బినేని మేఘన, జార్జియా, మన్సీ జోషి, హేమలత, తనుజ కన్వార్, మోనిక పటేల్, సుష్మ వర్మ హర్లీ, అశ్విని కుమారి, సిసోడియ, షబ్నమ్.

యూపీ వారియర్స్ : సోఫీ ఎకల్‌స్టోన్, దీప్తి శర్మ, తహ్లియ మెక్‌గ్రాత్, షబ్నిమ్ ఇస్మాయిల్, అలీసా హీలే, అంజలి శ్రావణి, రాజేశ్వరి గైక్వాడ్, పర్వశి చోప్రా, శ్వేత షెరావత్, యశశ్రీ, కిరణ్ నవ్‌గిరె, గ్రేస్ హారిస్, దేవిక, లారెన్ బెల్, లక్ష్మీ యాదవ్, సిమ్రన్ షేక్.

ఢిల్లీ క్యాపిటల్స్ : జెమీమా రొడ్రిగస్, మెగ్ లానింగ్, షెఫాలీ వర్మ, రాధ యాదవ్, శిఖా పాండే, మరిజానె కాప్, టిటాస్ సదు, అలైస్ కాప్సే, తారా నోరిస్, జెసియ, మిన్ను మణి, తానియ భాటియా, జెస్ జొనాసెన్, స్నేహ దీప్తి, పూనమ్ యాదవ్, అరుంధతి రెడ్డి, అపర్ణ మండల్.

ముగిసిన మల్లయుద్ధ పోటీలు

విజేతలకు రూ.30 లక్షల నగదు బహుమతి ప్రదానం



హైదరాబాద్: నాలుగురోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ముఖేశ్ గౌడ్ స్మారక 'మల్లయుద్ధ' రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా ముగిశాయి. బాలకేసరి, పురుషుల, మహిళల విభాగాల్లో ఓవరాల్‌గా 17 కేటగిరీలు పోటీలు నిర్వహించారు. మహిళల ఓపెన్ విభాగంలో రోహిణి సత్య శివాని పసిడి పతకం సాధించగా.. నేహా, రుహినా భాను రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. బాలకేసరి విభాగంలో షేక్ అజీం బంగారు పతకం గెల్చుకోగా.. పర్వేజ్, పవన్‌లు ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచారు. పురుషుల విభాగంలో భగీరత్ సింగ్ (38 కేజీలు), రవి భారత్ (42 కేజీలు), కె.ఎస్ కిషన్ (48 కేజీలు), మహ్మద్ అబ్దుల్ (52 కేజీలు), లవకుశ గౌడ్ (53 కేజీలు), డి. వినోద్ (57 కేజీలు), అరవింద్ కుమార్ (61 కేజీలు), సయ్యద్ అబ్దుల్లా (65 కేజీలు), మహేంద్ర కుమార్ (70 కేజీలు)లు తమ కేటగిరిల్లో బంగారు పతకాలు సాధించారు. ప్రతి విభాగంలో బంగారు పతకం సాధించిన రెజ్లర్‌కు రూ.1 లక్ష, రజత పతకానికి రూ.50 వేలు, కాంస్య పతకానికి రూ.25 వేల నగదు బహుమతులు అందజేశారు. మహిళల ఓపెన్ విభాగం ఫైనల్స్, ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఈటల రాజేందర్.. శ్రేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్ గౌడ్‌తో కలిసి విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు.

ఇండోర్‌లో మూడో టెస్టు

ఆసీస్, భారత్ టెస్టు వేదిక మార్పు



ముంబయి : భారత్, ఆస్ట్రేలియా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టును ధర్మశాల నుంచి ఇండోర్‌కు మార్చుతూ బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. అతిశీతల వాతావరణ పరిస్థితులకు తోడు ఇటీవల నూతన డ్రైనేజీ వ్యవస్థ పనులతో అవుట్‌ఫీల్డ్ దగ్గర పచ్చిక తక్కువైంది. దీంతో మార్చి 1 నుంచి ధర్మశాలలో జరగాల్సిన మూడో టెస్టు వేదికను ఇండోర్‌కు మార్పు చేసింది. ఈ మేరకు బీసీసీఐ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం గతంలో రెండు టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. న్యూజిలాండ్ (2016), బంగ్లాదేశ్ (2019) టెస్టులు ఇక్కడ జరుగగా.. రెండింటా భారత్ భారీ విజయాలు సాధించింది. ఆ రెండు టెస్టుల్లో అశ్విన్ ఏకంగా 18 వికెట్లు పడగొట్టడం విశేషం. భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు ఫిబ్రవరి 17 నుంచి న్యూఢిల్లీలో ఆరంభం కానుంది.

ఓరి వారి.. నా కెరీర్‌లో బెస్ట్ సాంగ్ : నాని



శ్రీకాంత్ ఓదెల, నాని

యువ కథానాయకుడు నాని నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో శ్రీకాంత్ ఓదెల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కీర్తి సురేష్ ఈ సినిమాలో నానికి జోడీగా కనిపించనుంది.

మాస్-అపీలింగ్ ప్రమోషనల్ మెటీరియల్‌తో భారీ అంచనాలని ఈ చిత్రం నెలకొల్పింది. నాని మాసియస్ట్ ఫస్ట్‌లుక్‌తో పాటు ఫస్ట్ సాంగ్ 'ధూమ్‌ధామ్'కు ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇటివలే విడుదలైన దసరా టీజర్ నేషనల్ సెన్సేషన్‌గా నిలిచింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి అన్ని భాషల్లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతుంది.

తాజాగా మేకర్స్ దసరా సెకండ్ సింగిల్ 'ఓరి వారి' పాటని విడుదల చేశారు. మేకర్స్ ముందుగా చెప్పినట్లే 'ఓరి వారి' హార్ట్‌బ్రేక్ సాంగ్. సంతోష్ నారాయణ్ ఈ పాటని హార్ట్ టచ్చింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. మళ్ళీ మళ్ళీ వినాలనిపించే పాట ఇది. శ్రీమణి అందించిన సాహిత్యం పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ప్రతి పదం మనసుని తాకుతుంది. ఈ పాట వాలెంటైన్స్ డేకి పర్ఫెక్ట్ గిఫ్ట్‌గా ఆడియన్స్‌ని అలరించింది.

ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నాకు చాలా ఇష్టమైన పాట 'ఓరి వారి'. నా పర్సనల్ ఫిలాసఫీకి దగ్గర ఉన్న పాట ఇది. ఒకసారి అమ్మాయి మనది కాదన్న తర్వాత కాసేపు బాధపడాలి, ఇలాంటి పాటలు వినాలి. ఇంటికెళ్ళి అవ్వ ఒడిలో దూరి చంటి బిడ్డలా పడుకోవాలి.(నవ్వుతూ). అదే ఈ పాట లిరిక్స్. శ్రీమణి చాలా అద్భుతంగా రాశారు. సంతోష్ నారాయణ్ బ్రిలియంట్ మ్యూజిక్ ఇచ్చారు. విజువల్‌గా ఈ పాట నా కెరీర్‌లో బెస్ట్ సాంగ్. మార్చి 30న స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు స్టన్ అయిపోతారు. వినే కొద్ది నచ్చే పాట ఇది. నెలలు తరబడి నా చెవిలో మోగుతూనే ఉంది. అదే ఎఫెక్ట్ మీ మీద కూడా ఉంటుందని నమ్ముతున్నాను. దసరాకి చాలా సెలబ్రేషన్స్ ఈవెంట్స్ ఉంటాయి. 'దసరా" అందరం సెలబ్రేట్ చేసుకునే సినిమా'అని చెప్పారు.

'ఇది రూటేడ్‌గా, నేచురల్ ఉండే కథ. మా ఊర్లో జరిగిన కొన్ని పాత్రల నుంచి తీసుకొని రాసుకున్న డ్రామా. నాని చాలా హార్డ్ వర్క్ చేశారు. ఈసినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది' అని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అన్నారు

ధీక్షిత్ శెట్టి, సముద్రఖని, సాయి కుమార్, జరీనా వహాబ్ కీలక పాత్రలలో కనిపించనున్న ఈ చిత్రాన్ని మార్చి 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నారు.

శ్రీదేవి..శోభన్‌బాబు మధ్య గొడవ ఏంటి?



సంతోష్ శోభన్, గౌరి జి కిషన్


"చిట పటమని కసిరితే, గుసగుసమని నసిగితే.. పొగరంతా కరిగేలా ర్యాంపాడిస్తా' అని అమ్మాయిపై ఓ అబ్బాయి చిటపట మంటున్నాడు. ఇక అమ్మాయి ఊరుకుంటుందా? 'తల బిరుసుతో ఎగిరితే, మగ బలుపిక ముదిరితే, మొహమాటం పడకుండా రఫాడిస్తా' అంటూ రఫ్‌గా సమాధానం ఇస్తుందమ్మాయి.

ఇలా అబ్బాయి.. అమ్మాయి మాటలతో కాదండోయ్ ఏకంగా పాటలతోనే గొడవలు పడుతున్నారు. అసలు వీళ్ల గొడవకి కారణమేంటో తెలుసుకోవాలంటే మాత్రం ఈనెల 18న రిలీజ్ అవుతున్న 'శ్రీదేవి శోభన్‌బాబు' సినిమా చూడాల్సిందే నంటున్నారు గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేతలు విష్ణు ప్రసాద్, సుస్మిత కొణిదెల.

ఇంతకీ శ్రీదేవి ఎవరు?, శోభన్‌బాబు ఎవరు? వారి మధ్య గొడవేంది? అనేది తెలియాలంటే తప్పకుండా సినిమా చూడాల్సిందేనండోయ్. శోభన్‌బాబుగా సంతోష్ శోభన్.. శ్రీదేవిగా గౌరి జి కిషన్ నటించిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకుడు. ఇటీవల చిత్ర యూనిట్ ఈ సినిమా నుంచి 'టామ్ అండ్ జెర్రీ' లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసింది. కమ్రాన్ సంగీతంలో కిట్టు విస్సాప్రగడ రాసిన ఈ పాటను రేవంత్, సింధుజ శ్రీనివాసన్ పాడారు. ఈ సందర్భంగా నిర్మాతలు సుస్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ, 'మా మనసుకు ఎంతో దగ్గరైన సినిమా. మా అందరిలోని ఇన్నోసెంట్ ఎమోషన్స్ అన్నీ స్క్రిప్ట్‌కి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. సంతోష్ శోభన్, గౌరిలు పాత్రల్లో ఒదిగిపోయారు. మన పక్కన ఇంటిలో జరిగేలాంటి నేటివిటీ ఉన్న కథతో ప్రశాంత్ సినిమాను తెరకెక్కించారు' అని తెలిపారు.

నవచిత్రం

థ్రిల్ చేసే రావణాసుర



రవితేజ

రవితేజ, సుధీర్ వర్మ కాంబినేషన్‌లో అభిషేక్ పిక్చర్స్, ఆర్ టి టీమ్‌వర్క్స్‌పై రూపొందుతున్న ఎంగేజింగ్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. ఈ సినిమాతో ప్రేక్షకుల్ని థ్రిల్ చేయడానికి నిర్మాతలు అభిషేక్ నామా, రవితేజ సిద్ధంగా ఉన్నారు. రవితేజ పుట్టినరోజున రావణాసుర డిఫరెంట్ షేడ్స్ చూపించే ఒక గ్లింప్స్ విడుదల చేయడంతో ప్రమోషన్లను ప్రారంభించారు మేకర్స్.

ఇటీవల హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరిచిన థీమ్ సాంగ్‌ను విడుదల చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్‌లు కూడా స్టార్ట్ అయ్యాయి. ఎలక్ట్రిఫైయింగ్, వైబ్రెంట్ ట్రాక్ మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో నిలిచింది.

హర్షవర్ధన్ రామేశ్వర్‌తో పాటు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందించారు. తాజాగా మేకర్స్ రెండవ సింగిల్ 'ప్యార్ లోన పాగల్' లిరికల్ వీడియోను ఈనెల 18న విడుదల చేయనున్నట్లు ఎనౌన్స్ చేశారు. షేడ్స్‌తో బ్లాక్ అవుట్ ఫిట్ ధరించిన రవితేజ పోస్టర్‌లో అల్ట్రా-స్టైలిష్‌గా కనిపిస్తు గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్‌తో ఆకట్టుకున్నారు.

సుధీర్ వర్మ ఈ సినిమాలో రవితేజను లాయర్ పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా హై యాక్షన్‌లో ప్రజంట్ చేస్తున్నారు. శ్రీకాంత్ విస్సా ఈ చిత్రానికి సరికొత్త కథని అందించారు. సుధీర్ వర్మ తన మార్క్ టేకింగ్‌తో ఈ చిత్రాన్ని కథనంలో ఊహించని మలుపులతో స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు.

సుశాంత్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో అను ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ.. కథానాయికలుగా నటిస్తున్నారు. విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా విడుదల కానుంది.

నేటి విద్యావ్యవస్థకి ప్రతిబింబం



సంయుక్త మీనన్

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు)/ 'వాతి'(తమిళం). శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 17న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ధనుష్ నటించిన తొలి తెలుగు సినిమా కావడంతో 'సార్'(వాతి)పై తమిళ్‌తో పాటు తెలుగులోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా కథానాయిక సంయుక్త మీనన్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

అలా.. సినిమాతో ప్రేమలో పడ్డా..

2016లో మొదటి సినిమా చేశాను. అప్పటికి సినిమానే కెరీర్‌గా ఎంచుకోవాలి అనుకోలేదు. నేను కేరళలోని ఒక గ్రామానికి చెందిన అమ్మాయిని. చుట్టు పక్కల వాళ్లకి ఏదో ఒక సినిమా చేశానని చెప్పుకోవాలి అనుకున్నాను. మొదటి సినిమా తర్వాత చదువు కోసం ఒక ఏడాది విరామం తీసుకున్నాను. కానీ విధి మళ్ళీ సినిమాల్లోకి తీసుకొచ్చింది. నటిగా సంతృప్తినిచ్చే ఒక్క సినిమా చేస్తే చాలు అనుకుని సినిమాలు చేయడం మొదలుపెట్టాను. ఈ క్రమంలో సినిమాతో ప్రేమలో పడ్డాను. ఇప్పుడు సినిమానే జీవితం అయిపోయింది. నటిగా విభిన్న పాత్రలు పోషించి మెప్పించాలి అనుకుంటున్నాను. తెలుగులో సినిమాలు చేయడం మొదలుపెట్టాక ఇది నా కెరీర్‌లో ఉత్తమ దశ అనిపించింది.

కచ్చితంగా చేయాలనుకున్నా..

నేను తెలుగులో మొదట 'బింబిసార', ఆ తరువాత 'విరూపాక్ష' సినిమాల అంగీకరించాను. ఈ సినిమాలు విడుదలయ్యాక కొత్త సినిమాల గురించి ఆలోచించాలి అనుకున్నాను. కానీ ఇంతలో సితార బ్యానర్‌లో 'భీమ్లా నాయక్'లో నటించే ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే నా నటన నచ్చి సితారలో మరో సినిమా అవకాశమిచ్చారు. అదే ఈ చిత్రం. డైరెక్టర్ వెంకీ కథ చెప్పగానే ఈ సినిమా ఖచ్చితంగా చేయాలి అనుకున్నాను. కథ చాలా బాగుంది, అందులో నా పాత్ర కూడా నచ్చడంతో వెంటనే అంగీకరించాను.

ధనుష్‌తో నటించటం హ్యాపీ..

ధనుష్‌తో నటించటం చాలా సంతోషంగా అనిపించింది. ఎప్పటినుంచో ఆయన సినిమాలు చూస్తున్నాను. ఆయనకు అభిమానిని. ఆయన మంచి నటుడు, అలాగే పెద్ద స్టార్ కూడా. కెరీర్ ప్రారంభంలోనే పెద్ద హీరోలతో కలిసి పనిచేయడం మరింత ఆనందంగా ఉంది. అయితే ముందుగా కథ ఎలా ఉంది?, పాత్ర ఎలా ఉంది? అని చూస్తాను. కథ బాగుంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలు సాధిస్తాయి. ఇంకా దానికి స్టార్ తోడైతే ఎక్కువ మందికి రీచ్ అవుతుంది. అలాగే ఆ హీరో అభిమానుల ప్రేమ కూడా దక్కుతుంది.

'భీమ్లా నాయక్' సమయంలో పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ప్రేమ చూపించారు. ఇందులో విద్యావ్యవస్థ గురించి సందేశం ఇవ్వడమే కాదు.. ఎంటర్టైన్మెంట్ కూడా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే అంశాలు ఉన్నాయి.

శక్తివంతమైన పాత్ర చేశా..

డైరెక్టర్ వెంకీ గత సినిమాల్లో మాదిరిగానే ఇందులో కూడా హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. ఇందులో నేను మీనాక్షి అనే బయాలజీ టీచర్‌గా కనిపిస్తాను. ఈ సినిమాలో కథానాయకుడి పాత్రతో పాటు నా పాత్ర కూడా శక్తివంతంగా ఉంటుంది. సినిమా ప్రధాన కథలోకి వెళ్ళినప్పుడు హీరో పాత్రతో పాటు నా పాత్ర ప్రయాణం సాగుతుంది. అలాగే నేను తెలుగు పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. ఇక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయి? ఎలా ప్రవర్తిస్తారు? అనేది తెలుసుకోవడం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని కొన్ని గ్రామాలకు వెళ్ళాను. అంతేకాకుండా టీచర్ల చీరకట్టు ఎలా ఉంటుంది? వాళ్ళ మాట్లాడే తీరు ఎలా ఉంటుంది? ఇలాంటివన్నీ గమనించాను. వెంకీ అట్లూరిలో మంచి రచయిత, దర్శకుడు ఇద్దరూ ఉన్నారు. నటీనటుల నుంచి మంచి ఎమోషన్స్ రాబట్టుకుంటారు. ఈ సినిమాకి డబ్బింగ్ చెప్పలేకపోయాను. అదే సమయంలో ఇతర సినిమాల షూటింగ్‌లు ఉండటం వల్ల ఎక్కువ టైం కేటాయించలేకపోయాను. ఈ సినిమాకి డబ్బింగ్ చెప్పలేకపోయాననే బాధ ఇప్పటికీ ఉంది. ప్రస్తుతం 'విరూపాక్ష' షూటింగ్ చివరి దశలో ఉంది. 'బింబిసార-2' ప్లాన్ చేస్తున్నాం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.